ఆగస్టు -2026
సంపుటి 22
సంచిక 11
ISSN 2582-2411

# దర్శనమ్®

ఆధ్యాత్మిక వార్తామాసపత్రిక

₹ 51/-







తెలంగాణ విద్వత్సభ

పండితాః సమదర్శినః

# తెలంగాణ విద్వత్సభ

# దశాబ్ది మహోత్సవాలు

సిద్ధాంత,జ్యోతిష,ఆగమ,ధర్మ శాస్త్ర సదస్సులు-విద్వద్గోష్ఠి

విద్వత్సమ్మేళనం-రాబోయే శ్రీ ప్లవంగ నామ సంవత్సర పండుగల నిర్ణయం

**వేద,ధర్మ,ఆగమ,సిద్ధాంత,జ్యోతిష శాస్త్ర**
**వరిష్ఠ విద్వన్మూర్తులకు**
**విశిష్ట సేవా పురస్కారంతో సత్కారం**

01-08-2026 శనివారము
02-08-2026 ఆదివారము
ఉ॥ 9 గం.ల నుండి రా॥ 9 గం.ల వరకు

**రవీంద్రభారతి ప్రధానమందిరము**
భాగ్యనగరము

# శ్రీమహాలక్ష్మీ లలితాస్తోత్రమ్

**ధ్యానం :**

చక్రాకారం మహత్తేజః తన్మధ్యే పరమేశ్వరీ
జగన్మాతా జీవదాత్రీ నారాయణీ పరమేశ్వరీ 1

వ్యూహతేజోమయీ బ్రహ్మనందినీ హరిసుందరీ
పాశాంకుశేక్షుకోదండ పద్మమాలాలసత్కరా 2

దృష్ట్వా తాం ముముహుర్దేవాః ప్రణేముర్విగతజ్వరాః
తుష్టువుః శ్రీమహాలక్ష్మీం లలితాం వైష్ణవీం పరాం 3

**శ్రీదేవాః ఊచుః**

జయ లక్ష్మి జగన్మాతః జయ లక్ష్మి పరాత్పరే
జయ కల్యాణనిలయే జయ సర్వకలాత్మికే 1

జయ బ్రాహ్మి మహాలక్ష్మి బ్రహ్మాత్మికే పరాత్మికే
జయ నారాయణి శాంతే జయ శ్రీలలితే రమే 2

జయ శ్రీవిజయే దేవీశ్వరి శ్రీదే జయర్ధిదే
నమః సహస్ర శీర్షాయై సహస్రానన లోచనే 3

నమః సహస్రహస్తాబ్జపాదపంకజశోభితే
అణోరణుతరే లక్ష్మి మహతోఽపి మహీయసి 4

అతలం తే స్మృతౌ పాదౌ వితలం జానునీ తవ
రసాతలం కటిస్తే చ కుక్షిస్తే పృథివీ మతా 5

హృదయం భువః స్వస్తేఽస్తు ముఖం సత్యం శిరో మతం
దృశశ్చంద్రార్కదహనా దిశః కర్ణా భుజః సురాః 6

మరుతస్తు తవోచ్ఛ్వాసా వాచస్తే శ్రుతయో మతాః
క్రిడా తే లోకరచనా సఖా తే పరమేశ్వరః 7

ఆహారస్తే సదానందో వాసస్తే హృదయో హరేః
దృశ్యాదృశ్యస్వరూపాణి రూపాణి భువనాని తే 8

శిరోరుహా ఘనాస్తే వై తారకాః కుసుమాని తే
ధర్మాద్యా బాహవస్తే చ కాలాద్యా హేతయస్తవ 9

యమాశ్చ నియమాశ్చాపి కరపాదనఖాస్తవ
స్తనౌ స్వాహాస్వధాకారౌ సర్వజీవనదుగ్ధదౌ 10

ప్రాణాయామస్తవ శ్వాసో రసనా తే సరస్వతీ
మహీరుహాస్తేఽఙ్గరుహాః ప్రభాతం వసనం తవ 11

ఆదౌ దయా ధర్మపత్నీ ససర్జ నిఖిలాః ప్రజాః
హృత్స్థాత్వం వ్యాపినీ లక్ష్మీః మోహినీ త్వం తథా పరా 12

ఇదానీం దృశ్యసే బ్రాహ్మీ నారాయణీ ప్రియశంకరీ
నమస్తస్యై మహాలక్ష్మ్యై గజముఖ్యై నమో నమః 13

సర్వశక్త్యై సర్వధాత్ర్యై మహాలక్ష్మ్యై నమో నమః
యా ససర్జ విరాజం చ తతోఽజం విష్ణుమీశ్వరం 14

రుద్రం తథా సురాగ్ర్యాంశ్చ తస్యై లక్ష్మ్యై నమో నమః
త్రిగుణాయై నిర్గుణాయై హరిణ్యై తే నమో నమః 15

యంత్రతంత్రాత్మికాయై తే జగన్మాత్రే నమో నమః
వాగ్విభూత్యై గురుతన్వ్యై మహాలక్ష్మ్యై నమో నమః 16

కంభరాయై సర్వవిద్యాభరాయై తే నమో నమః
జయాలలితాపాంచాలీ రమాతన్వై నమో నమః 17

పద్మావతీరమాహంసీ సుగుణాఽఙ్జాశ్రియై నమః
నమః స్తుతా ప్రసన్నైవంఛందయామాస నిర్జరైః 18

**ఫలశ్రుతిః**

**శ్రీలక్ష్మీ ఉవాచ:**

స్తావకా మే భవిష్యంతి శ్రీయశోధర్మసంభృతాః
విద్యావినయసంపన్నా నిరోగా దీర్ఘజీవినః 1

పుత్రమిత్రకలత్రాఢ్యా భవిష్యంతి సుసంపదః
పఠనాచ్ఛ్రవణాదస్య శత్రుభీతిర్వినశ్యతి 2

రాజభీతిః కదనాని వినశ్యంతి న సంశయః
భుక్తిం ముక్తిం భాగ్యవృద్ధిముత్తమాం చ లభేన్నరః 3

**శ్రీలక్ష్మీనారాయణసంహితాయాం దేవసంఘకృతా**
**శ్రీమహాలక్ష్మీలలితాస్తోత్రమ్**

# దర్శనమ్

## ఆధ్యాత్మిక వార్తా మాస పత్రిక

**ఆగస్టు 2026**

సంపుటి-22 విడిప్రతి: రూ. 51/- సంచిక - 11

ISSN 2582-2411 పేజీలు 68

**ఎస్ఆర్ఎస్ పబ్లికేషన్స్ ప్రచురణ**



స్ఫూర్తిప్రదాత

**కీ.శే. మరుమాముల రాజమౌళిశర్మ**

గౌరవ సంపాదకులు

**యాయవరం చంద్రశేఖరశర్మ, ఆర్.వి.వి. కృష్ణారావు**

**మరుమాముల దత్తాత్రేయశర్మ**

ప్రధాన సంపాదకులు

**మరుమాముల వెంకటరమణశర్మ**

ప్రచురణకర్త, సంపాదకులు

**మరుమాముల రుక్మిణి**

సంపాదక మండలి

**డా. పూర్ణప్రజ్ఞా భారతి, అష్టకాల రామ్మోహన్**

**ఆకెళ్ల విభీషణ శర్మ, బాచంపల్లి సంతోష్‌కుమార్‌శాస్త్రి**

**మరుమాముల రామచంద్రమూర్తి**

**ఆదరాసుపల్లి శశిధర్, ప్రసాదవర్మ కామబుషి**

ప్రత్యేక ప్రతినిధి

**పి.వి.ఎం. పవన్,** 81253 36958

ఉప సంపాదకులు

**రామలక్ష్మీ సుబ్రహ్మణ్యం**



website: darshanam.net

**దర్శనమ్**

ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక

**- : ప్రధాన కార్యాలయం : -**

ఇం.నెం. **29-105/4/1,** శ్రీరామ సిద్ధాంతి భవనం
న్యూ విద్యానగర్, నేరేడ్‌మెట్, సికింద్రాబాద్-**56**
ఫోన్, ఫ్యాక్స్: 9441015469

e-mail: darshanameditordesk@gmail.com


మార్కెటింగ్: రైజింగ్ సన్ న్యూస్ ఏజెన్సీ, 9666680857

దర్శనం దర్శనారామ దర్శనం సమదర్శనం
దర్శనం లోక వృత్తాంతాదర్శ దర్శిన్యపేక్షితమ్ ॥
దర్శనాంతర్ముఖి స్పర్శి సద్విమర్శావమర్శనం
దర్శన ప్రతిభూస్థానం జీయాత్ సర్వ నిదర్శనమ్ ॥

**- అష్టకాల నరసింహరామశర్మ**

'దర్శనం దర్శితం యేన దర్శితం సర్వదర్శనమ్
దర్శనం శర్మసంధాతృ దర్శనం దైవదర్శనమ్'

**- అయాచితం నటేశ్వరశర్మ**

## ఈ సంచికలో ...


మంగళగౌరి.. శుభాల కల్పవల్లి ... 7
- కె.బి. రాజేంద్రప్రసాద్

శుభప్రదాయిని... కొల్హాపూర్ మహాలక్ష్మి ... 11
- చింతలపాటి శివశంకరశాస్త్రి

తెలంగాణ ధార్మిక చైతన్య ప్రతీక ... 14
- మరుమాముల వెంకటరమణ శర్మ

జ్యోతిర్మఠ శంకరాచార్యులపై రాజ్యాధికార దౌర్జన్యం ... 17
- మన్నెం నాగేశ్వరరావు

శ్రీమద్దేవీ భాగవతం - డా. వద్దిపర్తి పద్మాకర్ ... 22

మహాతపస్వి చంద్రశేఖర భారతి ... 24
- చెఱుకుపల్లి జమదగ్ని శర్మ

శృంగేరి శారదాపీఠ వైభవం ... 26

సనాతన ధర్మం... సాధికారిక గ్రంథం ... 29
- తాడేపల్లి పతంజలి

మాధవీయ శంకర విజయం ... 32
- తాడేపల్లి పతంజలి

మహాభారత సారసంగ్రహం ... 36
- కీ.శే. డా. పుల్లెల శ్రీరామచంద్రుడు

తిరుమల చరితామృతం - కీ.శే. పివిఆర్‌కె ప్రసాద్ ... 38

రామాయణం రసరమ్యం ... 40
- వనం జ్వాలా నరసింహారావు

అపూర్వమైన కోదండ జలతరంగిణీ నినాదాలు ... 42
- ఆచార్య తాడేపల్లి పతంజలి

క్షయనామ సంవత్సరం... బార్హస్పత్యమానం ... 46
- డా. శంకరమంచి రామకృష్ణ శాస్త్రి

ఆర్షధర్మంపై అన్యుల విషం - డా. కె.అరవిందరావు ... 50

కంచిస్వామి దివ్యచరిత్ర 'గిని-అద్వైత గని' ... 52
- తూములూరి మోహన్ కుమార్

లలితా సహస్రనామ స్తోత్రం - కుప్పా విజయశ్రీ ... 60


ఇందులోని వ్యాసాలు, అందులోని భావాలు రచయితలవే. దానికి, దర్శనమ్ పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. - సంపాదకుడు


# సనాతన ధర్మంపై కుట్రల పడగ

"ధర్మో రక్షతి రక్షితః" - ఎవరైతే ధర్మాన్ని రక్షిస్తారో, వారిని ఆ ధర్మమే రక్షిస్తుంది. ఇది కేవలం ఒక నినాదం కాదు, హైందవ జాతి అస్తిత్వానికి ప్రాణవాయువు. సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని ప్రబోధించే సనాతన ధర్మం దయాగుణాన్ని ఒక బలహీనతగా చూస్తూ, దాని వేళ్ళను నరికేయాలని చూస్తున్న విషనాగులు నేడు మన మధ్యే స్వేచ్ఛగా విహరిస్తున్నాయి. వారు మరెవరో కారు... 'భావప్రకటనా స్వేచ్ఛ', 'లౌకికవాదం', 'అభ్యుదయం' అనే ముసుగులు వేసుకున్న మన స్వదేశీ కుహనా మేధావులు. సమాజంలో ఇతర మతస్తులు బహిరంగంగా చేస్తున్న అరాచకాలపై, మత మార్పిడి మాఫియాల అకృత్యాలపై ఏనాడూ నోరు మెదపని ఈ కపట మేధావులకు 'ధర్మ పరిరక్షణ' అనే పదం చెవిన పడితే చాలు ఉలిక్కిపడతారు. విదేశీ సంస్థలు విసిరే ఎంగిలి నిధులకు ఆశపడి, కన్నతల్లి లాంటి స్వధర్మాన్ని నడిబజారులో అవమానిస్తున్న ఈ జాతి పరాన్నభుక్కుల ఏకైక అజెండా.. పాషండ శక్తులతో, ఉగ్రవాద మూకలతో చేతులు కలిపి హిందూ ధర్మాన్ని సమూలంగా నిర్వీర్యం చేయడమే!

మన పురాతన సంస్కృత గ్రంథాలను, వేదాలను ఆంగ్లంలోకి అనువదించే నెపంతో వాటికి వక్రభాష్యాలు, తప్పుడు అర్థాలు అల్లడం వీరు ఒక పనిగా పెట్టుకున్నారు. హిందూ చరిత్రను వక్రీకరించి, రాబోయే తరాలకు మన సనాతన ధర్మంపై అపనమ్మకం, ఏహ్యాభావం కలిగేలా విద్యా వ్యవస్థలో సైతం విషం చిమ్ముతున్న ఈ సాంస్కృతిక ఉగ్రవాదాన్ని మనం గర్హించాలి. వీరి కుతంత్రాలు ఏ స్థాయిలో ఉన్నాయంటే.. ఐదు శతాబ్దాల రక్త తర్పణాలు, బలిదానాల తర్వాత సాకారమైన అయోధ్య శ్రీరామ జన్మభూమిపై కక్షగట్టారు. మందిర నిర్మాణంపై, ట్రస్టు నిధులపై దారుణమైన అబద్ధాలు, చోరీ ఆరోపణలు చేస్తూ దుష్ప్రచారానికి దిగారు. మరోవైపు కలియుగ వైకుంఠమైన తిరుమల పవిత్రతను సైతం మంటగలిపేలా, శ్రీవారి పాదాల చెంత అన్యమత (ఉర్దూ) విశ్వవిద్యాలయాలను నెలకొల్పే కుట్రలకు ఊతం ఇచ్చారు. పుణ్యక్షేత్రాల ప్రాంగణాల్లో అన్యమత ప్రార్థనా సంస్థలు ఏర్పాటు చేస్తూ హిందూ క్షేత్రాలను ఆక్రమించుకోవాలని చూస్తున్న కుట్రలకు ఈ మేధావులు వంత పాడుతున్నారు.

దేవుళ్లను కించపరుస్తూ, హిందూ ముసుగులోనే ఉంటూ హిందువుల విశ్వాసాలను మంటగలుపుతున్న వీరిని నిలదీస్తే భరించలేరు. మేధావులమనే అహంకారంతో కళ్ళు మూసుకుపోయి ఇప్పుడు భౌతిక దాడులకు సైతం తెగబడుతున్నారు. మొన్నటికి మొన్న ఒక ప్రముఖ టీవీ ఛానల్ చర్చా వేదిక మీద, సనాతన ధర్మం తరపున గొంతు వినిపిస్తున్న వ్యక్తిపై ఏకంగా చెప్పుతో దాడికి దిగిన ఓ ఉన్మాది దురాగతం.. హైందవ సమాజంపై ఈ కుహనా మేధావుల అసహనానికి, బరితెగింపునకు సజీవ సాక్ష్యం.

హిందూ సమాజమా.. ఇంకెన్నాళ్లు ఈ అజ్ఞాత నిద్ర? మన వేదాలపై, మన క్షేత్రాలపై, మన దేవుళ్లపై పదేపదే దాడులు జరుగుతుంటే ఇంకెన్నాళ్లు పట్టీపట్టనట్లు కూర్చుందాం? హిందూ ధర్మం నేర్పిన సహనం అస్సలు పిరికితనం కాదు అన్న సత్యాన్ని ఈ ద్రోహులకు రుచి చూపాల్సిన సమయం ఆసన్నమైంది. ఉగ్రవాద సంస్థలు, మిషనరీలు, విదేశీ మత సంస్థలు ఒక పక్కా వ్యూహంతో సనాతన ధర్మంపై దాడికి దిగుతుంటే.. మనం కుల, వర్గ, ప్రాంతీయ భేదాలతో విడిపోయి వినాశనాన్ని కొని తెచ్చుకుంటున్నాం. ఇక మౌనం వీడదాం! విదేశీ శక్తుల కీలుబొమ్మలైన ఈ కుహనా మేధావుల ముసుగులు చింపేద్దాం. వారిని సామాజికంగా బరిబాతల నిలబెట్టి ఎండగడదాం. సనాతన ధర్మం అనే ఒకే గొడుగు కిందకు హిందూ సమాజం యావత్తూ ఏకం కావాలి. పిడికిలి బిగించాలి. మన పిల్లలకు మన ధర్మం గొప్పదనం, పురాణాల వాస్తవికత, వేదాల పరమార్థం నూరిపోయాలి. ప్రతి హిందువు ఒక ధర్మ రక్షకుడిగా, జాతీయవాదిగా మారిననాడే.. ఈ విదేశీ శక్తుల, దేశీయ ద్రోహుల కుట్రలు పటాపంచలు అవుతాయి. మనల్ని విడదీయాలని చూసే శక్తుల కుట్రలను ఛేదిస్తూ, సనాతన ధర్మ జెండాను విశ్వవేదికపై సగర్వంగా రెపరెపలాడిద్దాం! మేల్కొందాం! ధర్మ పరిరక్షణలో రాజీ పడకుండా సమరశంఖం పూరిద్దాం!!




# పాఠక దర్శిని

మీ అభిప్రాయాలను darshanameditordesk@gmail.comకు పంపగలరు.

## ఆధ్యాత్మిక వికాసాన్ని కలిగించింది

జూలై సంచికలో వచ్చే శ్రీకూర్మ జయంతి ఇచ్చిన వ్యాసం బాగుంది. జీవితంలో విజయం సాధించాలంటే ఎన్ని అడ్డంకులనైనా తట్టుకుని నిలబడే మనోధైర్యం కావాలని ఈ వ్యాసం ద్వారా తెలుసుకోగలిగాం. 'శ్రేష్ఠ పర్వం.. నిష్ఠ ఆంతర్యం.. తొలి ఏకాదశి' శీర్షికన ఇచ్చిన వ్యాసం ఆకట్టుకుంది. ఈ మాసంలో ఆచరించే చాతుర్మాస్యవ్రతం ఆత్మవికాసాన్ని కలిగిస్తుందని, హరి నామ సంకీర్తన ద్వారా మనసును పునీతం చేస్తుందని చాలా చక్కగా వివరించారు. అలాగే జగన్నాథుని రథయాత్ర గురించి ఇచ్చిన వ్యాసం చాలా బాగుంది. కుల, మత, వర్గ, వర్ణ భేదాలు లేకుండా భగవంతుని దృష్టిలో మానవులంతా సమానమే అని స్పష్టం చేసే పర్వం ఈ జగన్నాథుని రథయాత్ర.

**- సిహెచ్. చంద్రశేఖర్, విజయవాడ**

## సంపాదకీయం చాలా బాగుంది

చాతుర్మాస్య వ్రతాన్ని ఎలా ఆచరించాలి, విధి విధానాలు, నియమనిష్ఠలతో పాటు వ్యాస పూజ అంతరార్థాన్ని 'సనాతన ధర్మంలో చాతుర్మాస్య వ్రతం' శీర్షికన వివరంగా తెలిపారు. జ్ఞానాన్ని ప్రసాదించే గురుపరంపర మనకు ప్రాణప్రదం. అలాంటి గురువుపై మిడిమిడి జ్ఞానంతో సోషల్ మీడియా వేదికగా కొందరు విషం చిమ్ముతున్నారు. అలాంటి వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని సూచిస్తూ ఇచ్చిన సంపాదకీయం ఆకట్టుకుంది. సందర్భానుసార వ్యాసాలు, వార్తలు, ఆసక్తి కలిగించే ధారావాహికలు, విజ్ఞానాన్ని కలిగించే కథనాలతో జూలై సంచిక అలరించింది.

**- మల్లాది లలిత, హైదరాబాద్**

## అద్భుత వ్యాసాలను అందిస్తున్నారు

దర్శనమ్ పత్రికలో ప్రచురించే అద్భుతమైన వ్యాసాలను చదవడం నాకు చాలా ఆనందాన్నిచ్చింది. ఇది మన ప్రాచీన విలువలు, ఆచారాలు, సంప్రదాయాలు, అలాగే ఋషులు మనకు అందించిన సందేశం పట్ల హిందువులకు అవగాహనను పెంపొందిస్తుందని నేను నమ్ముతున్నాను. నాదొక సూచన- దయచేసి ప్రతి వ్యాసంలోనూ రచయిత యొక్క టెలిఫోన్ నంబర్‌ను, వారి పరిచయం చేస్తూ ఒకటి రెండు వాక్యాలను, వీలైతే వారి ఈమెయిల్‌ను కూడా ప్రచురించండి. ఇది పాఠకులు, రచయితలు ఒకే భావాలు గల వారి సమూహాన్ని నిర్మించుకోవడానికి ఉపయోగపడుతుంది.

**- టి. హనుమాన్ చౌదరి, ఛైర్మన్, ప్రజ్ఞాభారతి**

### 'దర్శనమ్' చందా వివరాలు

| | |
|---|---|
| 3 సంవత్సరాలకు | రూ. 2000 |
| 6 సంవత్సరాలకు | రూ. 4000 |
| 12 సంవత్సరాలకు | రూ. 8000 |
| రాజపోషకులు | రూ. 15000 |
| మహారాజ పోషకులు | రూ. 25000 |
| విశిష్ట మహారాజ పోషకులు | రూ. 100000 |

A/C NAME : DARSHANAM
BANK: CANARA BANK
A/C NO. 120001974779
IFSC CODE: CNRB0013063

## చందాదారులకు విజ్ఞప్తి

'దర్శనమ్' ధార్మికోద్యమ మాసపత్రిక సనాతన ధర్మ పరిరక్షణే లక్ష్యంగా వెలువడతున్న ఈ పత్రికకు చందాలు, విరాళాలు అందించవలసిందిగా ప్రార్థన. ఈ నెలతో ముగియనున్న తమ చందాలను వెంటనే పునరుద్ధరించుకో వలసిందిగా మనవి. **ఎడిటర్, దర్శనమ్** పేరుతో చెక్కు/డిడి/మనియార్డరు/ ఆన్‌లైన్‌లో చందాలను పంపాల్సిందిగా విజ్ఞప్తి. మీరు ప్రత్యుత్తరాలు జరిపేటప్పుడు చిరునామాలను స్పష్టంగా పిన్‌కోడ్‌తో సహా రాయవలసిందిగా కోరుతున్నాం. చిరునామా మారితే తక్షణం తెలియజేయండి. **- ఎడిటర్**




శ్రావణమాసం... శివకేశవుల ఆరాధనతో, మంగళగౌరీ వ్రతాలతో, భక్తిపారవశ్యంతో పరిమళించే పుణ్యమాసం. ప్రకృతి పచ్చని పట్టు చీర కట్టుకున్న వేళ, ప్రతి గృహమూ వ్రతదీపాల వెలుగులతో ఆధ్యాత్మిక ఆలయంగా మారుతుంది. ఈ మాసంలో ఆచరించే ప్రతి పూజ, ప్రతి నియమం మనసుకు ప్రశాంతతను, జీవితానికి శుభసంపదలను ప్రసాదిస్తుందని శాస్త్రవచనం. శ్రావణ శుక్రవారాల వైభవానికి మణిమకుటంలా ప్రకాశించేది శ్రీ వరలక్ష్మీ వ్రతం. సకల సౌభాగ్యాలకు అధిష్ఠాన దేవతయైన వరలక్ష్మీ అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ఆరాధించే మహోన్నత పర్వదినమిది. అష్టలక్ష్ముల అనుగ్రహాన్ని ఒకే పూజలో పొందే అపూర్వమైన వ్రతరాజంగా వరలక్ష్మీ వ్రతం పురాణప్రసిద్ధి పొందింది. కలశంలో దేవిని ఆవాహన చేసి, తోరణాలతో గృహాన్ని అలంకరించి, మంగళద్రవ్యాలతో అమ్మవారిని అర్చించడం ఈ వ్రతంలోని విశిష్టత. పసుపు, కుంకుమ, పుష్పాలు, నైవేద్యాలతో జరిగే ఈ పూజ కుటుంబ బంధాలను మరింత పవిత్రంగా, పటిష్ఠంగా నిలుపుతుంది. సుమంగళిత్వం, సంతానసౌభాగ్యం, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాభివృద్ధి ప్రసాదించే దివ్య వ్రతంగా భక్తకోటికి ఇది విశ్వాసదీపిక. శ్రావణమాస వైశిష్ట్యాన్ని, వరలక్ష్మీ వ్రత మహిమను హృదయంగమంగా అవగాహన చేసుకొని ఆచరించిన గృహమే లక్ష్మీనివాసమవుతుంది.

సర్వమంగళ మాంగల్యే శివే సర్వార్థ సాధికే ।
శరణ్యే త్ర్యంబకే దేవీ నారాయణీ నమోస్తుతే ॥

సర్వ మంగళగా ప్రసిద్ధిని పొందిన జగన్మాత పార్వతీమాత ప్రార్థన ఇది. ప్రతి పూజ ప్రారంభం లోను, పుణ్యక్రతవుల ఆరంభంలోను, నోములు, వ్రతాలు నిర్వహించే శుభ సందర్భంలోను ప్రతి హైందవ కుటుంబంలోను, విన్పించే ప్రార్థన, కనిపించే ఆధ్యాత్మిక భక్తి నిరతి ఇది. సనాతన ధార్మిక నీతి, విభూతి ఇది. పసుపు గౌరమ్మను భక్తి ప్రపత్తులతో నిల్పి, వినాయకుని పూజతో గౌరీపూజ నిర్వహించడం అనూచానంగా వస్తున్న సంస్కృతీ అనుభూతి ఇది. గౌరవర్ణం గల తల్లి గౌరీమాత. తెలుగు, పసుపు పచ్చని సమ్మిళిత ఛాయ అనే బంగారు వన్నె. ఆ వన్నెనే వేదోపనిషత్తులు "తాం అగ్నివర్ణాం తపసా జ్వలంతీమ్" అంటూ అగ్ని వర్ణంతో, తపోశక్తితో ప్రకాశించే తల్లి దుర్గమ్మ అన్నాయి. "దుర్గాత్ సంత్రాయతే యస్మాద్దేవీ దుర్గేతి కథ్యతే" దుర్గమములు అనగా కష్టముల నుంచి రక్షించే తల్లి అనగా దుఃఖాల నుంచి దురితాల నుంచి రక్షించే కల్పవల్లి దుర్గమ్మతల్లి. ఆ తల్లే

సర్వమంగళ. అందుకే "అమ్మా! నారాయణుని సహోదరివి, ముక్కంటి రాణివి, సర్వశుభాలకు శుభంకరివి, చతుర్విధ పురుషార్థాలను సిద్ధింపజేయగలదానివి, శివానివైన నిన్ను, శరణుకోరి నమస్కరిస్తున్నాను. నా సంకల్పాలకు సానుకూలంగా నేను నిర్వహించే ఈ పూజ, వ్రతం సత్ఫలదాయకంగా పూర్తి కావాలి. అందుకు నీ అనుగ్రహం ఉండాలి" అంటూ ప్రార్థన చేస్తున్నాం.

దుర్గమ్మ లేదా పార్వతీమాత అవతారాలు అనంతరం. అమ్మ జగాలన్నింటికీనీ తల్లి. బిడ్డలయిన ప్రాణికోటిపై అమ్మకు మమకారం. అమ్మ ఆలన, పాలన లాలనలకై బిడ్డలు ఎదురు చూస్తుంటారు. ఆకలయితే అమ్మ గుర్తుకు వస్తుంది. ఊపిరులూదిన అమ్మ ప్రాణానికి ప్రాణం కదా! ఆ భరోసాలోనే జీవకోటి వమ్ములేకుండా అమ్మను నమ్ముతారు. హరిహర బ్రహ్మాదులు కూడా ఈ అమ్మలగన్నయమ్మకు గౌరమ్మకు అంజలి ఘటిస్తారు. ఈ సందర్భంగా ఒక చిన్న కథను గుర్తుచేసుకుందాం.

విష్ణుమూర్తి సలహామేరకు దేవదానవులు పాలకడలిని చిలకడానికి సిద్ధమైనారు. మందరపర్వతం కవ్వంగా, వాసుకి తాడుగా, పర్వతం కిందకు కుంగిపోకుండా శ్రీమన్నారాయణుడు తాబేలు రూపంగా మారారు. ఆ సాగరమథనం అవిశ్రాంతంగా సాగుతుండగా మొదటిగా హాలాహలం భరించరాని సెగలతో పైకి వచ్చింది. అందరూ భయభ్రాంతులైనారు. దిక్కుతోచని స్థితిలో దివిజులు సదాశివుని ప్రార్థించి "స్వామీ! ఈ ఉపద్రవం నుంచి లోకాలను నీవే రక్షించాలి" అని వేడుకొన్నారు. శివుడు అమ్మవారి వంక చూశాడు. ఎందుకు? అమ్మ సర్వమంగళ. మరి ఇప్పుడు లోకాలకు శుభం కావాలి. ఇది కారణం. అప్పుడు జగన్మాత-

**మ్రింగెడివాడు విభుండని**
**మ్రింగెడిదియు గరళమనియు మేలని ప్రజకున్**
**మ్రింగుమనె సర్వమంగళ**
**మంగళసూత్రంబు నెంత మదినమ్మినదో!**





తప్పకుండా ఈ విషాన్ని శివుడు తీసుకోవాల్సిందే. ఈ విషం తన భర్త స్వీకరిస్తేనే ప్రజలకు మంచి కలుగుతుంది. ఈ హాలాహలం తీసుకొంటే తన భర్తకు ఏమవుతుందో అని ఆలోచించ లేదు. "మ్రింగుమనె సర్వమంగళ" తాను సర్వమంగళ. సదా శుభాలను అందించే శక్తితత్త్వం తనది. తన మంగళసూత్రంపై ఆమెకంత విశ్వాసం. స్వామి కూడా అమ్మ ఆనతితో ఆ విషాన్ని చిన్న, నేరేడుపండులా అరచేతిలోకి తీసుకొని, కంఠమందే నిల్పినాడు. కారణం స్వామి మింగితే లోపల ఉన్న లోకాలు నశిస్తాయి. మింగకపోతే బయట ఉన్న లోకాలు విషాగ్నికి దగ్ధమవుతాయి. కనుకనే స్వామి గరళకంఠుడైనాడు. సర్వమంగళాదేవి మహిమ ఇది.

త్రిపురాసుర సంహారంలో శివుడు పూజించిన మంగళగౌరీ రూపం ఒకటి. ఈ రూపమే నవదుర్గలలో ఎనిమిదవ రూపం. ఉద్రిక్తతతో కూడిన మరొక రూపం మంగళ చండిక. ఈ రూపానికి శివునితో పాటు బ్రహ్మాది దేవతలు అనుకూల దాంపత్యానికి, సంసార సౌభాగ్యానికి, ముఖ్యంగా స్త్రీమూర్తుల ముత్తైదువతనం పదికాలాలు పచ్చగా ఉండడానికి సహకరించే మేలైన మమకారాల కల్పవల్లి మంగళగౌరి. ఈ తల్లి సదా పూజనీయురాలు.

మనకు 108 ఉపనిషత్తులున్నాయి. అందులో దేవ్యుపనిషత్



కూడా ఒకటి. జగన్మాత విశ్వరూపం సందర్శనా భాగ్యానికి, విశ్వరూపిణియైన ముగురమ్మల మూలపుటమ్మ తత్త్వదర్శనానికి నిలువెత్తు సాక్ష్యం. అమ్మ బ్రహ్మాది దేవతలకు కన్పించి ''అహం బ్రహ్మరూపిణి, మత్తశ్చ సంప్రవర్తతే ప్రకృతి పురుషాత్మకం జగత్... అంటూ ''మీరనుకొంటున్న పరబ్రహ్మ పదార్థం నేనే. నా వలనే ప్రకృతి పురుషాత్మకమైన ప్రపంచం ప్రవర్తనాశీలమౌతోంది. పంచభూతాలు, వేదం, విద్య, జ్ఞానం అంతా నేనే. ఈ లోకాన్ని పుట్టించి, పాలించి, లయపరచుకొనేది కూడా నేనే. బ్రహ్మ విష్ణు రుద్ర తత్త్వాలు నా రూపాలే'' అంటూ ఖండితంగా చెప్పింది. దివిజులు ఆ జగన్మాతకు అంజలి ఘటించి ''అమ్మా! బ్రహ్మాదులకు కూడా అంతుపట్టని దివ్యతత్త్వం నీదని తెలిసింది. అలాగే ఏ దివ్యతత్త్వం కూడా పరాశక్తియైన నీ భవ్య మహిమ తెలియరానిది. మంత్రాలకు మాతృరూపానివి, శబ్దార్థాల జ్ఞాన సుజ్ఞాన దీప్తివి నీవు. అజేయవు, అలక్ష్యవు, విశ్వరూపిణివి. నీ మానసపుత్రేలే బ్రహ్మవిష్ణురుద్రులు. నీ శక్త్యంశలే సరస్వతీ శ్రీమహాలక్ష్మి, పార్వతీ మాతలు. దేవతల తల్లి అదితిని కన్నతల్లివి కూడా నీవే. సర్వ విశ్వజననివి నీవు. నీ దర్శనభాగ్యంతో మేము భద్రతను అనగా శుభాన్ని పొందాము. అమృత రూపుల మైనాము'' అని ప్రార్థించడం జరిగింది.

''భద్రంతే'' అనగా శుభమగుగాక అని అర్థం. అలా శుభాలకు మూలమైన తల్లి జగన్మాత పార్వతీమాత సర్వమంగళ. ఆ తల్లి పూజలు, ఆరాధనలు సత్ఫలదాయకాలు.

ఈ శ్రావణమాసం పున్నమి నాడు చంద్రుడు శ్రవణా నక్షత్రంలో సంచరిస్తాడు గనుక ఈ నెలకు శ్రావణమాసం అని పేరు. శ్రావణమాసంలో మంగళవారాలు, శుక్రవారాలు పరమ పవిత్రమైనవి. మంగళవారం మంగళగౌరీ వ్రతం, శుక్రవారం శ్రీవరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తారు. ముఖ్యంగా మంగళగౌరీ వ్రతం పెండ్లికాని కన్యలు, కొత్తగా పెండ్లి అయిన మహిళలు సౌభాగ్యం, ఆరోగ్యం, సంతానం, ప్రశాంతతలను కోరి ఈ వ్రతం చేస్తారు. కోరిన వరుడు లేదా అర్హుడు, గుణవంతుడైన వరుడు పతిగా కావాలని కన్యలు అమ్మను పూజిస్తారు. వచ్చిన వరుడు నచ్చి పదికాలాల పాటు ముత్తయిదువ సౌభాగ్యంతో, సుఖసంతోషాలతో సంసార జీవన నావ సాగాలని పెండ్లియైన వారు గౌరీమాతను పూజిస్తారు. ఇందుకు నిదర్శనంగా రుక్మిణీ కల్యాణాన్ని ఒకింత గుర్తు చేసుకుందాం.

కుండిన నగరానికి రాజు భీష్మకుడు. అతని కుమార్తె రుక్మిణి. ఆమె శ్రీకృష్ణ పరమాత్మయే తనకు తగిన వరుడని భావించింది. అతడే తనకు పతి కావాలని కలలు కంటోంది. కాని సోదరుడు రుక్మి ఈమెను శిశుపాలునకిచ్చి వివాహం చేయాలని తలంచాడు. తండ్రి స్వయంవరం ఏర్పాటు చేశాడు. అప్పుడు రుక్మిణీదేవి పెద్ద సాహసం చేసింది. ''స్వామీ! వాసుదేవా! గత జన్మలలో నీవే భర్తగా కావాలని నేను వ్రతాలు చేశాను. నా వ్రతాలు నిజమైతే నీవే స్వయంవరానికి వచ్చి, శిశుపాలాది నీచపు రాజులను జయించి, నన్ను భార్యగా స్వీకరించాలి'' అని ప్రార్థించింది. అక్కడితో ఊరుకొనక ఒక బ్రాహ్మణునితో కృష్ణయ్యకు ప్రేమ సందేశాన్ని పంపింది. పరమాత్మ కూడా అంగీకరించి ''నాకునూ సమ్మతమే. తప్పక స్వయంవరానికి వస్తాను. నిన్ను చేపడతాను. ఇందుకు అడ్డు వచ్చిన వారిని

అంతమొందిస్తాను" అని తిరిగి సందేశం పంపాడు. అలాగే స్వయంవరానికి శ్రీకృష్ణుడు రావడం, రుక్మిణి చూడడం జరిగింది. అయినా రుక్మిణీదేవి స్వయంవరానికి ముందుగా, బ్రాహ్మణ ముత్తయిదువలతో భవసహితయై యున్న భవానీ మందిరానికి వెళ్లింది. ఆ మంగళగౌరీమాత పూజలు నిర్వహించింది. నైవేద్యాలు సమర్పించింది. చివరకు

**నమ్మితి నా మనంబున సనాతనులైన యుమామహేశులన్**
**మిమ్ము బురాణ దంపతుల మేలుభజింతు గదమ్మ! మేటి పె**
**ద్దమ్మ! దయాంబురాశివి గదమ్మ! హరింబతిసేయుమమ్మ! నిన్**
**నమ్మినవారికెన్నటికి నాశములేదు గదమ్మ! యీశ్వరీ ॥**

అని మొక్కుకుంది. అలాగే రాక్షస వివాహవిధిని పరమాత్మ రుక్మిణిని అపహరించుకొని పోయి వివాహం చేసుకున్నాడు కృష్ణుడు. సర్వమంగళాదేవియైన పార్వతీమాతను నమ్మినవారికి శుభాలే చేకూరతాయి. కామితాలు నెరవేరుతాయి.

కనుక సనాతన హైందవ సంస్కృతి శ్రావణమాసంలోనే మంగళవారాలను మంగళగౌరీ వ్రతానికి నిర్దేశించడం జరిగింది.

వ్రతం అంటే దీక్ష. ప్రతిన. కనుక వ్రత నియమాలను నియతిలో పాటించాలి. ముందుగా వ్రతసంబారాలు సిద్ధపరచుకోవాలి. గౌరీమాత రూపును సిద్ధం చేసుకోవాలి. పసుపు గౌరమ్మను నిలిపే ఏర్పాటు, పూలు, పత్రికలు, అగరుధూపాలు, తోరాలు, వాయనాలు... వాటికి కావలసినవి సిద్ధపరచుకోవాలి. ముత్తయిదువలుండాలి. ముఖ్యంగా తల్లి, లేదా అత్తగారు ఒక ముత్తయిదువగా ఉండాలి. అర్హుడైన పురోహితుడు పూజలు, తోరగ్రంథి మంత్రాలు, తోర సమర్పణలు, వాయినాలు సమర్పించడం, నైవేద్యాలు, కర్పూరహారతి ఇవ్వాలి. విధిగా వ్రతకథ పఠనం, శ్రవణం చేయాలి. వ్రతం రోజు ఉపవాసం, బ్రహ్మచర్యం నేలపై పడక వంటివి పాటించాలి.






**శ్రీమంగళే సకల మంగళ జన్మభూమే**
**శ్రీమంగళే సకల కల్మషతూలవహ్నే**
**శ్రీమంగళే సకల దానవ దర్పహంత్రీ**
**శ్రీమంగళే అఖిలం ఇదం పరిపాహి విశ్వం ॥**

అమ్మా! సర్వమంగళా! సకల శుభాలకు మూలం నీవు. సకల పాపాలను హరించే తల్లివి. సర్వదానవ గర్వాన్ని అంతం చేసే దానివి. అలాగే ఈ విశ్వాన్ని కూడా రక్షించాలి. నీ నామస్మరణతో భక్తుల పాపాలు నశిస్తాయి. సంసార దుఃఖాలు హరించిపోతాయి. సర్వశుభాలు కలుగుతాయి అంటూ ఒక ఐదు శ్లోకాలలో ఉన్న అమ్మవారి స్తోత్రం పఠిస్తారు.

సంస్కృతి సమాజాన్ని చైతన్యవంతం చేసి, సంస్కార వంతమైన జీవనవిధానాన్ని అందిస్తుంది. హైందవ ధార్మిక సంస్కృతి ఆధ్యాత్మిక జీవన విధానంతో ముడిపడి ముందుకు సాగుతోంది. ధార్మిక సంస్కృతి జీవితానికి ధైర్యాన్ని, దైవం మనతోనే ఉందన్న భరోసాను ఇస్తుంది. ఈ నిజాన్ని గుర్తించి నడవడంలోనే విజ్ఞత దాగి ఉంటుంది.

**- కె.బి. రాజేంద్రప్రసాద్**

# శుభప్రదాయిని...కొల్హాపూర్ మహాలక్ష్మి



**శ్రావణమాసంలో ఆచరించే వరలక్ష్మీ వ్రతం సకల శుభసంపదలను ప్రసాదించే మహిమాన్విత ఆధ్యాత్మిక సాధన. శ్రీహరి హృదయనివాసినిగా, భక్తుల పాలిట కొంగుబంగారంగా వెలసిన మహాలక్ష్మి కరుణకు హద్దులుండవు. అష్టాదశ శక్తిపీఠాలలో విశిష్టస్థానమైన కొల్హాపూర్ క్షేత్రం అమ్మవారి దివ్యచైతన్యంతో నిత్యం ప్రకాశిస్తుంది. కరవీరపురంగా పురాణప్రసిద్ధి పొందిన ఈ పుణ్యధామం సాధనకు నిలయమై, సిద్ధులకు సన్నిధానమై విరాజిల్లుతోంది. దుష్టశిక్షణ-శిష్టరక్షణల కోసం ఉగ్రరూపం ధరించిన జగదంబ, భక్తుల ముందు కరుణామృతమూర్తిగా దర్శనమిస్తుంది. శ్రీచక్రాకారంలో నిర్మితమైన మహాలక్ష్మీ మందిరం ప్రాచీన శిల్పవైభవానికి, దైవమహిమకు అపూర్వ సంగమం. సూర్యకిరణాలు అమ్మవారి దివ్యముఖాన్ని స్పృశించే అద్భుత ఘట్టం క్షేత్రమహాత్మ్యానికి ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తుంది. దీపారాధనలు, దానధర్మాలు, మంగళహారతులతో మార్మోగే ఈ క్షేత్రం భక్తహృదయాల్లో భక్తిపారవశ్యాన్ని నింపుతుంది. శ్రావణమాసపు శుభవేళలో మహాలక్ష్మిని ఆరాధించి, ఆమె కృపాకటాక్షాలతో సౌభాగ్యసంపన్నమైన జీవనాన్ని పొందుదాం.**



**చింతలపాటి శివశంకరశాస్త్రి**

శివకేశవుల ఆరాధనకు ఉపయుక్తమైన మాసం శ్రావణమాసం. మాసములలో శ్రావణము, దేవతలలో విష్ణువు, తీర్థములలో నారాయణ తీర్థము శ్రేష్ఠమైనవి.

చరాచర ప్రపంచంలో శక్తి ఆరాధనకు అధిక ప్రాధాన్యత ఉంది. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణలో భాగంగా జగన్మాత అనేకానేక అవతారాలను దాల్చింది. అండపిండ బ్రహ్మాండాల దాకా నిండివున్న ఆ మాతను మానవులు తప్పక పూజించాలి, అర్చించాలి.

అమ్మవారి అష్టాదశ శక్తిపీఠాలలో కొల్హాపూర్ ఒకటి. ఒక్కడ కొలువైన మహాలక్ష్మీ అమ్మవారు భక్తుల పాలిట కొంగు బంగారం. శుభాలను ఇచ్చే తల్లి. శ్రీహరి హృదయవాసిని. సూర్యచంద్రులే కన్నులుగా కలిగిన తల్లి. పద్మం వంటి సౌందర్యవంతమైన ముఖమండలం కలిగినది. చతుర్విధ పురుషార్థాలను అందించడానికి నాలుగు చేతులతో, ఉత్తరా నక్షత్రంలో నిండు పున్నమి, శుక్రవారం నాడు చక్కదనాల కుప్పగా పాలసంద్రంలో జన్మించింది. ఆ మహాలక్ష్మి కొలువైన కొల్హాపూర్ కడు రమణీయమైన, మహిమాన్వితమైన దివ్య ధామం. ఈ ఆలయం ఎంతో కళాత్మకంగా విశాల

ప్రాంగణంలో అలరారుతోంది. ఈ మాతను పూజించుకోవడానికి దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. ఈ ఆలయానికి నాలుగువైపులా పెద్ద పెద్ద ద్వారాలున్నాయి. ఆలయంలోని ప్రాచీన భారత శిల్పకళ చూపరులను ఆకట్టుకుంటుంది. అమ్మవారి విగ్రహం వజ్రవైఢూర్య, బంగారు వెండి ఆభరణాలతో ధగధగా మెరుస్తుంటుంది. ప్రళయకాలంలో పరమశివుడు తన త్రిశూలంతో కాశీనగరాన్ని ఎత్తి రక్షించగా, అమ్మవారు తన కరములతో నీటిలో మునిగిపోయిన క్షేత్రాన్ని పైకెత్తినందువల్ల దీనిని 'కరవీర' అని కూడా అంటారు. ఇక్కడ మహాలక్ష్మి అధిష్ఠాన దేవత కాగా, శివుడు, విష్ణువు, నీరు-రాళ్లుగా, దేవతలందరూ వృక్షాలుగా, మహర్షులు ఇసుకగా పరివేష్ఠించి ఉన్నారని లోకోక్తి. పరమ పవిత్రమైన శ్రావణమాసాన వరలక్ష్మీ వ్రతాన్ని, ఈనాడు చేసే లక్ష్మీపూజను పురస్కరించుకుని ఆ క్షేత్ర పుట్టుపూర్వోత్తరాల గురించి ఆ దేవీ మహాత్మ్యాన్ని గురించి తెలుసుకుందాం.

పూర్వం కరవీరుడు అనే రాక్షసుడు పద్మపురాన్ని పరిపాలిస్తున్నాడు. మహాబలవంతుడు, మిక్కిలి క్రూరుడు, పరమశివుని భక్తుడు శివవరప్రసాదియై అహంకరించి కరవీరుడు తరచూ తన సోదరులతో కలిసి స్వర్గలోకంపై దండెత్తి దేవతల్ని జయించి తన వశపరచుకుని స్వర్గలోకాన్ని ఆక్రమించాడు. మునులను, బ్రాహ్మణులను అందరినీ బాధించసాగాడు. ఆతని బాధలు భరించలేని దేవతలు, బ్రాహ్మణులు, మునులు త్రిమూర్తులను





వేడుకున్నారు. బ్రహ్మవిష్ణులు వారి ప్రార్థనలను కరవీరుడు శివ భక్తుడని, శివుని కరుణాకటాక్షములు అతనిపై మెండుగా ఉన్నాయని, ఆతనిని తామేమీ చేయలేమని తమ అశక్తతను తెలిపి, అందరూ కలిసి శివుని వద్దకు వెళ్లి వేడుకున్నారు. ఈ సమస్యకు పరిష్కారం చూపమని ప్రార్థించారు. దేవేంద్రుడు వినమ్రుడై అంజలి ఘటించి "పరమేశ్వరా! కరవీరుని ఆగడాలు నానాటికీ మితిమీరిపోతున్నాయి. నీ భక్తుడని ఉపేక్షించకుండా వెంటనే కరవీరుని వధించమని, లోకాన్ని ఉద్ధరించాల్సిన సమయం ఆసన్నమైనదని వేడుకున్నాడు. దేవేంద్రుని ప్రార్థనలను విని, కరుణించిన పరమశివుడు వారికి అభయమిచ్చి, సంతుష్టులను గావించాడు.


శివుని అభయప్రదానానికి సంతసించిన దేవేంద్రుడు మునులు, బ్రాహ్మణులు తమ తమ నెలవులకు పయనమయ్యారు. పరమశివుడు తన భక్తునికి నచ్చజెప్పడానికి ప్రయత్నించాడు. అహంకారంతో కన్నూ మిన్నూ కానని కరవీరుడు ఆయన మాటల్ని తిరస్కరించాడు. అందుకు ఆగ్రహించిన శివుడు కరవీరునితో యుద్ధానికి తలపడ్డాడు. ఇరువురి నడుమ యుద్ధం కొన్నాళ్లు సాగింది. నానాటికీ కరవీరుడు రెట్టించిన ఉత్సాహంతో యుద్ధం చేస్తుండగా, ఆగ్రహించిన పరమశివుడు తన ఫాలాగ్ని జ్వాలలతో కరవీరుణ్ణి, ఆతని సోదరులను సంహ రించాడు. శివుని చేతిలో పరాజయుడై చనిపోతూ రిక్తహస్తాలతో శివుణ్ణి ప్రార్థిస్తూ తన పేరుమీద ఈ పద్మపురాన్ని కరవీరపురంగా మార్చమని, తద్వారా ఈ ప్రాంతం తన పేరు ప్రసిద్ధి చెందాలని వరాన్ని కోరుకున్నాడు. అందుకు శివుడు అంగీకరించాడు.

కరవీరుని తండ్రి కోలహుడు. తన కుమారుల మరణానికి కారణమైన దేవతల మీద పగబట్టాడు. దేవతల్ని, మహర్షులను హింసించాడు. అధర్మాన్ని ప్రజ్వరిల్లజేశాడు. యజ్ఞయాగాదులను

ధ్వంసం చేశాడు. కోలహుని అరాచకత్వాన్ని సహించలేని మునులు, దేవతలు కపిల మహర్షి ఆశ్రమంలో ఉన్న మహాలక్ష్మిని వేడుకున్నారు. దేవతల ప్రార్థనలు విన్న మహాలక్ష్మి వారిని ఓదార్చి పంపించింది. అనంతరం దేవతలతో కలిసి మహాలక్ష్మి మహోగ్రరూపంతో, అష్టాదశ భుజాలతో సింహవాహనం మీద కరవీర పట్టణానికి వచ్చి కోలహుని కోటను ముట్టడించింది. చారుల ద్వారా ఆ విషయం తెలుసుకున్న కోలహుడు తగిన సైన్యంతో ఆమె మీదికి దండెత్తాడు. ఇరువురి నడుమ భీకర యుద్ధం జరిగింది. కోలహునిపై మహాలక్ష్మి బ్రహ్మాస్త్రాన్ని సంధించింది. పదునైన బాణాలతో సైన్యాన్ని సంహరించింది.

దేవి చేతిలో ఎప్పుడైతే సైన్యమంతా నశించిందో తనకిక చావు తప్పదని గ్రహించి కోలహుడు "అమ్మా! నీ చేతిలో చావు తప్పదని తెలిసి, ఇంతవరకు పోరాడాను. క్షత్రియ ధర్మంతో నీతో యుద్ధం చేశానే తప్ప, నీ మీద శత్రుభావమేదీ లేదు. నా అహంకారమంతా అణచివేశావు. చివరిసారిగా నిన్ను ఒక కోరిక కోరుతున్నాను. ఈ కరవీరపురం (పద్మపురం) నా పేరుతో కోలాహపురంగా పిలవబడాలి. షోడశ కళతతో నివిక్కడ కొలువై ఈ పురాన్ని కాపాడుతుండాలి. నీ కృపాకటాక్షాలతో ఈ పురం కరువు కాటకాలు లేకుండా, ఈతిబాధలు లేకుండా విరాజిల్లాలి. ఈ పురం సాధనాక్షేత్రంగా, సిద్ధి క్షేత్రంగా విరాజిల్లాలి. నా కోరిక తీర్చి, నన్ను ధన్యుణ్ణి చేయమని ప్రార్థించాడు. అందుకు మహాలక్ష్మి బదులిస్తూ, "కోలహా! నువ్వు అడిగినవన్నీ అనుగ్రహిస్తున్నాన"ని పలికి బ్రహ్మాస్త్రంతో సంహరించింది.

మహాలక్ష్మి చేతిలో ఎప్పుడైతే కోలహుడు మరణించాడో బ్రహ్మాదిదేవతలు ఆనందభరితులై జయజయధ్వనులతో, ముక్తకంఠంలో మహాలక్ష్మిని స్తుతించారు. దేవదుందుభులు మ్రోగాయి. పుష్పవర్షం కురిసింది. మహాలక్ష్మి వారిని దీవించింది. కాలక్రమంలో దేవశిల్పి మయుడు అద్భుత శిల్పకళా చాతుర్యంతో శ్రీచక్రాకారంలో దేవాలయాన్ని నిర్మించాడు. గర్భగుడిలో పద్మంలో ఆసీనురాలై ఉంటుంది అమ్మవారు. పశ్చిమాభిముఖురాలై భక్తులను అనుగ్రహిస్తుంటుంది. మహాలక్ష్మి విగ్రహం వెనుక శిలలతో చెక్కబడిన సింహవాహనం ఉంటుంది. అమ్మవారి కిరీటంలో విష్ణువు శయనించే ఆదిశేషుడు కొలువై ఉన్నాడు. చతుర్భుజాలతో కుడి చేతిలో నిమ్మకాయ, ఆ చేయి పైభాగాన కైముదికం ఉంటుంది. ఎడమచేతిలో కటకమనే ఆయుధం, కింది చేతిలో ఒక పాత్ర ఉంటుంది. ఈ నాలుగు చేతులు నాలుగు ప్రత్యేక ధర్మాలను కలిగి ఉంటాయి. పడమరలో గోడకు ఉన్న చిన్న కిటికీ ద్వారా మార్చి 21 నుంచి సెప్టెంబరు లోపు మూడు రోజులు సూర్యాస్తమయ కిరణాలు అమ్మవారి ముఖంపై పడి




వింతశోభను చేకూర్చుతాయి. అలాగే ఫిబ్రవరి ఒకటి, నవంబరు పదవ తేదీన కిరణాలు అమ్మవారి వక్షస్థలంపై పడతాయి. ప్రతిరోజు మధ్యాహ్నం దత్తాత్రేయుడు ఇక్కడకు వచ్చి అమ్మవారి భిక్ష స్వీకరిస్తాడు. ప్రళయకాలంలో కూడా ఇక్కడ మహాలక్ష్మి, మహావిష్ణువు ఉంటారని పురాణ కథనం. అందుకే దీనిని విముక్త క్షేత్రమని అంటారు. ఆలయంలోని అమ్మవారి విగ్రహం వజ్రవైఢూర్య, బంగారు, వెండి ఆభరణాలతో ధగధగా ప్రకాశిస్తూ ఉంటుంది. ఆ తల్లి ప్రీతికై దానాలు, దీపారాధనలు ఎనలేని ప్రాధాన్యాన్ని పొందాయి.

విశ్వైకమాత అయిన శ్రీమాత తన భక్త సంతతి జీవితాల్లో తన కటాక్ష కిరణాలను ప్రసరింపజేసి అంధకారాన్ని తొలగిస్తుంది. మంగళ, శుక్రవారాల్లో అమ్మవారికి విశేషంగా విశేష హారతులు ఇస్తారు. ఈ హారతులను చూచి తీరవలసిందే కాని, వర్ణించనలవికాని విధంగా ఉండి తన్మయులను గావిస్తాయి. చల్లని చూపులతో కరుణాంతరంగయైన ఆ మాతను పూజించి, ఆమె దీవెనలతో ఆనందమయమైన జీవితాన్ని గడుపుదాం. ■




# తెలంగాణ ధార్మిక చైతన్య ప్రతీక

## 'తెలంగాణ విద్వత్సభ' దశాబ్ది ప్రస్థానం

సనాతన ధర్మంలో వేదానికి నేత్రం లాంటిది జ్యోతిష్య శాస్త్రం. అయితే, పండుగల నిర్ణయంలో, ముహూర్తాల ఎంపికలో పంచాంగకర్తలకు, సిద్ధాంతులకు మధ్య సమన్వయం సాధించి, సమాజానికి ఒకే విధమైన మార్గదర్శకత్వం చేయాలన్నది ఎప్పటినుంచో ఉన్న ఒక పెద్ద ఆవశ్యకత. ఈ చారిత్రక అవసరాన్ని తీరుస్తూ, తెలంగాణ ధార్మిక సమాజాన్ని ఏకీకృతం చేసే దిశగా అంకురార్పణ జరిగిన మహత్తర ఘట్టమే "తెలంగాణ విద్వత్సభ" ఆవిర్భావం.

### ఆవిర్భావం - సంస్థాగత నిర్మాణం

ప్రప్రథమ జ్యోతిష్య మహాసభ ద్వారా జ్యోతిష్య పండితులు, సిద్ధాంతులు, పంచాంగ కర్తల మధ్య అద్భుతమైన సమన్వయం, సారూప్యత సాధ్యమైంది. ఈ మేధోమథనం కేవలం ఒక్క సభకే పరిమితం కాకూడదని, ఈ ధార్మిక యజ్ఞం శాశ్వత ప్రాతిపదికన నిరంతరం కొనసాగాలని పండితులు తీర్మానించారు. ఆ మహత్తర సంకల్పం నుండి పురుడుపోసుకున్న విశిష్ట ధార్మిక సేవా సంస్థే 'తెలంగాణ విద్వత్సభ'.

ఈ సంస్థ ఏర్పాటులో పలువురు ఉద్దండులు కీలక పాత్ర పోషించారు. వర్గల్ విద్యాసరస్వతి దేవాలయ వ్యవస్థాపక అధ్యక్షులు బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మసిద్ధాంతి అధ్యక్షులుగా, జ్యోతిర్మయ మహాపీఠం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ దివ్యజ్ఞాన సిద్ధాంతి మార్గదర్శకులుగా ఈ సభ కొలువుదీరింది. సుప్రసిద్ధ 'దర్శనమ్' ఆధ్యాత్మిక పత్రిక సంపాదకులు శ్రీ మరుమాముల వెంకటరమణ శర్మ కోశాధికారిగా, ఇంకా ఎందరో ఉద్దండులైన సిద్ధాంతులు కార్యవర్గ సభ్యులుగా బాధ్యతలు స్వీకరించి ఈ సంస్థకు బలమైన పునాదులు వేశారు.

### జగద్గురువుల, పీఠాధిపతుల మంగళాశాసనాలు

త్రిమత సంప్రదాయాలకు చెందిన ఎందరో జగద్గురువులు, పీఠాధిపతులు తెలంగాణ విద్వత్సభ చేస్తున్న ధార్మిక కృషిని గుర్తించి అవ్యాజమైన వాత్సల్యంతో తమ మంగళాశాసనాలు అందించడం ఈ సంస్థ చేసుకున్న మహద్భాగ్యం:

శృంగేరి శారదా పీఠం: దక్షిణామ్నాయ శృంగేరి శారదా పీఠాధీశ్వరులు జగద్గురు శంకరాచార్య శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాసన్నిధానం వారు, వారి కరకమల సంజాతులైన శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ స్వామి వారు ఈ సభను ప్రత్యేకంగా ఆశీర్వదించారు. ఒకసారి సుమారు 50 మంది విద్వత్సభ సిద్ధాంతులు శృంగేరి వెళ్లి జగద్గురువుల సమక్షంలో పంచాంగ సదస్సును నిర్వహించారు. సభ ఆచరిస్తున్న పండుగల నిర్ణయాల వెనకున్న శాస్త్ర ప్రమాణాలను గమనించిన జగద్గురువులు ఎంతో సంతోషించి, ప్రతి సంవత్సరం సభ రూపొందించే పండుగల జాబితాలకు తమ 'శ్రీముఖాలను' (ఆశీర్వచన పత్రాలను) అందిస్తున్నారు.

కంచి కామకోటి పీఠం: కంచి కామకోటి పీఠాధీశ్వరులు





శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారు సికింద్రాబాద్‌లోని స్కందగిరి దేవాలయానికి విచ్చేసినప్పుడు, విద్వత్సభ సిద్ధాంతులు వారి సమక్షంలో సమావేశమయ్యారు. సభ నిర్వహిస్తున్న సమ్మేళనాలు, పంచాంగ గణిత సమన్వయం గురించి తెలుసుకున్న స్వామివారు హర్షం వ్యక్తం చేసి తమ ఆశీర్వనుగ్రహం కురిపించారు.

శ్రీ గురుమదానంద సరస్వతి పీఠం: పరమహంస పరివ్రాజకులు శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి వారు ప్రతి ఏటా సమ్మేళనాలకు తమ అనుగ్రహాన్ని అందిస్తూ, సిద్ధాంతులంతా సమన్వయంతో సాగేలా నిరుపమానమైన మార్గదర్శకత్వం చేస్తున్నారు.

వీరితో పాటు, శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన్నజీయర్ స్వామి, శ్రీ అహోబిల రామానుజ జీయర్ స్వామి,, శ్రీ వ్రతధర రామానుజ జీయర్ స్వామి, ఉత్తరాది మఠం పీఠాధిపతులు శ్రీ సత్యాత్మ తీర్థులు, ఉడిపి పెజావర్ మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విశ్వేశతీర్థ స్వామి వారు తదితర ఎందరో మహాత్ములు వివిధ సందర్భాల్లో విద్వత్సభను అభినందించి ఆశీర్వదించారు.

ప్రభుత్వానికి, ధార్మిక సమాజానికి మధ్య వారధిగా విద్వత్సభ చేస్తున్న సేవలకు ప్రభుత్వాల నుండి సంపూర్ణ ఆదరణ లభిస్తోంది.

తొలినాళ్లలో నాటి ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు (కేసీఆర్) గారు విద్వత్సభ పండితులు ఏకగ్రీవంగా నిర్ణయించే పండుగల తేదీలనే ప్రభుత్వం అధికారికంగా గుర్తిస్తుందని హామీ ఇచ్చి, ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేయించారు.

ఇటీవలే ఎనిమిదవ విద్వత్సమ్మేళనం విజయవంతంగా పూర్తయిన తర్వాత, సభ కార్యవర్గం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిసి పండుగల జాబితాను సమర్పించింది. పండుగల నిర్ణయంలో పండితులందరూ సమన్వయంతో చర్చించి, ఎలాంటి గందరగోళాలకు, వివాదాలకు తావులేకుండా జాబితాను అందిస్తున్న విధానాన్ని ముఖ్యమంత్రి గారు మనసారా ప్రశంసించారు. విద్వత్సభ భవిష్యత్ కార్యకలాపాలకు ప్రభుత్వం తరపున అన్ని విధాలా పూర్తి చేయూత అందిస్తామని వారు హామీ ఇవ్వడం అత్యంత హర్షణీయం.

### మహాసభల ప్రయాణం

తొలి రెండు సభల అఖండ విజయంతో ఈ ధార్మిక చైతన్యాన్ని రాష్ట్రమంతటా విస్తరించాలని విద్వత్సభ సంకల్పించింది. ప్రభుత్వానికి ఒక దిక్సూచిలా నిలుస్తూ 3వ సభ నుండి 9వ సభ వరకు వివిధ పుణ్యక్షేత్రాల్లో అద్భుతమైన సమ్మేళనాలను నిర్వహించింది:



నల్లకుంటలోని శృంగేరి శంకర మఠం, వర్గల్ విద్యా సరస్వతి దేవాలయ ప్రాంగణంలో సభలను అత్యంత దివ్యంగా నిర్వహించింది.





భాగ్యనగర శివార్లలోని తూముకుంట శ్రీ రామభద్ర క్షేత్రంలో వంద మందికి పైగా సిద్ధాంతుల భాగస్వామ్యంతో మహాసభను జరిపింది.

ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రి (యాదగిరిగుట్ట) లోని శ్రీ హయగ్రీవ గాయత్రీ ఆశ్రమంలో ధర్మశాస్త్రాలకు అనుగుణంగా చర్చా గోష్ఠులు నిర్వహించింది.

బేగంపేటలోని పుష్పగిరి సంస్థాన మఠంలో నిర్ణయ సింధు, ధర్మ సింధు తదితర శాస్త్రాల ఆధారంగా లోతైన చర్చలు జరిపి ఏకగ్రీవంగా పండుగలను నిర్ణయించింది.

### అట్టహాసంగా దశాబ్ది మహోత్సవాలు

గత తొమ్మిది సంవత్సరాలుగా "అసిధారా వ్రతం"లా అప్రతిహతంగా సాగుతున్న ఈ విద్వత్సభ సమ్మేళనాలు ఇప్పుడు పదవ వసంతంలోకి అడుగుపెట్టాయి. ఈ చారిత్రక ఘట్టాన్ని పురస్కరించుకుని 2026 ఆగస్టు 1, 2 తేదీలలో హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి ప్రధాన మందిరంలో దశాబ్ది ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు రెండు రోజుల పాటు నాలుగు ప్రధాన సదస్సులుగా ఈ కార్యక్రమం జరగనుంది. ఈ సదస్సుల్లో జ్యోతిష్యం, పంచాంగం, ఆగమ, ధర్మశాస్త్రాలకు సంబంధించి రాష్ట్రంలోని సుప్రసిద్ధ పండితులు ప్రత్యేక ప్రసంగ పాఠాలు అందించనున్నారు.

ఇదే వేదికపై, 'గేయ వాల్మీకి'గా ప్రసిద్ధిగాంచిన బ్రహ్మశ్రీ



రుక్మాభట్ల నరసింహ స్వామి గారికి ప్రతిష్ఠాత్మక 'జీవన సాఫల్య పురస్కారాన్ని', అలాగే మరో 12 మంది వరిష్ఠ పండితులకు విశేషమైన సేవా పురస్కారాలను తెలంగాణ విద్వత్సభ సగౌరవంగా అందించబోతోంది.

### విశిష్ట కానుక: "విద్వత్సభ సంహిత - దశాబ్ది దీపిక"

తెలంగాణ విద్వత్సభ పదేళ్ల నిరంతరాయ ధార్మిక కృషి అనిర్వచనీయమైనది. పండుగల విషయంలో మీడియాలో ఎలాంటి గందరగోళమైన చర్చలకు తావులేకుండా పండితులందరినీ సమన్వయపరిచి సమాజానికి మార్గదర్శనం చేస్తున్న విద్వత్సభ అడుగుజాడలు పదిలంగా భద్రపరచాల్సినవి.


ఈ మహత్తర ప్రస్థానంలో... మొదటి రెండు సంవత్సరాలు రవీంద్ర భారతిలో నిర్వహించిన సభల నుండి మొదలుకొని నల్లకుంట శంకరమఠం, వర్గల్, తూముకుంట రామభద్ర క్షేత్రం, యాదగిరిగుట్ట హయగ్రీవ గాయత్రీ ఆశ్రమం , పుష్పగిరి జగద్గురు సంస్థానం వరకు... గత తొమ్మిదేళ్లుగా జరిగిన విద్వత్సమ్మేళనాల సమగ్ర నివేదిక ను ఓమారు అవలోకనం చేసుకుందాం..

అంతేకాకుండా, తెలుగునాట విఖ్యాతులైన జ్యోతిష్య, వేద, ఆగమ శాస్త్ర విద్వాంసులు వివిధ అంశాలపై రచించిన అమూల్యమైన పరిశోధనా వ్యాసాలను క్రోడీకరించి "విద్వత్సభ సంహిత - దశాబ్ది దీపిక" అనే విశిష్ట శీర్షికతో ఈ ప్రత్యేక సంచికను వెలువరిస్తుంది తెలంగాణ విద్వత్సభ.

దశాబ్ది మహోత్సవం కేవలం ఒక వేడుక మాత్రమే కాదు; గతాన్ని గౌరవిస్తూ, వర్తమానాన్ని సమీక్షిస్తూ, భవిష్యత్తుకు నూతన సంకల్పాలతో ముందుకు సాగే స్ఫూర్తిదాయకమైన సందర్భం. ఇది సంస్థ అభివృద్ధికి, సభ్యుల ఐక్యతకు, సమాజ శ్రేయస్సుకు బలమైన పునాది వేస్తుంది.

సర్వేజనాః సుఖినో భవంతు!

**- మరుమాముల వెంకటరమణ శర్మ**



# జ్యోతిర్మఠ శంకరాచార్యులపై రాజ్యాధికార దౌర్జన్యం

## 2026 ప్రయాగ్‌రాజ్ మాఘమేళా ఘటనపై ఒక విశ్లేషణ

**ఆధునిక లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాధికారానికి, ధార్మిక స్వేచ్ఛకు మధ్య ఉండాల్సిన సున్నితమైన లక్ష్మణరేఖ చెరిగిపోతోందా? హిందూ మత సంస్థల వ్యవహారాల్లో ప్రభుత్వం మితిమీరిన జోక్యం కేవలం పరిపాలనాపరమైనదేనా, లేక సనాతన ధర్మ మూలాలను దెబ్బతీసే కుట్రలో భాగమా? 2026 ప్రయాగ్‌రాజ్ మాఘమేళాలో ఉత్తరామ్నాయ జ్యోతిర్మఠ శంకరాచార్యులు స్వామి అవిముక్తేశ్వరానంద సరస్వతి పట్ల ప్రభుత్వ యంత్రాంగం వ్యవహరించిన తీరు ఈ ప్రశ్నలను బలంగా తెరమీదకు తెచ్చింది. విశ్రాంత ఐపీఎస్ అధికారి మన్నెం నాగేశ్వరరావు నేతృత్వంలోని పౌరసమాజ నిజనిర్ధారణ కమిటీ బహిర్గతం చేసిన వాస్తవాలు,0 ప్రభుత్వ అధికార దుర్వినియోగాన్ని కళ్లకు కడుతున్నాయి. పవిత్ర మౌని అమావాస్య నాడు స్వామిజీ పల్లకిని అడ్డుకోవడం, అమాయక వేద విద్యార్థులపై అకారణంగా లాఠీఛార్జ్ చేయడం, ఆపై కక్షసాధింపుగా తప్పుడు పోక్సో కేసు బనాయించడం వంటివి పాలకుల ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనం. ఇతర మతాలకు తమ ప్రార్థనాలయాలను నిర్వహించుకునే పూర్తి స్వేచ్ఛను ఇస్తున్న లౌకిక ప్రభుత్వం, హిందూ పీఠాలపై ఆధిపత్యం చెలాయించడాన్ని ఈ విశ్లేషణ తీవ్రంగా ఆక్షేపిస్తోంది. ప్రభుత్వ నిర్ణయాలను నిలదీసే స్వతంత్ర హైందవ గళాలను అణచివేసే బదులు, ధార్మిక వ్యవహారాలను పీఠాధిపతులకే వదిలేసేలా స్వయంప్రతిపత్తి గల 'హిందూ ధర్మ పరిషత్' ఏర్పాటు జరగాలని ఈ నివేదిక చాటిచెబుతోంది. సనాతన ధర్మ మనుగడకు, భారతదేశంలో నిజమైన లౌకికవాద పునరుద్ధరణకు జరగాల్సిన జాతీయ స్థాయి మేధోమథనానికి ఈ వ్యాసం ఒక నాంది.**

రాజకీయ అధికారం, ఆర్థికబలం లేదా సైనిక, పోలీసు బలగాల వల్ల మాత్రమే నాగరికతలు మనుగడ సాగించలేవు. ప్రజలు తమ ధార్మికమూలాలను గుర్తుంచుకుని, తమ మతసంస్థలను, ధర్మాచార్యులను గౌరవిస్తూ సంప్రదాయాలను ఆదరించినప్పుడే అవి వర్ధిల్లుతాయి. ఏదైనా ప్రభుత్వం తన పరిపాలనాశక్తిని దురుపయోగం చేసి మతపెద్దలను అవమానించడానికి, వారి ప్రతిష్ఠను దెబ్బతీయడానికి ప్రయత్నించినప్పుడు, ఆ రాజ్యాంగ వ్యవస్థ సదరు నాగరికత మనుగడకే ముప్పుగా పరిణమిస్తుంది.

భారతప్రభుత్వానికి, హిందూ సమాజానికి మధ్య సంబంధాలు ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో పడ్డాయి. మా ఈ ''జ్యోతిర్మఠ శంకరాచార్యులపై ప్రభుత్వాధికార దుర్వినియోగం-- 2026 ప్రయాగ్‌రాజ్ మాఘమేళాపై పౌరసమాజ నిజనిర్ధారణ నివేదిక'' ద్వారా ఈ చేదునిజాన్ని సభ్య హిందూ సమాజానికి తెలియజేస్తున్నాం. ఈ దర్యాప్తు సమితిలో నాతో పాటు ప్రొఫెసర్ మధుకీశ్వర్ (మానుషి సంస్థ వ్యవస్థాపకులు), శ్రీమతి రీతూ రాథోడ్ (ప్రముఖ సామాజిక కార్యకర్త) సభ్యులుగా ఉన్నారు.

2026 ప్రయాగ్‌రాజ్ మాఘమేళాలో జరిగిన దురదృష్టకర సంఘటనలు కేవలం ఒక పరిపాలనాలోపం కాదు; అవి సనాతన ధర్మానికి చెందిన అత్యున్నతపీఠం గౌరవాన్ని దెబ్బతీయడానికి ప్రభుత్వం నడిపించిన ఒక ప్రణాళికాబద్ధమైన, కుట్రతో కూడిన దాడి అని మా పరిశోధనలో తేలింది.

**పవిత్రమౌని అమావాస్య నాటి అపచారం**

ప్రయాగ్‌రాజ్ లోని మాఘమేళా, కుంభమేళాలు ప్రభుత్వాలు సృష్టించినవి కావు. మానవచరిత్రలోనే అత్యంత పురాతనమైన, నిరంతరాయంగా సాగుతున్న ఈ ఆధ్యాత్మిక కూటములలో ప్రభుత్వ పాత్ర కేవలం మౌలికవసతులు, ప్రజారక్షణ, శాంతిభద్రతలు, తాగునీరు, పారిశుధ్యం వంటి సౌకర్యాలను కల్పించడం మాత్రమే. అక్కడ కొనసాగే మతపరమైన అధికారక్రమాన్ని, సంప్రదాయాలను గౌరవించాల్సిన బాధ్యత లౌకిక ప్రభుత్వంపై ఉంది.

ఈ సంప్రదాయంలో శంకరాచార్యులవారి పల్లకి ఊరేగింపు అత్యంత ప్రధానమైనది. ఆదిశంకరాచార్యుల కాలంలో ప్రారంభమైన ఈ ఊరేగింపు కేవలం వ్యక్తిగత విలాసమో, ప్రత్యేక హక్కో కాదు; అది సనాతన హిందూధర్మానికి సజీవ ప్రతిరూపంగా నిలచిన పీఠాలకు ఇచ్చే అత్యున్నత గౌరవ సూచిక.

రాష్ట్రపతి, ప్రధానమంత్రి, గవర్నర్లు, ముఖ్యమంత్రులు పర్యటించేటప్పుడు వారు అధిరోహించిన ఉన్నత పదవుల మర్యాదకు ప్రతీకగా వారికి ఎలాగైతే రాజలాంఛనాలతో కూడిన





మన్నెం నాగేశ్వరరావు

నిర్దిష్టమైన ప్రోటోకాల్ ఉంటుందో, అనాదిగా సనాతన హిందూధర్మంలో అత్యున్నతపీఠాన్ని అధిష్ఠించిన జగద్గురు శంకరాచార్యుల వారికి కూడా అంతటి ఆధ్యాత్మిక ప్రోటోకాల్ ఉండటం ఎంతైనా సమంజసం. ప్రత్యేకించి హిందూ దేవాలయాలను, మత కార్యక్రమాల నిర్వహణను లౌకిక ప్రభుత్వాలు తమ హస్తగతం చేసుకున్నందున, ఈ మర్యాదలను కల్పించవలసిన బాధ్యత వారిపైనే ఉంది.

2026 జనవరి 18న ఉదయం మౌని అమావాస్య పర్వదినాన, ఉత్తరామ్నాయ జ్యోతిర్మఠ జగద్గురు శంకరాచార్యులు స్వామి అవిముక్తేశ్వరానందసరస్వతివారు త్రివేణి సంగమంలో పవిత్ర గంగాస్నానం ఆచరించడానికి మేళా నిర్వహించే ప్రభుత్వ యంత్రాంగం ముందస్తు అనుమతితో బయలుదేరారు. ఒక పోలీసుబృందం కూడా ఈ ఊరేగింపునకు రక్షణగా నడిచింది. అయితే, దాదాపు రెండు కిలోమీటర్ల మేర ఊరేగింపు ప్రశాంతంగా సాగిన తర్వాత, ప్రయాగ్‌రాజ్ జిల్లా కలెక్టర్ మనీష్ కుమార్ వర్మ, మేళా అధికారి రిషిరాజ్, పోలీస్ కమిషనర్ జోగేంద్రకుమార్ వంటి ఉన్నతాధికారులు అకస్మాత్తుగా దారిని అడ్డుకున్నారు. శంకరాచార్యుల వారిని పల్లకి దిగి నడిచివెళ్లమని దురుసుగా ఆదేశించారు.

ఈ అవమానకరమైన ఆదేశాన్ని శంకరాచార్యుల వారి శిష్యులు నిరసించగా, పోలీసులు ఎటువంటి కారణం లేకుండా అనాగరికంగా బలప్రయోగం చేసి వేదవిద్యార్థులపై లాఠీ ఛార్జ్ చేశారు. అత్యంత అపచారంగా, ఆ చిన్నపిల్లలను వారి పిలకలు పట్టుకుని ఈడ్చుకెళ్లి, కొట్టి, బంధించారు.


అనంతరం, సాధారణ దుస్తుల్లో ఉన్న పోలీసులు ఆ పల్లకిని

బలవంతంగా తిరిగి వారి శిబిరానికి తరలించారు. దీనివల్ల సనాతన ధర్మానికి చెందిన అత్యున్నత ఆధ్యాత్మిక గురువును పవిత్ర మౌని అమావాస్యనాడు దివ్యగంగాస్నానం ఆచరించ కుండా లౌకిక ప్రభుత్వం అడ్డుకొంది. తమ విద్యార్థులపై జరిగిన దాడికి కలతచెందిన శంకరాచార్యుల వారు, జనవరి 28 వరకు పదిరోజుల పాటు తమ శిబిరం వెలుపల వీధిలోనే కూర్చుని నిరసన చేపట్టారు. అయినప్పటికీ, రాష్ట్రప్రభుత్వం కనీసం విచారం వ్యక్తం చేయకపోగా, తన వైరాన్ని, దురుసుతనాన్ని మరింత పెంచింది.

### అబద్ధపు సాకులు - ద్వంద్వ ప్రమాణాలు

ఈ ఘటనపై అధికారులు చెప్పిన సాకులను మా కమిటీ క్షుణ్ణంగా పరిశీలించి ఎండగట్టింది. మేళా ప్రాంతంలోకి మోటారు వాహనాలకు అనుమతి లేదని అధికారులు వాదించారు, కానీ పల్లకిని మోటారువాహనం అనడం హాస్యాస్పదం. రెండవది, 'జనసమ్మర్దాన్ని నియంత్రించడానికి', 'తొక్కిసలాట జరగకుండా చూడడానికే' తాము ఊరేగింపును ఆపినట్లు వాదించారు. కానీ, తత్కాలీన టీవీ వీడియో దృశ్యాలు, ప్రత్యక్ష సాక్షుల కథనాల ప్రకారం ఇది కేవలం తప్పును కప్పిపుచ్చుకోవడానికి సృష్టించిన కల్పితకథ అని తేలింది.

అధికారులు అకస్మాత్తుగా దారిని అడ్డుకునే వరకు అక్కడ ఎలాంటి గందరగోళం లేదు; పోలీసుల చర్యే అక్కడ ఉద్రిక్తతకు దారితీసింది. అంతేకాకుండా, సాంప్రదాయ పల్లకిని వాహనాల నిషేధం పేరుతో అడ్డుకున్న అధికారులు, అధికారపక్షానికి అనుకూలంగా ఉన్న ఇతర మతపెద్దలను మాత్రం మోటారు వాహనాల్లో నేరుగా స్నానఘాట్ల వరకు వెళ్లడానికి అనుమతించారనే ఆరోపణలు ఉన్నాయి.



చట్టప్రకారం, పోలీసులు ఒక చట్ట విరుద్ధమైన గుంపును చెదరగొట్టడానికి లేదా ఒక నేరాన్ని నిరోధించడానికి మాత్రమే బలప్రయోగం చేయాలి. కానీ అక్కడ అలాంటి పరిస్థితులేవీ లేవు. పోలీసుల చర్య పూర్తిగా చట్టవిరుద్ధం. ఇది అక్రమ నిరోధం, దాడి, మతపరమైన భావాలను గాయపరచడం వంటి నేరాల కిందకు వస్తుందని దశాబ్దాలపాటు శాంతిభద్రతల విభాగంలో అనుభవం ఉన్న నాకు స్పష్టంగా తెలుసు.

### నేరచట్టాల దుర్వినియోగం... పోక్సో కుట్ర

శంకరాచార్యుల వారి నిరసన తీవ్రమై ప్రజల్లో ఆగ్రహం వెల్లువెత్తడంతో, వారిని నైతికంగా దెబ్బతీసి అప్రతిష్ఠపాలు చేయడానికి పవిత్ర గంగానది ఒడ్డునే ఒక తప్పుడు పోక్సో కేసు కుట్రకు అదే రోజు పునాది పడింది. ఈ కుట్రకు ఉత్తరప్రదేశ్ లోని శామ్లీ జిల్లా కాంధ్లా పోలీస్‌స్టేషన్‌లో సుదీర్ఘ నేరచరిత్ర కలిగిన ఆశుతోష్ పాండే అనే రౌడీషీటర్‌ను సాధనంగా వాడుకున్నారు. ఇతనికి గతంలో శంకరాచార్యుల వారితో బహిరంగంగా విభేదించిన కొందరు ప్రముఖులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి.

జనవరి 18 సాయంత్రం, శంకరాచార్యుల వారు, వారి శిష్యులు తనను చంపడానికి ప్రయత్నించారని పాండే మొదట ఫిర్యాదు చేశాడు. కానీ ఆ ప్రాంతం మొత్తం సీసీటీవీ నిఘాలో ఉండటం, ఆ దృశ్యాలలో ఆ కథనం పూర్తిగా అబద్ధమని తేలడంతో పోలీసులు కేసు నమోదు చేయలేదు. హత్యాయత్నం కథనం పారకపోవడంతో, శంకరాచార్యుల వారి గురుకులంలోని బాలవిద్యార్థులపై లైంగికపరమైన అత్యాచారాలు జరిగాయని ఆశుతోష్ పాండే ప్రత్యేక పోక్సో కోర్టును ఆశ్రయించాడు.

కోర్టు నివేదిక కోరగా, అంతకుముందు పోక్సో కేసు నమోదుకు నిరాకరించిన అదే పోలీసు శాఖ అకస్మాత్తుగా వైఖరి మార్చుకుని ఆ ఆరోపణలలో వాస్తవముందని నివేదిక ఇచ్చింది. దీంతో కోర్టు పోక్సోకేసు నమోదుచేయాలని ఆదేశించాల్సి వచ్చింది. పోలీసుల ఈ వైఖరి మార్పు వెనుక ఉన్న శక్తులు ఎవరు?

ఈ కేసులో పోక్సో చట్టంలోని అన్ని రక్షణ నిబంధనలను ఉల్లంఘించారు. బాధితులని పేర్కొన్న బాలలు వారి తల్లిదండ్రులకు ఆ విషయం చెప్పలేదు, బాలలను కోర్టు ముందుకు తీసుకు రాలేదు. ప్రముఖులతో సంబంధాలున్న ఒక నేరస్తుడైన ఫిర్యాదుదారుని వద్దనే ఆ బాలలను ఎందుకు ఉంచారు?

అలహాబాద్ హైకోర్టులో జరిగిన ముందస్తు బెయిల్ వాదప్రతివాదనలు, కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను పరిశీలిస్తే ఈ



కేసు ఎంత కక్షపూరితమైనదో తేటతెల్లమవుతుంది. మార్చి25, 2026న హైకోర్టు శంకరాచార్యుల వారికి ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ, ప్రభుత్వ ప్రాసిక్యూషన్‌ను తీవ్రంగా తప్పు బట్టింది. బాధితులుగా చెప్పబడిన వారి కథనాలు కల్లబొల్లి గాను, అబద్ధాలుగాను ఉన్నాయని, చట్టపరమైన నిబంధనలను తుంగలో తొక్కారని కోర్టు పేర్కొంది. అన్నింటి కంటే ముఖ్యంగా, పాఠశాల రికార్డులను పరిశీలించగా ఆ పిల్లలు అసలు శంకరాచార్యుల వారి గురుకుల విద్యార్థులేకారని తేలింది. దీంతో ప్రభుత్వం అల్లిన కథ పూర్తిగా కుప్పకూలింది.

### ధర్మ పరాయణత్వానికి ఇంత మూల్యమా?

ఒక పారంపరిక అత్యున్నత పీఠాధీశ్వరునిపై ప్రభుత్వం ఎందుకు కత్తి కట్టింది? జ్యోతిర్మఠ శంకరాచార్యులవారు ప్రభుత్వం యొక్క హిందూ వ్యతిరేక విధానాలను బహిరంగంగా విమర్శిస్తూ వచ్చారు.

- అయోధ్య రామమందిర నిర్మాణంలో ఆగమ శాస్త్రాల ఉల్లంఘనలను, అన్య మతస్థుల ప్రమేయాన్ని ఆయన వ్యతిరేకించారు.
- వారణాసి కాశీ విశ్వనాథ్ కారిడార్ ప్రాజెక్టు పేరుతో 250కు పైగా అతి ప్రాచీన దేవాలయాల కూల్చివేతను నిరసించారు.
- గోవధను పూర్తిగా నిషేధించాలని, గోవును జాతీయప్రాణిగా ప్రకటించాలని జాతీయ స్థాయిలో ఉద్యమిస్తున్నారు.
- హిందూ దేవాలయాలపై ప్రభుత్వ నియంత్రణను, హిందూ మత వ్యవహారాలలో ప్రభుత్వ జోక్యాన్ని తీవ్రంగా తప్పుబట్టారు.

ఈ సందర్భంలో ఒక ముఖ్య విషయాన్ని గమనించాలి. సంఘ పరివారం తమను తాము హిందుత్వ సంస్థగా ప్రచారం చేసుకున్నప్పటికీ, అది కేవలం ఒక రాజకీయ సంస్థ మాత్రమే. తమ రాజకీయ ప్రయోజనాలకు వారు హిందుత్వాన్ని వాడుకుంటున్నారు తప్ప హిందువులకు వారు చేసిన మేలు తక్కువ. ఉదాహరణకు, నిజంగా వారు హిందూవాదులైతే దేశంలోని రెండు లక్షలకన్నా ఎక్కువగా ప్రభుత్వ నియంత్రణలో ఉన్న దేవాలయాలను గత పన్నెండేళ్లుగా కేంద్రంలోనూ, పలు రాష్ట్రాలలోనూ అధికారంలో ఉండి కూడా ఎందుకు విడిపించలేదు? రాజ్యాంగంలోని 25 నుండి 30 వరకు గల నిబంధనలను సవరించి ముస్లింలు, క్రైస్తవులతో సమానంగా హిందువులకు ప్రాథమిక హక్కులను ఎందుకు కల్పించలేదు?

హిందూ మతానికి పూర్తి స్వాతంత్ర్యం ఉంటే హిందువులు తమ చెప్పుచేతలలో ఉండరని సంఘపరివారం నమ్మకం. అందుకే వారు అన్ని హిందూ సంస్థలను, మఠాలను తమ గుప్పిట్లోకి తెచ్చుకోవడానికి శతవిధాలుగా ప్రయత్నిస్తూ, తమ దారికి రాని పీఠాధిపతులపై తప్పుడు కేసులు పెట్టించి ఇబ్బం దులు కలిగిస్తుంటారు. నిజాయితీగా, స్వతంత్రంగా ధర్మపరా యణతతో వ్యవహరించే గొప్ప సంస్థలలో నాలుగు ఆమ్నాయ పీఠాలు మాత్రమే చివరిగా మిగిలాయి. ఈ ఆమ్నాయపీఠాలను తమ ఆధీనంలోకి తెచ్చుకోవడానికి శత విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ వారు విజయం సాధించలేక పోవడానికి కారణం ఆమ్నాయ పీఠాల ధర్మనిష్ఠాపరంపరయే.

ఈ నేపథ్యంలో స్వామి అవిముక్తేశ్వరానంద సరస్వతి వారి రాజీపడని స్వతంత్ర హైందవగళం సంఘపరివారీయులకు భరించలేని సవాలుగా మారింది. అందుకే ఆయన నోరు నొక్కడానికి, 'ఒకరిని చంపి వందమందిని లొంగదీసుకో' అనే కుతంత్రంతో ఉత్తరామ్నాయ జ్యోతిర్మఠాధీశ్వరులపై సంఘ పరివారీయులు కత్తికట్టారు.

### లౌకికత్వం పేరిట సాగుతున్న దౌర్జన్యం

మా పరిశోధనలో తేలిన ముఖ్యమైన అంశం- ఆధునిక భారతీయ లౌకికత్వం ముసుగులో హిందూమతంపై జరుగు తున్న ఘోర వివక్ష. 2026 జనవరి 18 నాటి సంఘటన తర్వాత, ప్రభుత్వం జ్యోతిర్మఠ శంకరాచార్యుల వారికి నోటీసులు జారీచేస్తూ, ఆయన శంకరాచార్యులుగా తన అర్హతను 'నిరూపించుకోవాలని' కోరింది.

ఎవరు శంకరాచార్యులో ప్రశ్నించే అధికారం లౌకిక ప్రభుత్వానికి ఏమాత్రం లేదు. శంకరాచార్యులుగా స్వామి అవిముక్తేశ్వరానంద సరస్వతివారి పట్టాభిషేకం శాస్త్రోక్తంగా, సాంప్రదాయ పద్ధతుల ప్రకారం దక్షిణామ్నాయ శృంగేరీ పీఠాధీశ్వరులు నిర్వహించారు. ఈ వారసత్వాన్ని 2022 సెప్టెంబర్‌లో భారత సుప్రీంకోర్టు గుర్తించింది. కేంద్ర ప్రభుత్వ అధికారిక ప్రచురణలలోనూ ఇది నమోదైంది. ఒక ప్రధాని లేదా ముఖ్యమంత్రి అర్హతను ప్రమాణస్వీకారం తర్వాత ఎలాగైతే

ప్రశ్నించలేమో, శంకరాచార్యుల వారి హోదాను కూడా అలాగే ప్రశ్నించలేము.


ఇందుకు విరుద్ధంగా, సంఘపరివారీయుడైన ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్వయంగా రాష్ట్ర అసెంబ్లీవేదికగా శంకరాచార్యుల వారి హోదాను ప్రశ్నిస్తూ వ్యాఖ్యలు చేశారు. యోగి ఆదిత్యనాథ్ కూడా అదే విధమైన సాంప్రదాయ పద్ధతిలోనే గోరఖ్‌నాథ్ పీఠాధిపతి హోదాను పొందారు. జ్యోతిర్మఠ వారసత్వాన్ని తప్పుబట్టడం ద్వారా ఆయన తన సొంత పీఠాధిపతి హోదాను ప్రశ్నించుకుని అవమానపరచుకున్నట్లేగదా!

ఇస్లాం లేదా క్రైస్తవ మతాలకు చెందిన మసీదులు, వక్ఫ్‌బోర్డులు లేదా చర్చిలపై, వారి అంతర్గత వ్యవహారాలపై, ఆస్తులపై, ఆదాయాలపై ప్రభుత్వ నియంత్రణ లేదు. వారి మత పెద్దలను పిలిచి “మీ అర్హత నిరూపించుకోండి” అని ఏ ప్రభుత్వ అధికారీ అవమానించడు. కానీ హిందూ మతం విషయానికి వస్తే, లౌకిక ప్రభుత్వం ఒక యజమానిలా వ్యవహరిస్తూ మాఘమేళా వంటి మహోన్నత ఆధ్యాత్మిక కూటములను ప్రభుత్వ లౌకిక కార్యక్రమాలుగా మార్చేస్తోంది. ఈ వేదికలలో సాంప్రదాయ హిందూ మతపెద్దలను పక్కనపెట్టి, రాజకీయ నాయకులకు, ప్రభుత్వ అధికారులకు పెద్దపీట వేయడం గర్హనీయం.

### నిజమైన లౌకికత్వ పునరుద్ధరణకు మార్గం

ఈ తప్పిదాలని సరిదిద్దడానికి మా సమితి “ఉత్తరప్రదేశ్ హిందూ ధర్మపరిషత్ చట్టం” అనే కొత్త సమగ్ర చట్టాన్ని ప్రతిపాదించింది. దీనిద్వారా కేవలం సాంప్రదాయ హిందూ మత పెద్దలు, పీఠాధిపతులు, పండితులతో కూడిన ఒక స్వయం ప్రతిపత్తి కలిగిన అత్యున్నత సంస్థను ఏర్పాటుచేయాలి. దీనికి జ్యోతిర్మఠ శంకరాచార్యులవారు అధ్యక్షత వహించాలి. ఈ పరిషత్తులో రాజకీయ నాయకులకు, ప్రభుత్వ అధికారులకు ఎలాంటి ప్రమేయం ఉండకూడదు. ఈ పీఠం నేరుగా ఆది శంకరాచార్యుల వారి వారసత్వానికి చెందినది కావడం, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం జ్యోతిర్మఠం భౌగోళిక పరిధిలోకి రావడం వల్ల జ్యోతిర్మఠ శంకరాచార్యుల వారి నేతృత్వంలో ఈ పరిషత్తు రాజకీయ ఒత్తిడులకు లోనవకుండా స్థిరంగా ఉత్తరప్రదేశ్ హిందూ సమాజానికి దిక్సూచి అవుతుంది.

ఈ ప్రతిపాదిత చట్టం హిందూసంస్థలపై ప్రభుత్వ నియంత్రణను తొలగించి, దేవాలయాల నిర్వహణ, ఆచార వ్యవహారాలు, మేళాల పర్యవేక్షణ బాధ్యతలను హిందూ ధర్మపరిషత్‌కు అప్పగిస్తుంది. ప్రభుత్వ యంత్రాంగం కేవలం మౌలిక సదుపాయాలు, శాంతిభద్రతలు, పారిశుధ్యం వంటి పరిపాలనా వ్యవహారాలకే పరిమితం అవుతుంది.



### జాతీయ మేధోమథనానికి సమయం

సనాతనధర్మానికి మేధో, ఆధ్యాత్మిక కేంద్రమైన కాశీక్షేత్రంలో మా నివేదికను 12-5-2026న విడుదల చేశాం. హిందువులు దీనిని కేవలం రాజకీయ కోణంలో చూడవద్దు. ఇది మన మతం, నాగరికతల మనుగడలకు సంబంధించిన మౌలికమైన ప్రశ్న. భారతదేశం ఒక నిజమైన లౌకిక ప్రజాస్వామ్య దేశంగా నిలవాలంటే, ప్రభుత్వం తన పరిపాలనా పరిమితులను తెలుసుకోవాలి. హిందూ మత విషయాలలో జోక్యం చేసుకోవద్దు. లౌకిక ప్రభుత్వం మతస్వేచ్ఛను రక్షించాలే తప్ప, తానే స్వయంగా మతాన్ని నియంత్రించాలని అనుకోకూడదు. అది లౌకికత్వానికి వ్యతిరేకం.

మా పూర్తి నివేదికను (https://maghmela2026factfinding.com/ report-english.pdf)లో చూడవచ్చు, పొందవచ్చు.

*(రచయిత మాజీ సీబీఐ డైరెక్టర్, 2026 ప్రయాగ్‌రాజ్ మాఘమేళా సంఘటనలపై దర్యాప్తు చేసిన పౌరసమాజ కమిటీకి నేతృత్వం వహించారు.)*



# శ్రీమద్దేవీభాగవతం


## నవమ స్కందం

(గత సంచిక తరువాయి)

నా కవచం శుభప్రదమైనది. దానిని సుదామునికిచ్చాను. అది ఇప్పుడు శంఖచూడునిగా జన్మించిన అతని కంఠంలో ఉంది. ఆ కవచం ధరించినంత కాలం వాడిని చంపడం కష్టం. నేను విప్ర రూపంలో వెళ్ళి, వాని కవచం యాచించి తీసుకొంటాను. తులసి పతివ్రతగా ఉన్నంతకాలం, ఆమె పాతివ్రత్యాన్ని భంగపఱచి వానిని తిరిగి గోలోకానికి చేరుస్తాను.'' ఇలా చతుర్ముఖునితో, దేవతలతో పలికి విష్ణువు తన వద్ద ఉండే ఒక శూలాన్ని శివునకు ఇచ్చాడు. బ్రహ్మ రుద్రాదిదేవతలు సెలవుతీసుకొన్నారు.

మహాదేవుడు చంద్రభాగానదీతీరంలో ఒక మఱ్ఱిచెట్టు దగ్గఱ విడిది చేసి, దేవతలను అక్కడ నిలిపాడు. అనంతరం గంధర్వ రాజు చిత్రరథుని శంఖచూడుని వద్దకు దూతగా పంపాడు. చిత్రరథుడు, మహేంద్ర నగరం కంటె, కుబేరభవనం కంటె కూడా గొప్పదిగా కనబడుతున్న శంఖచూడుని నగరానికి వెళ్ళాడు. అది అయిదు యోజనాల వెడల్పు, పదియోజనాల పొడవు కలిగి, స్ఫటికమణులతో నిర్మితమై ఉంది. రకరకాల వాహనాలు ఆ నగరంలో తిరుగుతున్నాయి. ఏడు అగడ్తలతో, ఆ నగరం ప్రవేశించడానికి వీలు లేనిదిగా ఉంది. కణకణలాడే నిప్పుల వలె మెరుస్తున్న కోట్ల రత్నాలతో నిర్మించబడిన శంఖ చూడుని భవనం, ఆ నగరంలో ఆశ్చర్యకరంగా కనబడుతోంది. అతని మందిరం దగ్గర శూలం ధరించిన ఒక ద్వారపాలుడు చిత్రరథునికి కనబడ్డాడు. వాడు, తామ్రవర్ణం కలిగి, పింగళ నేత్రాలతో భయంకరంగా ఉన్నాడు. వాడి అనుమతి తీసుకొని దూత లోనికి వెళ్ళాడు. దూతలను అడ్డుకోరాదు అనే నియమం ఆ కాలంలో ఉండేది కనుక అతడిని ఎవరూ ఆపలేదు. శంఖచూడుడు ఆ సమయంలో సభామండపంలో ఒక దివ్య మణి సింహాసనంపై కూర్చుని ఉన్నాడు. కృత్రిమ రత్న పుష్ప శోభితమైన గొడుగును ఒకడు అతని తలపై ఉండేలా పట్టుకొని ఉన్నాడు. కొందఱు చామరాలు వీస్తున్నారు. అసంఖ్యాక దానవశ్రేష్ఠులతో సేవింపబడుతున్న శంఖచూడుని చూసి దూత ఆశ్చర్యపోయాడు. పుష్పదంతుడు అని మఱొక పేరు కూడా కల చిత్రరథుడు శంఖచూడునితో ఇలా అన్నాడు - దైత్యేంద్రా! నన్ను పుష్పదంతుడనీ, చిత్రరథుడనీ కూడా పిలుస్తారు. నేను శివదూతను. శివుడు నీతో చెప్పమన్న మాటలు చెపుతున్నాను. విను. నీవు దేవతలకు వారి రాజ్యం తిరిగి ఇచ్చివేయడం నీకు శుభం కలిగిస్తుంది. దేవతలు శ్రీహరిని శరణు కోరారు.

శ్రీమహావిష్ణువు శివునకు తన శూలం ఇచ్చి పంపాడు. ప్రస్తుతం శివుడు చంద్రభాగానదీ తీరంలో వటవృక్ష మూలంలో ఉన్నాడు. దేవతలకు రాజ్యమిస్తావో లేక యుద్ధమే చేస్తావో నీ ఇష్టం.



డా॥ వద్దిపర్తి పద్మాకర్

ఆ మాటలకు నవ్వి శంఖచూడుడు, రేపు సూర్యోదయానికి నేనే వస్తాను. నీవు వెళ్ళు అన్నాడు. దూత శివునికి ఆ మాటలు విన్నవించాడు. ఆ సమయంలో కుమారుడు అక్కడకు వచ్చాడు. కుమారుడు, గణేశుడు ఆయుధాలు ధరించి శివునితో కలసి నడచారు. వీరభద్రుడు, నంది, మహాకాళుడు, సుభద్రకుడు, విశాలాక్షుడు, బాణుడు, పింగళాక్షుడు, వికంపనుడు, విరూపుడు, వికృతి, మణిభద్రుడు, బాష్కలుడు, కపిలుడు, దీర్ఘదంష్ట్రుడు, వికరుడు, తామ్రలోచనుడు, కాలంకరుడు, బలి, భద్రుడు, కాలజిహ్వుడు, కుటీచరుడు,

బలోన్మత్తుడు, రణశ్లాఘ్యుడు, దుర్జయుడు, దుర్గముడు, మున్నగు శివగణవీరులు యుద్ధానికి బయలుదేరారు. అసంఖ్యాక రుద్రగణాలు, గణాధ్యక్షులు అట్టహాసంగా తరలి వెడుతుంటే దిక్కులు మారుమ్రోగిపోయాయి. ఈ రుద్రవీరు లందరూ వేయి చేతులు కలిగినవారే. జడలే వారి కిరీటాలు. చంద్రరేఖలను ధరించి, నీలకంఠులై, త్రినేత్రులై, రుద్రాక్షలు, హారాలు, కుండలాలు, కేయూరాలు, కిరీటాలు, అనేకాభర ణాలు ధరించి ఉన్నారు. అందరూ భస్మవిలేపనశరీరులే. కొందఱు త్రిమూర్తుల వలె ఉన్నారు. వారు అణిమాద్యష్టసిద్ధు లను పొందినవారు. వారిలో కొందఱు భూమిపైనా, కొందఱు పాతాళంలోనూ, కొందఱాకాశంలోనూ, మఱికొందఱు సప్త స్వర్గాలలోనూ నివసిస్తుంటారు. పిలచినపుడు శివుని వద్దకు వస్తుంటారు. వీరితో బాటుగా అష్టభైరవులు, ఏకాదశరుద్రులు, అష్టవసువులు, ఇంద్రుడు, దిక్పాలకులు, ద్వాదశాదిత్యులు, చంద్రుడు, విశ్వకర్మ, అశ్వనీదేవతలు, నలకూబరుడు, నవగ్రహాలు, మన్మథుడు, ఉగ్రదంష్ట్రుడు, ఉగ్రదండుడు, కోరటుడు, కోటభుడు మున్నగు వారు కూడా యుద్ధానికి తరలి వచ్చారు. వీరందరూ శివుని వద్దకు చేరారు.

దూత వెళ్ళిపోయాక శంఖచూడుడు తులసి వద్దకు వెళ్ళి జరిగినది చెప్పాడు. అప్పుడు తులసి భయపడి భర్తతో ఇలా అన్నది- స్వామీ! ఈ తెల్లవాఱు జామున కల వచ్చింది. అప్పటి నుంచి నాకు భయంగా ఉంది. శంఖచూడుడు ఆ మాటలు విన్నాడు. ఆమెతో ఇలా అన్నాడు - సర్వం కాలంతో ముడిపడి ఉంది. కర్మఫలాలు కాలాన్ని బట్టి అనుభవించాలి. హర్షం, శుభం, సుఖం, దుఃఖం, భయం, శోకం, మంగళం మొదలైనవి కాలప్రభావం వల్ల కల్గుతాయి. సమయం రానిదే చెట్లు కూడా పుష్పించవు, ఫలించవు. సమయం రాగానే పండిన పండ్లు రాలు తాయి. లోకాలు కూడా కాలప్రభావంతో పుట్టి నశిస్తాయి. సమయం వచ్చినప్పుడే బ్రహ్మ సృష్టిస్తాడు. విష్ణువు పరిపాలిస్తాడు. రుద్రుడు సంహరిస్తాడు. త్రిమూర్తులకు అధిష్ఠాన దేవత ప్రకృతియే. ప్రకృతికి పరమేశ్వరుడు అభిన్నుడు. సర్వేశ్వరుడు, సర్వరూపుడు, సర్వాత్ముడు అయిన పరమేశ్వరుడు చరాచరా లను సృష్టించాడు.

(సశేషం)




శ్రీ సాందీపని గురుకుల సేవాట్రస్ట్

Founded By:Maharanyam Sri Sri MuraliDhara Swamiji (Chennai)



Sri Hari

మన సనాతన ధర్మంలో మన జీవన ఆధారం వేదం, వేదం మన హిందూ ధర్మానికి భారతదేశానికి హృదయం వంటిది. ఎటువంటి సౌకర్యాలు లేని ప్రాచీన కాలంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని మహాత్ములు,ఋషులు చాలా కష్టపడి వేదాన్ని సంరక్షించి ఇప్పుడు మన తరానికి అందించారు. వాళ్ళు అందించిన వేదాన్ని కాపాడవలసిన బాధ్యత మన అందరి మీద ఉన్నది.

హైదరాబాద్ నగరంలో ECIL సాకేత్, కాప్రా నందు శ్రీ ప్రేమిక వేదాశ్రమం అను పేరుతో శ్రీ కృష్ణ యజుర్వేద పాఠశాల నిర్వహింపబడుతున్నది, కావున ఆస్తిక జనులందరూ ఈ వేద పాఠశాలకు ధన, వస్తు రూపేణ సహాయ సహకారములు అందించి ఆ వేదమాత యెక్క అనుగ్రహమునకు పాత్రులు కాగలరని కోరుకుంటున్నాము.

ఈ వేద పాఠశాల యందు బ్రాహ్మణ సమారాధన తమ తమ గోత్ర నామములతో చేయించుకున్న వారికి ప్రసాదముగా కుంకుమ, మంత్రాక్షతలు తగు రసీదు పంపడం జరుగుతుంది.

ఆ వేదమాత యొక్క అనుగ్రహం అందరికీ లభించుగాక

Donation Type:One Day Samaradhana-Rs.5000/- One Vidhyarthi Expenses/Month-Rs.8000/- One Day Patasala Expenses-Rs.14000/-
Donations can be made by cheques favoring '' SRI SANDEEPANI GURUKULA SEVA TRUST (A.P.)"
donation can be made by online fund transfer : IFSC Code : **SBINOO12739**
Account Number : **34134951509** Name : SRI SANDEEPANI GURUKULA SEVA TRUST (A.P.),
Branch : SAKETH (HYDERABAD) UPI:ssgsthyd@icici

**Donations are eligible for exemption U/S 80G of Income - Tax Act**

**Admin & Patasala Address : Door no.1-1-31/399A, Lane - 26,Phase-1 Saket nagar,Saket, Kapra, Hyderabad-62. cell:9440875114 - 8667000419**




(గత సంచిక తరువాయి)

**11**

1911లో తమ దక్షిణదేశ సంచారము ముగించుకొని వచ్చిన తరువాత శ్రీ సచ్చిదానంద శివాభినవ నృసింహభారతీ స్వామివారి దేహారోగ్యమంత తృప్తికరముగా లేకపోయినది. సంచారాంత మున గురువర్యులు బెంగళూరుకు సమీపముననున్న నందికొండకు చేరుకొనిరి. అక్కడ అమృత సరోవరప్రాంతమున చాలాకాలముండి ఆ పిమ్మట వెలికి వచ్చిన గురువర్యులకు శైత్యము వలన హృదయశూల ఆరంభమయ్యెను. చిరకాల ముష్ణదేశములో సంచారమొనర్చి తరువాత అత్యంత శీలమైన అమృతసరోవర జలములలో నిత్యస్నానము లొనర్చుట వలన దేహప్రకృతిలో వైపరీత్యమేర్పడెను. అప్పుడప్పుడలసట కలుగ సాగెను. దేహము కంతకు విపరీతమైన యాతన కలుగు చుండెను. అయినను గురువర్యులు దీని నంతటిని లెక్క చేసెడి వారు కారు. ఔషధము సేవించుటగాని పథ్యము పాటించుట గాని జరిగెడిది కాదు. చెంతనున్న అప్పు లెల్లరు శ్రీవారి దేహము యాతన నందుచుండుటను చూచి జాలిపడవలసినదే కాని తా మా యాతన ననుభవించుటకు వీలులేదు కదా! శరీరస్థితి యిట్లున్నను గురువర్యులు స్నానపూజాది నిత్యానుష్ఠానమును విడిచిపెట్టలేదు. సంక్షేపముగా నైనను ప్రతి కార్యమును నియమబద్ధులై నిర్వర్తించుచుండిరి.

1912 ఆరంభమున వ్యాధి ప్రబలమయ్యెను. శైత్యదోషముచే గురువర్యులు కృశింప నారంభించిరి. శరీరము కృశమగుచున్న కొలది ఇక దానిని విడిచివైచి మోక్షానందమును పొందవలెనని గురువర్యులకు పదే పదే ప్రేరణ కలుగుచుండెను. దీనికి పూర్వభావిగా అంతవరకు తామే స్వయముగా చేయుచున్న పాఠ ప్రవచనములను గురువర్యులు నిలిపివైచిరి. శిష్యులకు పాఠము చెప్పు విషయములో నెల్లప్పుడు నుత్సాహమును ప్రక టించు గురువర్యులిప్పుడు తామే పాఠములను నిలిపివైచుట శిష్యులందరకు చింతాహేతువైనది. సమీపవర్తులకు మరింత విచారమేర్పడెను. గురువర్య లెక్కువగా పరాఙ్ముఖులు కాజొచ్చిరి. శిష్యులందరు గురువర్యులకు వేగముగా నారోగ్యము చేకూరవలెనని దైవమునకు మొరలిడుచుండెడి వారు. కాని వారి మనస్సులలో సంతోషోత్సాహములడుగంట సాగినవి.

శ్రీ గురువర్య లుద్దేశించిన కార్యములన్నియు జయప్రద ముగా నిర్వర్తితములైనవి. తమ సంకల్పిత కార్యములన్నియు పూర్తియైన పిదప ఇంకను తాము ఈ దేహబంధనమున నెందు కుండవలెను? శృంగేరిలో, బెంగుళూరులో సంస్కృత పాఠశాలలు నారంభించుట, శ్రీ శంకర జయంత్యుత్సవములను ప్రతి సంవత్సరము జరుపవలెనని వ్యవస్థ చేయుట, కాలటీ క్షేత్రమును పునరుద్ధరించి గ్రంథములన్నింటినీ చక్కగా సంశోధించి సంపుటములుగా విభజించి పునర్ముద్రణ చేయించుట, ఇట్లు తాము సంకల్పించిన కార్యములన్నియు తృప్తికరముగా నెరవేరినవి.

సంచారము నుంచి వచిచన వెంటనే శ్రీ శారదా సన్నిధియందు అంజలిబద్ధులై "అతఃపరం కిం కరణీయ మస్తి" అని జగదంబికను గురువర్యులు ప్రార్థించియుండిరి. అన్ని

పనులను ముగించిన పిమ్మట చేయవలసిన దేమున్నది? శిష్య పరిగ్రహణమే గదా! ఔను అది యొక్కటే మిగిలియున్నదని, దానిని గూడ శ్రీవారు చాలకాలము ముందే నిర్ణయించి యున్నారు. తమ ఉత్తరాధికారిని మనఃపూర్వకముగను, హృదయ పూర్వకముగను ఎంతోకాలము ముందే నియమించు కొని యున్నారు. ఇప్పుడింకను మిగిలియున్నది ఏమనగా తమ మనసులోని ఆ నిర్ణయమును బయల్పరచి లోకమునకు తెలి యునట్లు శిష్యపరిగ్రహణ మొనర్చుట మాత్రమే. ఆ ఆంతర్య మును బయలుపరచుటకు సముచిత కాలము రావలెను గదా! దానికొరకే ఎదురుచూచుచున్న గురువర్యులు తమ నిర్ణయమును ప్రకటించుటకు ఇదే సరియైన సమయమని నిశ్చయించి తమ ఆప్తకార్య నిర్వాహకులైన శ్రీకంఠశాస్త్రి గారికి కబురు పంపిరి.




గురువర్యుల కత్యంతము నాప్తులు, గురుసేవ యందు పరమనిష్ఠులు, గురు వర్యుల యోగక్షేమమున నిత్యాజాగరూకులు నయిన శ్రీకంఠశాస్త్రిగారికి గురువుల అనా రోగ్యము మిక్కిలి యాందోళన హేతవయ్యెను. ఎంత ప్రార్థించినను ఔషధపథ్యముల విషయ మున గురువులంగీకరింపనందున శాస్త్రిగారు ఖిన్నులయిరి. దీనికి తోడు పీఠమునకు ఉత్తరాధికారి నియామకమును గురించి కూడ శాస్త్రిగారికి ప్రబలమైన చింత.

నమస్కరించి వినమ్రులై నిలబడియున్న శాస్త్రిగారికి కూర్చుండుడని సూచించి గురువర్యులు తమ నిర్యాణము సన్నిహితమై యుండుటవలన శిష్యసంగ్రహణ మొనర్చి వారికి సమస్త భారము నప్పగించి తాము ఆ బంధము నుంచి విముక్తులు కావలెనను అభిప్రాయమున్నదనియు ఇంకను పెక్కు దినములు దేహధారణ మొనర్చుట సాధ్యము కాదనియు తెలిపిరి. శాస్త్రిగారు దుఃఖభరిత హృదయులై మౌన ముగా నిలబడియే యుండిరి గురువర్యులు తమ మాటలు సాగించుచు తమ స్థానమునకు రాదగిన యెగ్యులెవరని అయి దారు సంవత్సరముల క్రిందటనే ఆలోచించి తీర్మానించు కొన్నామనియు శ్రీ నరసింహ శాస్త్రిగారికి దీక్షనిచ్చి వారినే తమ స్థానమునకు ఉత్తరాధికారిగా నియమింప నిష్కర్ష చేసియున్నా మనియు స్పష్టముగా చెప్పిరి. గురువుల నిరాశాదాయక దేహారోగ్యస్థితి వలన మొదటనే దుఃఖితులైయున్న శాస్త్రిగారు ఇప్పుడీ మాటలు విని భయగ్రస్తులైరి. తమ అంత్యము సమీపిం చినదని గురువులే చెప్పుచుండగా దానిని నమ్మకుండుట కెవరికి సాధ్యము.

గురువుల ఇచ్ఛ ననుసరించి ఉత్తరాధికారి నియామకము విషయమున శ్రీవారి నిర్ధారణమును మైసూరు మహారాజులు, గురుభక్తులు, శ్రీ గురువర్యులకు ఆప్తతములునయిన నాల్గవ కృష్ణరాజ ఒడయరు వారికి శ్రుతపరచి శ్రీ నరసింహశాస్త్రిగారిని బెంగుళూరు నుంచి శృంగేరికి తీసుకొని రావలయునని అక్కడనున్న కుణిగల్ రామాశాస్త్రి గారిని బెంగుళూరుకు పంపిరి. అప్పుడు బెంగుళూరు నందే మకాము చేసియున్న మహారాజులు గురువర్యుల దేహస్థితిని తెలిసికొని మిక్కిలి దుఃఖితులై శ్రీవారి యాజ్ఞను శిరసావహించి నడచుకొనుటకు సిద్ధముగా నున్నామని శృంగేరికి వార్తను పంపిరి.

ఇంతలో గురువర్యుల ఆరోగ్యము మరింత క్షీణించసాగెను. దగ్గు ఎక్కువై మాటలాడుట గూడ కష్టమగు చుండెను. ఆ సమయమున మహారాజాస్థాన వైద్యాధికారులు శృంగేరికి వచ్చి గురువర్యుల దేహస్థితిని పరీక్షించి ఇక ఎక్కువ కాలము దేహము నిలుచుట కష్టమని సూచించిరి. దానివలన శిష్యవర్గము భీతి ఇనుమడించెను. వారు చెప్పిన దానికి సరిగా ఫాల్గుణ బహుళ త్రయోదశి నాడు రాత్రి పదిగంటలకు ప్రారంభ మైన దగ్గు ఒంటిగంట వరకు విడిచిపెట్టక సుమారు మూడు గంటలకాలము ఎడతెగక యుండి ఎంతో ఆందోళన కలిగించినది. బెంగుళూరు నుంచి నరసింహశాస్త్రి గారు వచ్చునప్పటికి గురువర్యులు ముక్తులు కావచ్చునను శంక దగ్గరనున్న వారికందరకు కలిగినది. ఇట్టి స్థితిలో శ్రీవారి సమీపవర్తులలో నొకరిని నిర్దేశించి యుండుట అనుకూలమని శ్రీకంఠశాస్త్రి గారు సూచించిరి. అప్పుడు గురువర్యులు 'అర్హులెవరు?' అని అడిగిరి.


శాస్త్రిగారొకరి పేరును సూచించిరి.

'వాడు మందమతి. అక్షరజ్ఞుడెన్నడు కాలేడు'

మరొక పేరును శాస్త్రిగారు సూచించిరి.

"పరిశుద్ధమైన ఆచార్య స్థానమునకు వానిని నియమించుట కంటె అది శూన్యముగా నుండిపోవుటయే మంచి"దని సమాధానము వచ్చినది. శాస్త్రిగారు మూడవ పేరు సూచించి నప్పుడు గురువర్యులు ఏ యభిప్రాయమును వ్యక్తపరుపక 'పూర్వమే నిర్దిష్టుడైన నరసింహశాస్త్రిని రామశాస్త్రి తీసుకొని వచ్చును గదా! వారిని రానిండు' అని పలికి తమ కత్యంతా నందదాయకమయిన ఆత్మవిద్యా విలాసమును చదదివి వినుపింపుడని శాస్త్రిగారి కాజ్ఞ ఇచ్చిరి. (సశేషం)

**- చెఱుకుపల్లి జమదగ్ని శర్మ**




# దక్షిణామ్నాయ శృంగేరీ శ్రీశారదాపీఠ వైభవం

(గత సంచిక తరువాయి)

## జ్ఞానమార్గానికి చిత్తశుద్ధి ప్రధానం

**'షష్ట్యబ్దపూర్తి అనుగ్రహభాషణం'లో జగద్గురువుల ఉద్బోధ**

శ్రీ భారతీతీర్థ మహాస్వామి తమ అనుగ్రహ భాషణంలో వేద వేదాంతాల గరిమ గురించీ ప్రవృత్తి నివృత్తి మార్గాలకు శ్రీ ఆదిశంకరులు చేసిన సమన్వయం గురించీ, నేటి కాలంలో ప్రభుత్వమూ, ప్రజలూ అనుసరించవలసిన ధర్మమార్గాల గురించీ ప్రస్తావించారు. కర్మమార్గానికీ, జ్ఞానమార్గానికీ దేని ప్రత్యేకత దానికి ఉందని చెబుతూ ఉన్నత పాఠశాల పరీక్షల కోసం చదివిన పుస్తకాలు కళాశాల చదువులకు నిమిత్తం లేదన్నట్టే- కర్మమార్గాన్ని తుదముట్ట పాటించి చిత్తశుద్ధి పొంది జ్ఞానమార్గంలోకి ప్రవేశించిన తరువాత కర్మమార్గంతో నిమిత్తం లేదన్నారు. జగద్గురువుల అనుగ్రహ భాషణం కన్నడంలో సాగింది. అందులోని కొన్ని అంశాలు :

"భగవద్గీత ప్రాముఖ్యం అసదృశ్యమైనది. అటువంటి భగవద్గీతలో సాక్షాత్తూ భగవంతుడే 'నీవు ఈశ్వరార్థంగా చేసిన పని నీకు బంధకం కాదు' అని చెప్పిన తరువాత సందేహానికి తావేది? శంకర భగవత్పాదులు చెప్పిన పూర్వోత్తర కాండలకు సమన్వయం ఎట్లాగంటే- చిత్తశుద్ధి పర్యంతం పూర్వకాండకు, కర్మమార్గాన్ని అనుసరించాలి. చిత్తశుద్ధి కలిగిన తర్వాత జ్ఞానమార్గానికి పోవాలి. చిత్తశుద్ధి లేనివారు జ్ఞానమార్గానికి వెళ్ళడం వల్ల వారికి ఏవిధమైన ప్రయోజనమూ ఉండదు. మనసులో అనేకమైన ఆశలు ఉంటాయి. ఏ ఆశా పోలేదు. అయినా ఏదో గురువులు వేదాంత పాఠం చెబుతున్నారని తానూ వెళ్ళి వేదాంత పాఠంలో కూచుంటే- వేదాంత పాఠం జరుగుతున్నా వాడి మనసు ఎక్కడో ఉంటుంది కాని అక్కడ ఉండదు. ఎందుకంటే మనసులో ఏ ఆశా చావలేదు కనుక. అటువంటవాళ్లు వేదాంత పాఠానికిపోతే నిద్రవస్తుంది. ఇంకే ఉపయోగమూ ఉండదు. లౌకికులు ఒకరు మా వేదాంత పాఠానికి వచ్చేవారు. మా పాఠం రెండు గంటలు సాగేది. ఆయన అనేవాడు- పాఠం ఒక గంటసేపు అయిన తర్వాత ఒక కప్పు టీ దొరికితే చాలా బాగుంటుంది అని... ఎందుకంటే కాస్త నిద్ర వస్తున్నది కనుక... మనసులో ఆశలుండి మనసు పరిశుద్ధంగా ఉండనివాళ్లు వేదాంత పాఠంల కూచుంటే వచ్చేది నిద్రే. అందుకే పరిశుద్ధచిత్తులై వేదాంతాన్ని అధ్యయనం చేయాలి, జ్ఞానమార్గానికి రావాలి అన్నారు. ఇదెందుకు చెబుతున్నానంటే శంకర భగవత్పాదులు చేసిన అత్యంత ఉత్కృష్టకార్యాలలో ఈ ప్రవృత్తి నివృత్తి మార్గాలకు- కర్మ బ్రహ్మకాండలకు చేసినటువంటి సమన్వయం అన్నది అసాధారణమైన పని. అటువంటి పనిని భగవత్పాద శంకరులు చేసి జగత్తుకు అద్వితీయమైన మార్గదర్శకులయ్యారు. నేటికి కూడా నిష్పక్షపాతంగా విమర్శ చేయగలిగిన తత్త్వమున్న వైదేశిక పండితులు భారతీయ దార్శనికులలో ఆదిశంకర భగవత్పాదులకు సమమైన దార్శనికులు ఇంకెవరూ లేరని ముక్తకంఠంతో అంటారు. ఆ పండితులకు ఎవరిపట్లా పక్షపాతం లేదు. ఎందుకంటే వారు పుట్టింది క్రైస్తవమతంలో... వారిది నిశితంగా విమర్శచేసే స్వభావం. ఎందులో న్యాయం ఎక్కువగా ఉంది, ఏది న్యాయసమ్మతమైనది అని యోచన చేయగల స్వభావం ఉంటుంది వారికి.

భారతీయ దార్శనిక పరంపరలో వచ్చిన తత్త్వధారలన్నిటి గురించీ తీక్షణంగా విమర్శ చేసి వారు చివరికి చేసిన నిర్ణయం ఏమిటంటే- ఆదిశంకరుల ఆలోచనా ధార అత్యంత న్యాయసమ్మతమైనది అత్యంత సముచితమైనది, అత్యంత ప్రామాణికమైనది- సర్వజన గ్రాహ్యమైనది- అని.

"అంతటి మహానుభావులైన ఆదిశంకరాచార్యులు తమ కాలంలో తాము చేయవలసిన పనులన్నిటినీ చేసేశాము. తాము చేయవలసిన పనులేవీ మిగలలేదు అని భావించక, తాము అక్కడికి అంతటితో విడిచిపెడితే పునః ఈ జనుల తత్త్వం ముందున్నట్టుగానే అవుతుందని ఆలోచించారు. మనం చూస్తున్నాం. అనేక జనులు అనేక విధాలుగా పేరుగడించి జనులలో ఒక విశేషమైన భావనను రూపొందిస్తుంటారు. వారు పోయిన వెంటనే కొన్నేళ్లలో వారు చూపిన మార్గాన్ని జనులు మరచిపోవడాన్ని మనం లోకంలో చూస్తు న్నాము. శంకరులు ఏం చేశారు? 'నేను దీనికి ఏ వ్యవస్థా చేయకుండా పోతే కొన్ని ఏళ్ళలో జనులు దీన్ని మరిచిపోతారు. ఇది నిరంతరంగా ఉండా లంటే దీనికి అత్యంత సుభద్రమైన వ్యవస్థను నేను ఏర్పాటు చేయాలి' అని యోచించి ఈ చతురామ్నాయ పీఠ స్థాపన చేశారు. ఇది నిరంతరంగా ఉండాలంటే ఒక గురుపరంపర ఉండాలి. ఆ పరంపరలో ఈ ధర్మప్రచారం అవిరతంగా సాగుతూ ఉండాలి. ఆయా కాలాలలో వచ్చే జనులకు ధర్మాన్ని గురించి తెలియజేయడానికి తగిన వ్యక్తి ఎప్పుడూ ఉండాలి. అందుకు ఒక గురుపరంపరను ప్రారంభించాలి అనే ఉద్దేశంతో శంకరులు చతురామ్నాయ పీఠ స్థాపన చేశారు. అందులో దక్షిణామ్నాయ పీఠాన్ని ఈ శృంగేరి క్షేత్రంలో స్థాపన చేశారు. ఆయన స్థాపన చేసిన గడియ అత్యంత ఉత్కృష్టమైన గడియ అనిపిస్తుంది. అప్పటి నుంచి ఈ పీఠంలో ఏ రకమైన విచ్ఛిత్తికీ ఆస్కారం లేకుండా గురుపరంపర కొనసాగుతూ వస్తున్నది. ఆ గురుపరంపరలో మా గురువులు ముప్పై అయిదవవారు. వారు ఈ శృంగేరి శారదాపీఠ కీర్తిని దేశంలోని అన్నివైపులా వ్యాపింపజేశారు. ప్రతి ఒక్కరికీ శారదాపీఠం పట్ల భక్తి కలిగేట్టు చేశారు. ధర్మప్రబోధం చేశారు. ఆయన తమ తర్వాత ఆ బాధ్యతను మేము స్వీకరించాలంటూ మమ్మల్ని ఆజ్ఞాపించారు. ఆయన ఆజ్ఞ ప్రకారం మేము ఈ గురుతరమైన ఉత్తరాధికారాన్ని స్వీకరించవలసి వచ్చింది. యద్యపి నా స్వభావానికి నాకు శాస్త్ర చింతన, అనుష్ఠానం- ఈ రెండూ ఎప్పటికీ చేస్తూ ఉండాలి అని ఉన్నా... గురువులు మాకొక ఆదేశం చేసినందువల్లా ఆ ఆదేశాన్ని పాటించడం మా కర్తవ్యం అయినందువల్ల ఆ కర్తవ్య దృష్టితో మా గురువుల ఆదేశాన్ని పాటించవలసి ఉంది. కాని మా స్వభావానికి ఇటువంటి గురుతరమైన జవాబుదారీని నడపడం



కష్టం అని ఆ శారదాంబ యోచించి గౌరీశంకర్ అనే వ్యక్తిని నాకు చూపించారు... అందువల్ల నా శాస్త్ర చింతనకూ అనుష్ఠానానికీ ఏవిధమైన తొందరా కలగకుండా ఈ మఠాన్ని నడిపించడానికి అవకాశం లభించింది. మా గురువుల కృప వల్ల మఠంలో ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయి. వాటన్నిటికీ మాతో ఉండి ఇందుకు కారకుడైన గౌరీశంకర్‌కు నేను ఈ సందర్భంలో విశేషమైన ఆశీర్వాదాలను చేయవలసి ఉంది. ఎన్నో పనులు జరిగాయి. మున్ముందు ఎన్నో పనులు జరుగ నున్నాయి... కావలసినవి ఇంకా ఎన్నో ఉన్నాయి. ఆ జగన్మాత మా ద్వారా ఏమేమి నడిపించాని అనుకొని ఉన్నదో అవన్నీ జరిగి తీరుతాయి. అందుకు ఈ గౌరీశంకర్ ఆరోగ దృఢగాత్రుడై సదా ఉత్సాహభరితుడై ఇతోధికమైన శ్రద్ధతో ముందు జరగవలసిన కార్యక్రమాలను నడపడానికి వలసిన శక్తిసామర్థ్యాలను తల్లి శారద అతనికి ఇవ్వనీ అని ఆశీర్వదిస్తున్నాను...

"మా గురువుల షష్టిపూర్తి ఇదివరలో 1977లో జరిగింది. మా పరమగురువుల షష్టిపూర్తి 1953లో జరిగింది. వారికి 60 ఏళ్ళు నిండింది 1952లో. 1953లో సహస్ర చండీయాగాన్ని నిర్వహించారు. వారికి ఏ అవసరమై లేదు. వారి దగ్గరికి వెళ్లి తమ షష్టిపూర్తి సందర్భంలో కొన్ని పనులు చేయవలసి ఉంది అన్నప్పుడు 'ఏమీ చెయ్యనక్కరలేదు ఊరికే పొండి అవతలికి8 అన్నారు. 'నా షష్టిపూర్తికి మీరేమీ చెయ్యవద్దు. అవతలికి వెళ్ళండి' అన్నారు. కాని శిష్యజనులు వదలలేదు. శిష్యజనులు మేము ఇంకేమీ చేయబోవడం లేదు. దేవతారాధన చేస్తాము. దానికీ అనుజ్ఞ లేదా?' అంటే 'దేవతారాధన చేసేట్టుంటే చేయండి. అంతే!' అన్నారు." (సశేషం)

# ధర్మజిజ్ఞాస


పి. భాస్కరయోగి

(గత సంచిక తరువాయి)

**258. దశావతారాలు ఏవి? వివరించండి?**

మత్స్యః కూర్మో వరాహశ్చ । నారసింహశ్చ వామనః ॥
రామో రామశ్చ రామశ్చ । బుద్ధశ్చ కల్కిరేవచ ॥
మత్స్యః కూర్మో వరాహశ్చ । నారసింహశ్చ వామనః ॥
రామో రామశ్చ రామశ్చ । కృష్ణశ్చ కల్కిరేవచ ॥

1. మత్స్య 2. కూర్మ 3. వరాహ 4. నారసింహ 5. వామన 6. పరశురామ 7. శ్రీరామ 8. బలరామ 9. శ్రీకృష్ణ 10. కల్కి.

శ్రీకృష్ణ బలరాముల్లో ఒకరిని మాత్రమే స్వీకరిస్తే తొమ్మిదవ అవతారం బుద్ధుడు. శ్రీకృష్ణునిది పరిపూర్ణావతారం. కాబట్టి దశావతారాల్లో పరిగణించకూడదని కొందరు వాదిస్తున్నారు. నాస్తికుడైన గౌతమబుద్ధుడు దశావతారాల్లోని వాడని కొందరు, కాడని మరికొందరు వాదిస్తున్నారు. ఏదిఏమైనప్పటికీ పైన చెప్పినవే ప్రసిద్ధమైనవిగా పండితుల అభిప్రాయం.

**260. పత్రికల్లో ఇతర ప్రచార ప్రసార మాధ్యమాల్లో మన సంప్రదాయానికి చెందిన పదాలను ఇష్టానుసారంగా వాడి అవమానించడం సబబేనా?**



తెలియకుండా చేసినవాళ్లు సవరించుకొంటే మంచిది. తెలిసి అవమానం చేస్తే అది క్షంతవ్యం కాదు. శ్రీ సరస్వతీదేవిని నగ్నంగా చిత్రీకరించాడు ఒక చిత్రకారుడు. అదే కళ అని పత్రికలు ప్రచారం చేయడం మన దురదృష్టం. అలాగే భాషావేత్తలు కూడా ఈ వివక్షను ప్రదర్శించారు. ఆర్యద్రావిడ భాషలుగా భాషలను వర్గీకరించి సిద్ధాంతాలు రచించారు. అది అంతవరకే ఉంటే బాగుండేది. రెండు జాతులుగా వేరుచేసి చూపడం, ఈ దేశాన్ని ఎవ్వరైనా ధర్మసత్రంగా భావించి జీవించవచ్చనే సూత్రీకరణకు బాటలు వేశారు. ఇది గర్హనీయం.

అదేవిధంగా ప్రచార ప్రసార మాధ్యమాల్లో ధార్మిక సంబంధ పదాలను ఇష్టానుసారంగా ప్రయోగించడం తగదు. ప్రజలకు కూడా తమ భాష పట్ల అవగాహన, ఆలోచన, ఆవేదన ఉన్నట్లయితే ఇలాంటి తప్పులు జరగవు. ఉదా. 'మందిరమ్'- అనే మాటకు ఇల్లు, గృహం అని అర్థాలున్నా 'దేవునికి సంబంధించిన గృహం' అనే అర్థమే స్థిరమైపోయింది. (పశుమందిరం, పూజ మందిరం అనే మాటలు ప్రసిద్ధమే) కాని చెప్పుల దుకాణాలకు, బట్టల దుకాణాలకు చివర 'మందిర' శబ్దం చేర్చడం జాతి అవగాహనాలోపమే. అలాగే స్వస్తి అనే మాటకు 'మంగళకరమైన ముగింపు' అనీ, మంగళం అనే మాటకు 'శుభం' అనే అర్థాలు మనకు తెలుసు. పత్రికల వాళ్లు... ప్రభుత్వం చేతగాక ఆపివేసిన విషయాలకు ఈ పదాలు వాడుతున్నారు (దేవాదుల ప్రాజెక్టుకు మంగళం, పెన్షనర్ల సౌకర్యాలకు స్వస్తి) తమిళనాడులోని కుంభకోణం గొప్ప పుణ్యక్షేత్రం. ఎప్పుడో అక్కడ మోసగాళ్లు ఉన్నందుకు ఇప్పటికీ అవినీతికి పర్యాయపదంగా 'కుంభకోణం' పదాన్ని వాడడం మనం చూస్తున్నాం. ఇటీవల ఒక పత్రిక 'స్వలింగ సంపర్కం' అనే అంశాన్ని ప్రధాన వార్తగా చూపించే సందర్భంలో 'స్వలింగ పురాణం' అనే హెడ్డింగు పెట్టారు. ఈ సందర్భంలో లింగభక్తులంతా ఏం చేస్తున్నారన్న ఆవేదన కలిగింది. అలాగే పబ్ కల్చర్, గే కల్చర్- అనే పదాలు పత్రికలు బాగా ప్రచారం చేస్తున్నాయి. 'కల్చర్' అనే మాటకు 'సంస్కృతి' అని అర్థం. సంస్కృతి అనే పదానికి ఎంత గొప్ప అర్థం ఉందో, ఎంత విస్తృతార్థం ఉందో మనకు తెలుసు. ఇలాంటి నీచమైన కార్యక్రమాలకు 'కల్చర్' అనే మాటలను తగిలించడం సిగ్గుచేటు కాదా? ఇదే ఇతర మతవిశ్వాసాలకు చెందిన పదాలను ఇలాగే ప్రయోగిస్తారా?

(సమాప్తం)




(గత సంచిక తరువాయి)

**అవ్యక్తాద్వ్యక్తయః సర్వాః ప్రభవంత్యహరాగమే ।**
**రాత్ర్యాగమే ప్రలీయంతే తత్రైవావ్యక్తసంజ్ఞకే ॥ 3**

బ్రహ్మ యొక్క పగలు ప్రారంభంకాగానే, సమస్త ప్రాణులు అవ్యక్త మూలం నుండి ఉద్భవిస్తాయి. మరియు ఆయన రాత్రి మొదలైనంతనే, అన్ని జీవాత్మలూ తమ అవ్యక్త రూపంలోకి లీనమై పోతాయి.

**త్రైవిద్యా మాం సోమపాః పూతపాపా యజ్ఞైరిష్ట్వా స్వర్గతిం ప్రార్థయంతే ।**
**తే పుణ్యమాసాద్య సురేంద్రలోకమ్ అశ్నంతి దివ్యాన్ దివి దేవభోగాన్ ॥**
**తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి ।**
**ఏవం త్రయీధర్మమనుప్రపన్నా గతాగతం కామకామా లభంతే ॥ 4**

"వేదములలో చెప్పబడిన సకామ కర్మకాండల పట్ల మొగ్గుచూపేవారు, నన్ను యజ్ఞ యాగాదులచే పూజిస్తారు. యజ్ఞ శేషము అయిన సోమరసపానము చేయటం ద్వారా పాపాలన్నీ పోయి, పవిత్రులైన వీరు, స్వర్గ లోకాలకు పోవటానికి ఆశిస్తారు. వారి పుణ్య కర్మల ఫలంగా, వారు స్వర్గాధిపతి అయిన ఇంద్రుని లోకానికి వెళతారు, దేవతల విలాసాల భోగాలన్నీ అనుభవిస్తారు.

స్వర్గలోకము యొక్క విశాలమైన భోగములు అనుభవించుటచే వారి పుణ్య ఫలము అంతా తరిగిపోయిన తరువాత వారు తిరిగి భూలోకానికి వస్తారు. ఈ విధంగా భోగ వస్తు ప్రాప్తికై వైదిక కర్మ కాండలను ఆచరించేవారు భూలోకానికి పదేపదే వచ్చి పోతుంటారు.

**బహూనాం జన్మనామంతే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే ।**
**వాసుదేవః సర్వమితి స మహాత్మా సుదుర్లభః ॥5**

ఎన్నో జన్మల ఆధ్యాత్మిక సాధన తరువాత, జ్ఞాన సంపన్నుడు, ఉన్నదంతా నేనే (వాసుదేవుడే) అని తెలుసుకొని, నాకు శరణాగతి చేస్తాడు. అటువంటి మహాత్ముడు నిజముగా చాలా అరుదు.

◆◆◆

## సనాతన ధర్మము

రెండవ భాగము

## సాధారణ హిందూ మతపరమైన ఆచారాలు, సంస్కారాలు

**అధ్యాయం 1 - సంస్కారాలు :**

ప్రతి మతం తనను అనుసరించే వారికి అనేక వేడుకలను లేదా ఆచారాలను నిర్దేశిస్తుంది. ఈ ఆచారాల ఉపయోగం, సాధారణంగా చెప్పాలంటే ఇవి :


(1) జీవాత్మ తన యొక్క కోశాలను (అన్నమయ, మనోమయకోశాలు మొదలయినవి) జయించడానికి, మరియు వాటిని శుద్ధి చేసే కార్యక్రమంలో సహాయం చేయడం కొరకు; (2) దేవతలు మరియు ఋషులు వంటి ఉన్నతమైన మేదస్సులను జీవాత్మ సహాయానికి తీసుకురావడం కొరకు; (3) తన చుట్టూ ఉన్న వాతావరణాన్ని మెరుగుపరచి జీవాత్మ

మనస్సును స్థిరంగా, ఏకాగ్రతగా ఉంచి జీవితాన్ని సులభతరం చేయడం కొరకు.

పై ఉపయోగాల కొరకు ఆచారాలలో వివిధ భౌతిక వస్తువులు, హావభావాలు, భంగిమలు మరియు శబ్దాలు ఉపయోగించబడతాయి. పై లక్ష్యాలను నెరవేర్చడానికి అన్ని ఆచార విధానాలు జాగ్రత్తగా ఏర్పాటు చేయబడ్డాయి.

ఆచారాలలో ఉపయోగించే వస్తువులు పైన చెప్పబడిన లక్ష్యాల ఆకర్షణశక్తి కోసం ఎంపిక చేయబడ్డాయి. అనేక ఆచార సందర్భాల్లో నిర్దిష్టమైన పువ్వులు మొదలయినవి ఒక నిర్దిష్ట దేవుడికి సమర్పించబడతాయి, ఎందుకంటే అవి ధ్యానం లేదా దైవము యొక్క ఆకర్షణశక్తిని పంచుకుంటాయి. ఆ దైవము, భక్తునికి మధ్య సంబంధాన్ని ఏర్పరుస్తాయి. అందువలననే తులసి పూసలతో కూడిన జపమాల శ్రీకృష్ణుని పూజలో ఉపయోగించబడుతుంది; రుద్రాక్ష శివుని ఆరాధనలో వాడబడుతుంది.

పూజలలో వాడే సంజ్ఞలు మరియు భంగిమలు, చాలా వరకు, శరీరంలో ప్రసరించే ప్రాణ శ్వాస యొక్క ఉప-విభాగాలను ప్రభావితం చేస్తాయి; కొన్ని భంగిమలు, సంజ్ఞలు శరీరం యొక్క ఆకర్షణ శక్తిని చుట్టుపక్కల వాతావరణంలోకి ప్రసరించకుండా నిరోధిస్తాయి. మరియు ధ్యాన ప్రవాహాలను ప్రశాంతంగా మరియు నిశ్శబ్ద ఆలోచనకు తగిన విధంగా కదిలేలా ఈ సంజ్ఞలు మరియు భంగిమలు ఉపయోగపడతాయి.


SANÂTANA DHARMA

AN ELEMENTARY TEXT-BOOK

OF

HINDU RELIGION AND ETHICS

PUBLISHED BY THE BOARD OF TRUSTEES
CENTRAL HINDU COLLEGE
BENARES

1916

[THE RIGHT OF TRANSLATION AND REPRODUCTION IS RESERVED.]

Price Ans. 12, boards. Re. 1, cloth. Postage 1½ Anna.

పైన పేర్కొన్న మూడు ప్రయోజనాల కోసం కొన్ని శబ్దాలు కూడా ఆచారాలలో ఉపయోగించబడతాయి. అవి ప్రకంపనలకు దారితీస్తాయి. ఈ ప్రకంపనలు సక్రమంగా, సమానంగా ఉంటాయి కాబట్టి, అవి సూక్ష్మశరీర కంపనాలను చాలా సున్నితంగా సులభంగా ప్రభావితం చేసేవిగా ఉండేలా పనిచేస్తాయి. సూక్ష్మశరీరము యొక్క ఈ ప్రకంపనలు జీవుని ఆలోచన మరియు అతని భక్తి యొక్క స్థిరత్వంలో చాలా సహాయపడతాయి. తగిన రకమైన శబ్దాలు ఋషులు మరియు దేవతల దృష్టిని ఆకర్షిస్తాయి. తద్వారా వారు అతనికి సహాయం చేస్తారు. ఇంకా, ఆచారాలలో తగిన విధంగా పలుకబడిన శబ్దాలు ప్రతికూల మేదస్సులను మరియు చెడు ఆకర్షణ శక్తుల ప్రభావాలను దూరం చేస్తాయి. మరియు వక్త యొక్క (శబ్దాలను పలికేవానియొక్క) పరిసరాలను మెరుగుపరుస్తాయి.

అలా ఉపయోగించే శబ్దాలను మంత్రాలు అంటారు. మంత్రం అనేది శబ్దాల పరంపర. శబ్దాలు ఒక నిర్దిష్ట క్రమంలో అమర్చబడి ఉంటాయి: శబ్దాలను మార్చినట్లయితే కంపనాలు మార్చబడతాయి. ఫలితాలు కూడా మారుతాయి. అందుకే మంత్రాన్ని అనువదించలేము. అనువదించబడిన మంత్రం ఒక వాక్యం లాంటిది. దీనిలో పదాల యొక్క అన్ని అక్షరాలు గందరగోళంగా ఉంటాయి, ఏ అర్థాన్ని సరిగా తెలియజేయవు.


తాడేపల్లి పతంజలి

మంత్రాల గురించి గుర్తుంచుకోవాల్సిన మరో ముఖ్యమైన విషయం ఉంది: ఒక మంత్రాన్ని ఉచ్చరించే వ్యక్తి మంచి జీవితాన్ని గడపడానికి ప్రయత్నించకపోతే, ఆ మంత్రం ప్రకంపనలు (vibrations) అతనికి మేలుకు బదులుగా హాని చేస్తాయి.


ఎందుకంటే, మంత్రం యొక్క ప్రకంపనలు అతని సూక్ష్మ శరీరానికి (Sukma-sarira) సంబంధించినవి. మంత్ర ప్రకంపనలు చెడు కోరికలకు, చెడు ఆలోచనలకు వ్యతిరేకంగా పని చేసే శక్తిని సూక్ష్మ శరీరంపై ప్రయోగిస్తాయి. ఒకవేళ వ్యక్తి చెడు సంకల్పాలతో ఉంటే, అతని సూక్ష్మ శరీరం ఒక విధంగా ప్రకంఎస్తుంది. అదే సమయంలో మంత్రం యొక్క ప్రకంపనలు దానికి వ్యతిరేక దిశలో శరీరాన్ని కదిలిస్తాయి. దీనివల్ల సూక్ష్మ శరీరం తీవ్రంగా కదిలి, గాయపడి లేదా చీలిపోయే అవకాశం ఉంది.

అదే అతని సంకల్పాలు మంచివైతే, అవి మంత్రంతో కలిసి పనిచేసి ఎటువంటి సంఘర్షణనూ కలిగించవు. అతని సంకల్పాలు ఎంత బలహీనంగా ఉన్నప్పటికీ, అవి మంత్రానికి సహాయపడతాయి తప్ప అడ్డుకోవు.

(అనువాద కర్త వివరణ)

**సూక్ష్మ శరీరం అంటే ఏమిటి?**

మనం కేవలం భౌతిక శరీరం మాత్రమే కాదు. ఆధ్యాత్మిక బోధనల ప్రకారం, మనకు కొన్ని సూక్ష్మ శరీరాలు (Sukma-sarira) కూడా ఉంటాయి. వీటిని



కంటితో చూడలేం, తాకలేం. ప్రాణమయకోశం (శక్తి శరీరం), మనోమయకోశం (మనస్సు శరీరం), విజ్ఞానమయకోశం (జ్ఞాన శరీరం) వంటివి ఈ సూక్ష్మ శరీరాలలో భాగంగా ఉంటాయి. ఇవి మన ఆలోచనలు, భావోద్వేగాలు, సంకల్పాలను నిల్వ చేసుకుని, వాటి ప్రకంపనలకు ప్రతిస్పందిస్తాయి. ఈ సూక్ష్మ శరీరాలు స్థూల శరీరంలా గట్టిగా కాకుండా, శక్తితో కూడిన సూక్ష్మ తరంగాలతో నిర్మితమై ఉంటాయి.

**మంత్రం, సూక్ష్మ శరీరంపై దాని ప్రభావం**

మంత్రాలు శక్తివంతమైన శబ్ద ప్రకంపనలు (sound vibrations). ప్రతి మంత్రానికి ఒక నిర్దిష్టమైన, పవిత్రమైన ప్రకంపన స్థాయి ఉంటుంది. వీటిని జపించినప్పుడు, ఆ శబ్ద తరంగాలు మన సూక్ష్మ శరీరాలపై ప్రభావం చూపుతాయి.



ఆ మంచి సంకల్పాలు ఉన్నప్పుడు: మంత్రాన్ని జపించే వ్యక్తికి మంచి ఆలోచనలు, పవిత్రమైన ఉద్దేశాలు ఉంటే, అతని సూక్ష్మ శరీరం కూడా ఆ మంత్రం ప్రకంపనలకు అనుగుణంగా ఉంటుంది. అప్పుడు మంత్రం ఒక సానుకూలశక్తిని సృష్టిస్తుంది, సూక్ష్మ శరీరంలోని శక్తి ప్రవాహాలను క్రమబద్ధీకరించి, దానిని బలోపేతం చేస్తుంది. ఇది ఆధ్యాత్మిక ఎదుగుదలకు, అంతర్గత శాంతికి దారితీస్తుంది.

◆ చెడు సంకల్పాలు ఉన్నప్పుడు (సంఘర్షణ): ఒక వ్యక్తి చెడు కోరికలు, అసూయ, ద్వేషం లేదా స్వార్థపూరిత ఆలోచనలతో మంత్రాన్ని జపిస్తే, అతని సూక్ష్మ శరీరం ఆ ప్రతికూల భావాలకు అనుగుణంగా వేరే రీతిలో ప్రకంపిస్తుంది. ఈ స్థితిలో, మంత్రం యొక్క స్వచ్ఛమైన, పవిత్రమైన ప్రకంపనలు సూక్ష్మ శరీరం యొక్క ప్రతికూల ప్రకంపనలతో సంఘర్షణకు (conflict) గురవుతాయి.

ఈ సంఘర్షణ ఒక తాడును వ్యతిరేక దిశల్లో బలంగా లాగినట్లు ఉంటుంది. వ్యక్తి చెడు సంకల్పాలు ఒకవైపు లాగితే, మంత్రం యొక్క శక్తి మరో వైపు లాగుతుంది. దీని ఫలితంగా:

◆ తీవ్రంగా కదలడం: సూక్ష్మ శరీరం అస్తవ్యస్తంగా, తీవ్రంగా కదులుతుంది. ఇది ఒక రకమైన అంతర్గత అలజడిని సృష్టిస్తుంది.

◆ గాయపడటం లేదా చీలిపోవడం: దీర్ఘకాలికంగా లేదా తీవ్రంగా ఈ సంఘర్షణ కొనసాగితే, సూక్ష్మ శరీరం యొక్క శక్తి క్షేత్రంలో "గాయాలు" లేదా "చీలికలు" ఏర్పడతాయి. ఇది సూక్ష్మ స్థాయిలో ఒక రకమైన నష్టాన్ని సూచిస్తుంది.

దీని పర్యవసానాలు

సూక్ష్మ శరీరానికి ఇలాంటి నష్టం జరిగితే, అది భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక స్థాయిలో ప్రతికూల ప్రభావాలను కలిగిస్తుంది:

◆ మానసిక అశాంతి : ఆందోళన, నిరాశ, కోపం వంటి ప్రతికూల భావోద్వేగాలు పెరుగుతాయి.

◆ శారీరక సమస్యలు : శక్తి ప్రవాహంలో లోపాల వల్ల అలసట, బలహీనత లేదా ఇతర శారీరక అనారోగ్యాలు కూడా దారితీయవచ్చు.


◆ ఆధ్యాత్మిక పురోగతికి ఆటంకం : మంత్రజపం ద్వారా పొందవలసిన సానుకూల ఫలితాలకు బదులుగా, ఇది ఆధ్యాత్మిక మార్గంలో అడ్డంకులను సృష్టిస్తుంది.

కాబట్టి, మంత్రాన్ని జపించేటప్పుడు శుద్ధమైన సంకల్పం మంచి జీవనం చాలా ముఖ్యం. అప్పుడే మంత్ర శక్తి నిజమైన ప్రయోజనాలను అందిస్తుందని సారాంశం.)

మంత్రాలను బిగ్గరగా పలకవలసిన అవసరం లేదు. వాటి నిశ్శబ్ద ఉచ్చారణ, నిజానికి, వినగలిగే పఠనం కంటే శక్తివంతమైనది. అవి దట్టమయిన పదార్థాల కంటే సూక్ష్మ పదార్థాలను ప్రభావితం చేస్తాయి.

హిందువుల జీవితంలోని అనేక వేడుకల్లో వారి జీవితంలోని ప్రధాన దశలను గుర్తించే కొన్ని ముఖ్యమైనవి ఉన్నాయి; పాత రోజుల్లో ఇవి అనేకమున్నాయి. వాటిలో పది ముఖ్యమైనవిగా నిలిచాయి. కానీ ఈ పది సంస్కారాలలో ఇప్పుడు కొన్నిటిని మాత్రమే ఆచరిస్తున్నారు. ఈ సంస్కారాలలో శిశు జీవితానికి మరియు బాల్యానికి సంబంధించినవి ఏడు ఉన్నవి. ఈ ఏడింటిలో ఆరవది అన్నప్రాశనం. పసి పిల్లలకు మొదటి సారిగా అన్నం తినిపించే వేడుక ఇది. ఇది విశ్వవ్యాప్తంగా అనుసరించబడింది; మరియు ఏడవది చూడాకరణం. అనగా పుట్టువెంట్రుకలు తియ్యడము. ఈ సంస్కారముతో చెవులు కుట్టడం కూడా దాదాపుగా విశ్వవ్యాప్తంగా జరిగే సంస్కారము. ఆ తర్వాత ముఖ్యమైన ఎనిమిదవ సంస్కారం ఉపనయనం. బ్రహ్మచారిని పవిత్రమైన దారాన్ని ఇచ్చే సంస్కారముతో గురువు వద్దకు వేదాధ్యయనం కొరకు తీసుకొని వెళ్లటను ఉపనయనం అంటారు. ఈ ఉపనయన సంస్కారములో గాయత్రిని బోధిస్తారు. ఈ దీక్ష బ్రహ్మచారిని ద్విజునిగా చేస్తుంది. ద్విజ అనగా రెండుసార్లు పుట్టువాడు. (జన్మించిన పిదప ఉపనయనముచే రెండవ పుట్టుక వస్తుందని, అందుకే ద్విజుడంటారని భావం).

(సశేషం)




(గత సంచిక తరువాయి)

**వంధ్యాసూనుఖరీవిషాణసదృశక్షుద్రక్షితీంద్రక్షమా-**
**శౌర్యౌదార్యదయాదివర్ణనకలాదుర్వాసనావాసితామ్ ।**
**మద్వాణీమధివాసయామి యమినస్త్రైలోక్యరంగస్థలీ-**
**నృత్యత్కీర్తినటీపటీరపటలీచూర్ణైర్వికీర్ణైః క్షితౌ ॥ 8॥**

తాత్పర్యం : గతంలో నేను రాజులను ప్రసన్నం చేసుకోవడానికి వారిలో లేని గుణాలను ఉన్నట్టుగా వర్ణించాను. ఓర్పు, పరాక్రమం, దాతృత్వం, జాలి వంటివి వారిలో లేకపోయినా ఉన్నాయని పొగిడాను. అటువంటి పొగడ్తలు 'వంధ్యా పుత్రుడు' (పిల్లలు లేని స్త్రీకి పుట్టిన కొడుకు) లేదా 'గాడిద కొమ్ములు' వంటివి. అంటే అవి అసంభవం, అసత్యం. అటువంటి అబద్ధాలు పలకడం వల్ల నా నాలుక అపవిత్రమైంది.""శ్రీ శంకరాచార్యుల వారి 'కీర్తి' అనే ఒక అందమైన నర్తకి ముల్లోకాలనే రంగస్థలంపై నాట్యం చేస్తోంది. ఆమె నాట్యం చేస్తున్నప్పుడు ఆమె శరీరం నుండి రాలిన సుగంధభరితమైన పరాగ రేణువులవలె శంకరుల గుణాలు లోకమంతా వ్యాపించాయి.""ఆ దివ్యమైన కీర్తి పరాగాన్ని నా నాలుకకు అద్దుకుని, నా మాటలను తీయగా, సువాసనభరితంగా మార్చుకుంటాను. తద్వారా నా గత పాపాలను కడిగివేసుకుంటాను."

వ్యాఖ్య :

1. అల్పులైన రాజుల వర్ణన (వాక్కుకు పట్టిన దుర్వాసన):

- వంధ్యాసుత-ఖరీవిషాణ: గొడ్రాలి కొడుకు, గాడిద కొమ్ములు ఎలాగైతే అబద్ధమో (అసంభవమో), అల్పులైన రాజుల వద్ద లేని గుణాలను ఉన్నట్టుగా వర్ణించడం కూడా అంతే వ్యర్థం.
- క్షుద్ర క్షితీంద్ర: నీచులైన రాజుల యొక్క క్షమ, శౌర్యం, ఔదార్యం, దయ వంటి గుణాలను (నిజానికి వారిలో లేనివి) వర్ణించడం వల్ల నా వాక్కుకు 'దుర్వాసన' అంటుకుంది. దీన్నే వ్యాఖ్యాత 'దుర్వాసనా వాసితామ్' (చెడు వాసనతో నిండినది) అని పేర్కొన్నారు.

2. వాక్కును సుగంధభరితం చేసే విధానం:

- యమినః (శ్రీశంకరస్య): గొప్ప యతి అయిన శ్రీశంకరాచార్యుల వారి కీర్తి అనే నర్తకి (నటి), ఈ మూడు లోకాలనే 'రంగస్థలం' మీద నాట్యం చేస్తోంది.
- పటీర పటలీ చూర్ణైః: ఆ కీర్తి అనే నటి నాట్యం చేస్తున్నప్పుడు, ఆమె శరీరం నుండి చిందేచందనపు పొడి (గంధపు పొడి) భూమండలమంతా వ్యాపించి ఉంది.
- అధివాసయామి: ఆ దివ్యమైన గంధపు పొడితో నా వాక్కును ఇప్పుడు సుగంధభరితం (పవిత్రం) చేస్తున్నాను అని కవి భావం.

3. చారిత్రక ప్రస్తావన (శ్రీ బుక్కరాయల ఉదాహరణ):

- వ్యాఖ్యానంలో చివరగాశ్రీ బుక్కరాయల (విజయనగర సామ్రాజ్య చక్రవర్తి) వంటి రాజుల స్తుతి చాతుర్యాన్ని ఉదాహరణగా చూపారు. ఇక్కడ విద్యారణ్యస్వామివారుతన పాండిత్యాన్ని, వినయాన్ని ప్రదర్శిస్తూ, కేవలం లోక విరుద్ధమైన


స్తుతి కంటే గురువుల కీర్తన మిన్న అని చెబుతున్నారు.

4. క్షితి (భూమి):

◆ ఇక్కడ 'క్షితౌ' అంటే ఈ భరతవర్షం (భారతదేశం) అంతటా అని అర్థం.

**పీయూషద్యుతిఖండమండనకృపారూపాంతరశ్రీగురు-**
**ప్రేమస్థేమసమర్పణార్హ మధురవ్యాహారసూనోత్కరః ।**
**ప్రౌఢో?యం నవకాళిదాసకవితాసంతానసంతానకో**
**దద్యాదద్య సముద్యతః సుమనసామామోదపారంపరీమ్ ॥ 9॥**

తాత్పర్యం : అమృత కిరణాలను కురిపించే చంద్రుడిని ధరించిన ఆ పరమశివుడే, మానవులపై జాలితో శంకరాచార్యులుగా అవతరించారు.నవ కాళిదాసు (రచయిత) రాసిన ఈ మధురమైన మాటలు భక్తితో నిండినవి.వీటిని శ్రీ శంకరుల పాదాల చెంత పుష్పమాలగా సమర్పిస్తున్నాను.కల్పవృక్షం దేవతలకు ఆనందాన్ని ఇచ్చినట్లుగా, ఈ గ్రంథం పండితులందరికీ సంతోషాన్ని కలిగిస్తుంది.




**వ్యాఖ్య :**

1. కావ్యం - కల్పవృక్షం (నవకాళిదాస కవితా సంతానం):

◆ నవకాళిదాస: ఈ కావ్య కర్త అయిన విద్యారణ్య స్వామివారు తనను తాను 'నవకాళిదాసు'గా పేర్కొన్నారు.

◆ కల్పవృక్ష రూపకం: ఈ కావ్యం ఒక కల్పవృక్షం వంటిది. కల్పవృక్షం ఎలాగైతే దేవతలకు (సుమనసులకు) కావాల్సినవన్నీ ఇచ్చి ఆనందింపజేస్తుందో, ఈ 'శంకర దిగ్విజయం' అనే కావ్యం కూడా పండితులకు (సుమనసులకు) నిరంతర ఆనందాన్ని (ఆమోద పరంపరను) ప్రసాదిస్తుంది.

2. గురువుగారి వర్ణన (శివ స్వరూపం):

◆ పీయూషద్యుతి ఖండమండన: చంద్రుడిని (అమృత కిరణుడిని) శిరోభూషణంగా ధరించిన ఆ పరమశివుని యొక్క మరొక రూపమే (రూపాంతరమే) ఈ సద్గురువులు.

◆ మధుర వ్యాహార సూనోత్కరః:ఆ గురువుగారి పట్ల ఉన్న నిశ్చలమైన భక్తితో సమర్పించబడిన మధురమైన మాటలే ఈ కల్పవృక్షానికి పూలు (సూనములు). ఆ పూల గుత్తులతో ఈ కావ్యం శోభిస్తోంది.

3. అలంకార విశేషం (రూపక అలంకారం):

◆ ఇందులో 'రూపక అలంకారం' ఉంది.

◆ లక్షణం: "విషయస్య భేద తాద్రూప్య రంజనం విషయస్య యత్ । రూపకం తత్" - అంటే, ఉపమేయానికి (కావ్యానికి), ఉపమానానికి (కల్పవృక్షానికి) మధ్య ఎటువంటి భేదం లేదని చెప్పడం వల్ల ఇది రూపక అలంకారం అయింది. కవి తన కవితా సంతానాన్ని నేరుగా కల్పవృక్షంగానే చిత్రించారు.

**సామోదైరనుమోదితా మృగమదైరానందితా చందనై-**
**ర్మందారైరభివందితా ప్రియగిరా కాశ్మీరజైః స్మేరితా ।**
**వాగేషా నవకాళిదాసవిదుషో దోషోజిఝితా దుష్కవి-**
**వ్రాతైర్నిష్కరుణైః క్రియేత వికృతా ధేనుస్తురుష్కైరివ ॥ 10॥**

తాత్పర్యం:

◆ 'నవ కాళిదాసు'గా పిలవబడే ఈ కవి మాటలు కొందరి ద్వారా గౌరవించబడతాయి.

◆ గంధం పూసి, మందార పూలతో అలంకరించి, కస్తూరి కుంకుమలతో సువాసనభరితంగా మార్చిన ఒక పవిత్రమైన గోవును పూజించినట్లుగా, పుణ్యాత్ములు ఈ గ్రంథాన్ని ఆరాధిస్తారు.

◆ అయితే, అదే ఆవును కొందరు క్రూరులు (మ్లేచ్ఛులు) హింసించినట్లుగా, దుర్మార్గులు ఈ కావ్యాన్ని అవహేళన చేయవచ్చు.

**వ్యాఖ్య :**

మంచి వస్తువునైనా సరే, కుటిల బుద్ధిగల వారు (దుష్కవులు) ఎలా వికృతం చేస్తారో కవి ఇక్కడ ఒక పదునైన పోలికతో వివరించారు.

1. ఉత్తమమైన వాక్కుకు ఉన్న గౌరవం:

◆ సామోదైః: పండితులకు సంతోషాన్ని కలిగించే ఈ వాక్కు (కావ్యం), కస్తూరి (మృగమదము), చందనము మరియు మందార పుష్పాల వంటి సుగంధ ద్రవ్యాల చేత గౌరవించబడింది.

◆ కాశ్మీరజైః: కాశ్మీర దేశపు కుంకుమపువ్వు వంటి మధురమైన మాటలతో ఈ వాక్కు వికసింపజేయబడింది (శ్లాఘించబడింది). అంటే, విజ్ఞులైన వారు ఈ కావ్యాన్ని ఎంతో ఆదరిస్తారని అర్థం.

2. దుష్కవుల వల్ల కలిగే వికృతి (పోలిక):

◆ దోషోజిఝతా: ఈ వాక్కు ఎటువంటి తప్పులు (దోషాలు) లేనిది. అయినప్పటికీ, దయలేని దుష్కవుల సమూహం దీనిని వికృతం చేయడానికి ప్రయత్నిస్తుంది.

◆ ధేనుస్తురుష్కైరివ: దీనిని వివరించడానికి వ్యాఖ్యాత ఒక ఉదాహరణ ఇచ్చారు: పాలిచ్చే పావనమైనఆవు (ధేనువు)ఎంతో ఉత్తమమైనది. కానీ, దయలేనితురుష్కులు (మ్లేచ్ఛులు)ఆ ఆవును ఎలాగైతే హింసించి వికృతం చేస్తారో, అలాగే ఈ సుగుణాల కావ్యాన్ని కూడా దుష్ట కవులు తమ కుతర్కాలతో, అసూయతో వికృతం చేస్తారు. (సశేషం)



# దర్శనమ్ ఆధ్యాత్మిక వార్తామాసపత్రిక

## దర్శనమ్ శ్రేయోభిలాషులకు నమస్కారం... సవినయ విన్నపం

సనాతన ధర్మ పరిరక్షణే లక్ష్యంగా 21 సంవత్సరాలుగా 'దర్శనమ్' ఆధ్యాత్మిక వార్తామాసపత్రిక ధర్మనిష్ఠతో కృషిచేస్తోంది.. చతురామ్నాయ పీఠాల జగద్గురువులు సహా ధర్మాచార్యులకు, పీఠాధీశ్వరులకు గురువందనమ్, ధార్మికవేత్తలు, మహాత్ములకు గురుసత్కారం కార్యక్రమాలను సభక్తికంగా నిర్వహిస్తోంది. వేద, శ్రౌత, శాస్త్ర, ఆర్ష ధర్మాన్ని పునరుజ్జీవింపజేసే ఎన్నో ధార్మిక కార్యక్రమాలను చిత్తశుద్ధితో నిర్వహిస్తోంది. సంస్కృత, తెలుగు భాషా వికాస కార్యక్రమాలను, అవధానాలను విరివిగా నిర్వహిస్తోంది. జీర్ణదేవాలయాల పునరుద్ధరణ, గోసంరక్షణ, లోక కళ్యాణం కోసం ఎన్నో యాగాలు, ధార్మిక కార్యక్రమాలను తరచూ నిర్వహిస్తోంది. దర్శనమ్ పత్రిక ప్రతి నెల 25వ తేదీన మార్కెట్లోకి, 1వ తేదీన పాఠకుల ముంగిట్లోకి అందేలా క్రమశిక్షణ, సమయపాలన, నిబద్ధతతో కృషిచేస్తోంది. ఒక సామాన్యుడి ధార్మికోద్యమ అక్షరాయుధం 'దర్శనమ్' ఆర్షధర్మ పరిరక్షణ, సంస్కార సమాజం కోసం అహరహం ధర్మనిష్ఠతో పనిచేస్తోంది. ఈ ధార్మికోద్యమానికి మీరు అనేక సందర్భాల్లో అందించిన చేయూత.. వదాన్యత అమోఘం.. మీ సహకారం నాలో ఆత్మస్థైర్యాన్ని మరింత పెంచుతోంది. ప్రస్తుతం ఎన్నో క్లిష్టపరిస్థితులను, అవరోధాలను అధిగమించి ముందుకు సాగుతూ 22వ వసంతంలోకి పత్రిక అడుగిడింది. ఈ ధార్మికోద్యమ పత్రిక ఎల్లకాలం ముందుకు సాగాలని, తెలుగునాట పాఠకదేవుళ్లకు ఆత్మీయ నేస్తంగా ధర్మప్రబోధం అందించాలని నా ఆకాంక్ష... ఇందుకోసం పత్రిక మూలనిధి(ధర్మనిధి)ని ఏర్పాటు చేయాలని నిశ్చయించాను. మీరు మీకు తోచినంత ఈ మూలనిధికి భాగస్వామ్యం అందించి సాయపడాలని, ఈ ధార్మికోద్యమంలో భాగస్వాములు కావాలని మనఃస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను.

**- మరుమాముల వెంకటరమణ శర్మ**

## 'దర్శనమ్' చందా వివరములు

| | | |
|---|---|---|
| మూడు సంవత్సరాలకు | రూ. | 2000 |
| ఆరు సంవత్సరాలకు | రూ. | 4000 |
| జీవిత చందా (12 సం॥లు) | రూ. | 8000 |
| రాజపోషకులు | రూ. | 15000 |
| మహారాజ పోషకులు | రూ. | 25000 |
| విశిష్ట మహారాజ పోషకులు | రూ. | 100000 |

**విదేశీయులకు...**

| | | |
|---|---|---|
| మూడు సంవత్సరాలకు | రూ. | 12000 |
| ఆరు సంవత్సరాలకు | రూ. | 24000 |
| జీవిత చందా (12 సం॥లు) | రూ. | 48000 |
| విశిష్ట చందాదారులు | రూ. | 60000 |
| రాజపోషకులు | రూ. | 80000 |
| మహారాజ పోషకులు | రూ. | 100000 |

BHIM UPI
Scan using any BHIM UPI enabled APP
DARSHANAM
917013093123@cnrb
Canara Bank


**దర్శనమ్** ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక
ఇ.నెం. 29-105/4/1, శ్రీరామ సిద్ధాంతి భవనం,
న్యూ విద్యానగర్ కాలనీ, నేరేడ్‌మెట్, సికింద్రాబాద్ - 500 056.
సెల్ : 94410 15469
darshanameditordesk@gmail.com


A/C NAME : DARSHANAM
BANK: CANARA BANK
ACCOUNT NO : 120001974779
IFSC CODE : CNRB0013063
MICR : 500015150
BRANCH CODE : 13063
SWIFT CODE: CNRBINBBBFD

శ్రీరస్తు శుభమస్తు అవిఘ్నమస్తు



పరమహంస పరివ్రాజకాచార్యవర్య
శ్రీ శంకరాచార్య పరంపరాగత మూలామ్నాయ సర్వజ్ఞ శ్రీ కంచికామకోటి పీఠాధీశ్వరులు
## శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి వారి
దివ్యానుగ్రహముతో...

సాంగ స్వాధ్యాయభాస్కర, అద్వైతవేదాంగ విద్యాప్రపూర్ణ, మహామహోపాధ్యాయ, భారతాత్మ మరియు రాష్ట్రపతి సమ్మాన గ్రహీత,
బ్రహ్మశ్రీ వేదమూర్తులు విష్ణుభట్ల సుబ్రహ్మణ్య దీక్షిత సలక్షణ ఘనపాఠి గారు M.A, P.H.D
కీ॥శే॥ బ్రహ్మశ్రీ గుంటూరు వాసుదేవ మూర్తి గారి ఉభయోః కటాక్షముతో



# శ్రీ మహాభారతంలో శ్రీకృష్ణ గాధ
# నవాహ్నిక జ్ఞానయజ్ఞ మహోత్సవము

తేది : 24-10-2026 నుండి 01-11-2026 వరకు
స్థలం : గీతాజ్ఞాన సంస్థాన్, కె.డి.బి. రోడ్, కురుక్షేత్రం



ప్రవచన కర్త :
విద్యావాచస్పతి, ధార్మిక వరేణ్య
ఆర్షధర్మ విద్వన్మణి, వాగ్దేవి వరపుత్ర
## బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ గారు




కీ॥శే॥ బ్రహ్మశ్రీ గుంటూరు వాసుదేవ మూర్తి గారు
కీ॥శే॥ శ్రీ జి.వి.ఆర్.జి. మూర్తి - సుబ్బమ్మ

వేదపండితులు :
స్వాధ్యాయరత్న, వేదనిధి, ఘనరత్న,
వేదభాష్యరక్షామణి, భారతాత్మ పురస్కార గ్రహీత
బ్రహ్మశ్రీ వేదమూర్తులు విష్ణుభట్ల లక్ష్మీనారాయణ ఘనపాఠీ గారు
(టి.టి.డి. ఈ.సి. మెంబర్)

పారాయణము :
బ్రహ్మశ్రీ సామవేదం సత్యనారాయణ శాస్త్రి గారు
డా॥ ఇనుగంటి ఉమారామారావు గారు,
Sanskrit M.A. PhD.

### కార్యక్రమ వివరములు

ది. 24-10-2026న ఉ॥ అంకురారోపణ ప్రవచనం ప్రారంభం
ది. 02-11-2026న పూర్ణాహుతి అవబృథ స్నానం
ప్రతిరోజు ఉ॥ 10:00 గం॥ల నుండి మ॥ 12:00 గం॥ల వరకు
సా॥ 4:00 గం॥ల నుండి రా॥ 6 గం॥ల వరకు
శ్రీమహాభారతంలో శ్రీకృష్ణ గాథలు ప్రవచనము జరుగును
ప్రతిరోజు ఈ కార్యక్రమమునకు అంగముగా
వేదపారాయణ మొదలగు కార్యక్రమములు జరుగును.




# మహాభారతసారసంగ్రహము

155

(గత సంచిక తరువాయి)

దుర్యోధనుని మాటలు వినగానే క్రోధారుణనేత్రు డైన శ్రీకృష్ణు డిలా అన్నాడు - సరే నీకు వీరశయనం కావా లంటున్నావు కదా! తప్పకుండా లభిస్తుంది. నీ అమాత్యులతోనూ, ఇతరులతోనూ సిద్ధంగా ఉండు.

ఓ మూఢాత్మా! నేను ఏమి తప్పు చేశా నని అంటున్నావు. పాండవుల ఐశ్వర్యం చూచి అసూయ చెంది, శకునితో దురాలోచనలు చేసి ద్యూతంలో పాండవులను మోసం చేసి ఓడించావు. సాధుమార్గంలో ఉన్న జ్ఞాతుల విషయంలో సత్పురుషు లెవరైనా ఈ విధంగా వక్రమార్గంలో ప్రవర్తిస్తారా?

భ్రాతృభార్యను సభ కీడ్చుకొని వచ్చి ఎవడైనా ఆ విధంగా అవమానిస్తాడా! ఉత్తమ శీల సంపన్నురాలూ, పాండవుల పట్టమహిషీ అయిన ద్రౌపదిని గూర్చి నువ్వేమన్నావో, ఈ కర్ణ-దుఃశాసనులు నువ్వూ కూడ వనానికి బయలుదేరి వెడుతూన్న పాండవులను చూచి, అవహేళన చేస్తూ నీచజనులు కూడ నోటితో ఉచ్చరించడానికి సంకోచించే ఎలాంటి దుర్భాషలాడారో ఇక్కడ ఉన్నవాళ్లందరికీ తెలుసు.

**నృశంసానామనార్యాణాం పురుషాణాం చ భాషణమ్,**
**కర్ణదుఃశాసనాభ్యాం చ త్వయా చ బహుశః కృతమ్.**

(ఉద్యోగపర్వం 128.12)


కీ.శే. ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు

వీళ్లు తల్లితో కలిసి వారణావతంలో ఉంటున్నప్పుడు దహించి చంపి వేయడానికి గొప్ప ప్రయత్నం చేశావు. వీళ్ల అదృష్టం కొలదీ నీ ఆలోచన సఫలం కాలేదు.

వీళ్లు ఏకచక్రనగరంలో ఒక బ్రాహ్మణుని ఇంట్లో తల దాచుకొని చాలాకాలం రహస్యంగా నివసిస్తూన్న కాలంలో విషప్రయోగం చేత, సర్పాల చేత, ఇతరమైన ఉపాయాలచేతా వీళ్లనందరినీ చంపడానికి ప్రయత్నించావు. ఆ ప్రయత్నాలు కూడ సఫలం కాలేదు.

పాండవుల విషయంలో ఈ విధంగా కపటంతో అనేక సమయాలలో ప్రవర్తించిన నీవు ఇంకా ఏమి అపరాధం చెయ్యాలి?

వాళ్లు తమ వాటా తమ కిమ్మని కోరుతూంటే ఇవ్వడానికి నువ్వు ఇష్టపడటం లేదు. పాపాత్ముడా! నువ్వు ఇప్పుడు ఇవ్వకపోయినా, రాజ్యభ్రష్టుడవై నేలమీద పడవేయబడినప్పుడు

ఇస్తావులే!

పాండవులకు ఇన్ని అపకారాలు చేసి ఇప్పుడు "నేనేమి తప్పు చేశాను" అంటున్నావు. నీ తలిదండ్రులు, భీష్ముడు, ద్రోణుడు, విదురుడు - ఇంతమంది ఎన్నిమార్లు చెప్పినా నువ్వు వినడం లేదు. మంచి హృదయంతో ఉపదేశించిన వాళ్ల మాటలను వినకుండా అధర్మమూ, అకీర్తికరమూ అయిన మార్గంలో వెడుతున్నావు. నీకు సుఖం లభించదు.

కృష్ణుడు ఇలా అంటూండగానే దుఃశాసనుడు దుర్యోధనునితో - "నువ్వు ఈ సంధికి అంగీకరించకపోతే నిన్నూ, నన్నూ, కర్ణుణ్ణీ బంధించి, భీష్ముడు, ద్రోణుడు నీ తండ్రీ పాండవులకు అప్పచెపుతారట" అన్నాడు.

ఆ మాట వినగానే దుర్యోధనుడు అక్కడ నున్న భీష్మాదులు ఏమనుకుంటారో అని కూడ ఆలోచించకుండా, వాళ్ల నందరినీ అవమానిస్తూ లేచి సభ నుంచి వెళ్లిపోయాడు. వాని సోదరులూ, అమాత్యులూ, ఇతర రాజులు కూడ వాని వెనుక బయలుదేరారు.

అలా లేచి వెళ్లిపోతున్న దుర్యోధనుణ్ణి చూచి భీష్ముడు - "ధర్మార్థాలను విడిచి ఈ విధంగా తొందరపాటుతో ప్రవర్తించేవారు అచిరకాలంలో కష్టాలలో చిక్కుకొన్నప్పుడు వానిని చూచి శత్రువులు నవ్వుతారు. కృష్ణా! దురహంకారియైన ఈ రాజపుత్రుడు క్రోధలోభాలకు వశుడైపోయి సరి యైన మార్గం అనుసరించడం లేదు. క్షత్రియజాతికి కాలం మూడినట్లున్నది. వీళ్లందరూ వాని వెనుకనే వెళ్లిపోతున్నారు!" అన్నాడు.

అప్పుడు కృష్ణుడిలా అన్నాడు -

"ఇతడు ఈవిధంగా కట్టుబాట్లు అన్నీ త్రెంచి ప్రవర్తిస్తూంటే వీనిని నియమించకుండా చూస్తూ కూర్చున్న ఈ కురువృద్ధులదే ఈ తప్పంతా.

తండ్రిని చెరబట్టి రాజ్యం ఏలుతూన్న దుష్టుడైన కంసుణ్ణి ఒకనిని వధించి, యాదవులందరూ సుఖంగా ఉన్నారు.

పూర్వం మాటిమాటికీ దేవతలను బాధిస్తూన్న దానవులను సముద్రమధ్యం నుంచి బైటకు రాకుండా చేయ మని ప్రజాపతి వరుణుణ్ణి ఆదేశించాడట. నాటి నుంచి వాళ్ల ఉపద్రవం ఏదీ లేకుండా లోకాలన్నీ సుఖంగా ఉన్నాయి. అదే విధంగా మీ కులపెద్దలందరూ కలిసి ఈ దుర్యోధనుణ్ణీ, కర్ణుణ్ణీ, శకునినీ, దుఃశాసనుణ్ణీ బంధించి పాండవులకు అప్పజెబితే అందరూ సుఖంగా ఉండవచ్చు.

కృష్ణుని మాటలు వినగానే ధృతరాష్ట్రుడు విదురునితో "నాయనా! నువ్వు వెంటనే వెళ్లి గాంధారిని తీసుకొనిరా, ఆమె చెపితేనైనా వింటాడేమో ఈ దుర్మతి" అన్నాడు.

విదురుడు గాంధారాని తీసికొని వచ్చాడు. "గాంధారీ! నీ



కుమారుడు పెద్దల మాటలు వినక ఐశ్వర్యం మీద ఉండే దురాశ చేత ఐశ్వర్యాన్నీ ప్రాణాలనూ విడిచే స్థితిలో ఉన్నాడు. ఈ మూఢుడు శిష్ట మర్యాదను అతిక్రమించి సభ నుంచి లేచిపోయాడు. నువ్వేనా చెప్పు" అన్నాడు ధృతరాష్ట్రుడు.

రాజా! రాజ్యకాముడైన వానిని రప్పించు. ధర్మార్థాలకు లోపం కలిగించే శిష్టుడు కానివాడు రాజ్యం పొందడమే కష్టం. అయినా కూడా అన్ని విధాలా వినయహీనుడైన ఇతడు ఎలాగో రాజ్యం పొందాడు.

రాజా! ఈ విషయంలో నిన్నే నిందించాలి. ఎందువల్ల ననగా పుత్ర మోహం చేత నువ్వే అతడెలా చెపితే అలా చేస్తూ, ఇతడు పాపస్వభావం కలవాడని తెలిసి కూడ ఇతడీ స్థితికి వచ్చేటట్లు చేశావు. రాజు యుండి ఎవరైనా తనవాళ్లు ఇలా కలహించు కొంటూంటే ఉపేక్షిస్తాడా; నిన్ను చూచి శత్రువులు నవ్వుకొంటూంటారు అంది గాంధారి.

విదురుడు వెళ్లి దుర్యోధనుణ్ణి మళ్లీ సభకు తీసికొని వచ్చాడు. గాంధారి అతనిని పరుషమైన వాక్యాలతో నిందిస్తూ "ఇలా ఇంద్రియ నిగ్రహం లేకుండా స్వేచ్ఛగా ప్రవర్తించేవాడు అభివృద్ధి పొందజాలడు" అంది.

"కృష్ణుడు రెండు పక్షాల క్షేమం కోరినవాడు. అతడు చెప్పి నట్లు చెయ్యి. తన అభివృద్ధిని కోరి ఉపదేశించే బుద్ధిమంతులైన మిత్రుల మాటలు విననివాడు శత్రువులకు ఆనందకరు డవుతాడు."

**సుహృదామర్థకామానాం యో న తిష్ఠతి శాసనే,**
**ప్రాజ్ఞానాం కృతవిద్యానాం స నరః శత్రునన్దనః.**

(ఉద్యోగపర్వం 129.32)

యుద్ధం మంచిది కాదు. దానిలో ధర్మార్థాలు లేవు. సుఖం ఎలా ఉంటుంది. యుద్ధంలో విజయం తప్పక లభిస్తుందనే నమ్మకం కూడ లేదు. అందుచేత యుద్ధం చెయ్యాలనే ఆలోచన మానుకో.

(సశేషం)




# తిరుమల చరితామృతం

150

(గత సంచిక తరువాయి)

రెండు మూడు లక్షల విరాళాలలో కనీస సదుపాయాలతో కట్టే అతిథిగృహాల స్థానంలో రెండు స్టార్‌ల, ఐదుస్టార్‌ల విలాసగృహాలు కట్టడం, వాటిని నిర్వహించడానికి ప్రత్యేక సిబ్బంది వారి వారి కంపెనీల ద్వారా ఏర్పాటుచేయడం - వారికి, వారి తరపున వచ్చే వారికి అన్ని సదుపాయాలు ఏర్పాటుకు అవకాశం... ఒకరిని మించి ఒకరు ఇంకా బాగుండే అతిథిగృహాలు కట్టాలన్న పోటీపడి కట్టే సంప్రదాయం వచ్చేసింది. కోటి రూపాయలు విరాళమిచ్చి అతిథిగృహాలు కట్టే నిర్ణయాలు చేస్తున్నాం. అలా డబ్బు ఇవ్వగలవాళ్లు చాలా మంది పలుకుబడిగలవాళ్లే కదా! ఇంతా చేస్తే అందులో మూడో నాలుగో గదులు... మహావుంటే ఎనిమిది మంది, పదిమంది ఉండవచ్చు- దేవస్థానం డబ్బు ఖర్చుపెట్టకపోయినా, విలువైన స్థలం కొండమీద కేటాయించాల్సి వస్తుంది. కష్టపడి పెంచిన చెట్లు కొట్టి ఈ కట్టడాలు కట్టాల్సి వస్తుంది. వీటికి కావల్సిన రోడ్లు, నీరు, విద్యుత్తు, మురుగు సౌకర్యాలకు ఏర్పాట్లు దేవస్థానం చేయాల్సిందే కదా. ఇదే స్థలం సామాన్యభక్తుల అవసరాల కోసం నిర్మాణం చేస్తే, వందల మందిని తృప్తిపరచవచ్చు.

40 ఏళ్ల క్రితం కొండమీద ఏసీలకు అవసరమే ఉండేది కాదు. చెట్లు కొట్టడాలు విపరీతంగా నిర్మాణాలు వచ్చాక ఏసీల అవసరం పెరిగింది. కొండమీద ఇప్పుడు ప్రతివారికీ ఏసీ రూములు కావాలి. ఇటువంటి కార్పొరేటు అతిథిగృహాలు వందలకొద్దీ కొండమీద వెలిశాయి.



కీ.శే. పివిఆర్‌కె ప్రసాద్

నేను వేయికాళ్ల మండపం, మాస్టరుప్లాను విషయంలో ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు విషయం కూలంకషంగా చర్చించి, ఇటువంటి అతిథిగృహాల నిర్మాణం ఆపివేయాలని, వీలయినంతవరకు కొండమీద కొత్త కట్టడాల విషయం నిషేధం విధించి, వచ్చే 20,30 ఏళ్ల అవసరాల దృష్ట్యా కొండమీద ఎటువంటి సదుపాయాలు చేయాలి, కొండకింద తిరుపతిలో ఎటువంటి సౌకర్యాలు చేయాలన్నది ఒక మాస్టర్‌ప్లానును నిపుణులతో చర్చించి, ఆ తర్వాతే వారి సూచనల మేరకు కట్టడాలు చేపట్టాలని సూచన చేశాను.

కాని ఆ సూచనలు చదివిన వారు తక్కువ. ఆచరించినవారు లేరు. నన్ను దేవస్థానానికి సలహాదారుగా నియమించినప్పుడు మళ్లీ సలహాలిచ్చి, ఈ విషయంలో కొత్త అతిథిగృహాలు కట్టకుండా ఆంక్ష విధించాలని అప్పటి కార్యనిర్వహణాధికారి ఎ.పి.వి.ఎన్ శర్మకి సూచించాను. ఆయన విషయం అర్థం చేసుకుని పాలకమండలిలో చర్చకు పెట్టినప్పుడు, పాలకమండలి నుంచి వ్యతిరేకత చాలా వచ్చింది. 50 లక్షలు, కోటి రూపాయలు దానం ఇచ్చి, వారే కట్టిస్తామన్నా మనం అనుకూలం చేయకపోతే మేము పాలకమండలి సభ్యులుగా ఎందుకు, అధ్యక్షులుగా ఎందుకు? ససేమిరా కాదని,

ఆయనను, ఆయనకు సలహా ఇచ్చిన నన్ను నిష్ఠురంగా విమర్శ చేసే దాకా వచ్చింది.

ఇటువంటి సదుపాయాలు మంచి మంచి భక్తుల అలవాట్లను కూడా పాడు చేస్తాయి. సౌకర్యాలు ఉండాలి- అవసరం కాని భోగలాలసత్వం కొండమీద ఉండరాదు. దానికి ప్రోత్సాహం చూపరాదు. ఈ భోగాలకు అవకాశం ఉంది గనుక విలాసం కోసం కొండకు వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. భక్తితో వచ్చే వాళ్లకు కూడా వారి దృష్టి భోగాలవైపు మళ్లించే సందర్భం...

వైకుంఠం క్యూ-కాంప్లెక్సుకి 1980లో నేను కార్యనిర్వహణాధికారిగా ఉన్నప్పుడు పథకం తయారుచేశాం. యాత్రికులు కొండకు వచ్చేది దర్శనానికి... ఇతర అవసరాలు తీర్చుకోవడానికి కాని భోగించడానికి కాదు అన్నది జ్ఞప్తిలో ఉంచుకోవాలి. వారు కొండకు రాగానే కాలకృత్యాలు తీర్చుకోవడానికి, వారి సామానులు భద్రపరచుకోవడానికి, మరుసటి రోజు సేవ చేయాలంటే కొంచెం విశ్రాంతికి.. ఈ అవసరాలన్నీ క్యూ-కాంప్లెక్సులోనే కలిగిస్తే వేరే వసతి తీసుకొనే అవసరమే ఉండదు గదా! అలానే అన్ని సదుపాయాలు ఉండే విధంగా ఆ కాంప్లెక్సు కట్టించాం. ఇటువంటి కట్టడాల విషయంలో చాలా అనుభవం ఉన్న అప్పటి దేవస్థానం అధ్యక్షులు విజయా స్టూడియో అధిపతి నాగిరెడ్డి చాలా శ్రద్ధ తీసుకున్నారు.

ఇప్పటికీ తిరుమలలో వేలాది భక్తులు రోడ్లమీద పడుకోవడం (వసతి లేక) చేస్తాం! అదే సమయంలో నూరుమందికి సరిపోయే గదిలో విలాస వస్తువులతో ఇద్దరు ముగ్గురు గడిపే అతిథిగృహాలు ఎన్నో ఉండడం చూస్తున్నాం. దేవస్థానం పాలకమండలి ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి నిర్మాణాల విషయంలో నిర్దుష్టమైన ప్రణాళిక ఏర్పాటు చేయాలి. (సశేషం)

కొత్తగా వచ్చిన సాంకేతిక నైపుణ్యం (టెక్నాలజీ) సహాయంతో అసలు దర్శనం కోసం వేచివుండే అవసరమే లేకుండా, వేలిముద్ర, కంటిముద్రల ఆధారంగా వారికి కేటాయించిన సమయంలో వచ్చి దర్శనం చేసుకొనే ఏర్పాట్లకు అవకాశం ఉన్న ఈ రోజుల్లో - కొండమీద ఇంకా వసతి కోసం కట్టడాలే అక్కరలేదనిపిస్తుంది.

మరీ కాదనుకుంటే, కొండమీద పలుచోట్ల వచ్చిన యాత్రికులకు కాలకృత్యాలు తీర్చుకోవడానికీ, స్నానాలు చేయడానికీ, సామాన్లు భద్రపరచుకొనే లాకర్లు - రోడ్డు మీద పడుకొనే అవసరం లేకుండా పెద్ద పెద్ద హాళ్లు కట్టిస్తే సరిపోతుంది. ఎంతమంది వచ్చినా ఒక్క అరగంటలో వారి



అవసరాలు తీర్చుకొని దర్శనానికి వెళ్లే వెసులుబాటు చేయాలి.

కొండమీద కార్ల వాడకంలో కూడా కొంత నియంత్రణ చేయాలి. కొండమీద నిర్ధారించిన నాలుగయిదు ప్రాంతాల్లో ఒక్కొక్కచోట వందలకొద్దీ కార్లు నిలపడానికి పెద్దయెత్తున సదుపాయం చేయాలి. నేను కార్యనిర్వహణాధికారిగా ఉన్నప్పుడు ప్రారంభించిన ఉచిత బస్సులు, అప్పుడు దళారుల నుండి, కూలివారి బారి నుంచి సామానులు, యాత్రికులు మోయనవసరం లేకుండా ఉండడానికి చేసిన ఏర్పాట్లు - ఇతర టాక్సీలు, ఆటోలు కొండమీద నిషేధించి, ఈ బస్సుల ద్వారా కొండమీద ఎక్కడకు వెళ్లాలన్నా దేవస్థానం ఉచితంగా చేసిన ఏర్పాటు - ఆ బస్సుల సంఖ్య ఇప్పుడు పెరిగింది. వాటిని ఇంకా పెంచి, కొండమీద ఇతర వాహనాలు తిరిగే అవకాశం లేకుండా, ఎవరు ఎక్కడకు ప్రయాణం చేయాలన్నా ఈ ఉచితబస్సులే వాడే ఏర్పాటు చేయాల్సిన అవసరం కన్పిస్తోంది. వాహనకాలుష్యం తగ్గించవచ్చు. రోడ్డునిండా ఉన్న యాత్రికులకు ప్రమాదాలు కలగకుండా ఇబ్బంది లేకుండా చేయవచ్చు. శబ్దకాలుష్యం తగ్గించి యాత్రికులు ప్రశాంతంగా భగవంతుణ్ణి ధ్యానం చేసే ఏర్పాటు చేయవచ్చు.

తిరుమల వస్తూనే యాత్రికునికి ఒక ఆధ్యాత్మిక స్థలానికి వచ్చామన్న భావన కల్గించాలి. ఇతర పట్టణాలకు, ఇక్కడికీ ఏ విషయంలోనూ తేడా లేకపోతే యాత్రికునికి మనశ్శాంతి ఎక్కడ?! దివ్యక్షేత్రానికి వచ్చామన్న భావన ఎక్కడ?!

## 89. వేదాలు బ్రాహ్మణుల కోసమా? సమాజం కోసమా?


పద్మవిభూషణుడు శ్రీ ఉప్పులూరి గణపతిశాస్త్రి చాలా ప్రసిద్ధి చెందిన వేద పండితుడు. నేను తిరుమల తిరుపతి దేవస్థానాల కార్యనిర్వహణాధికారిగా ఉన్నప్పుడే ఆయనను దేవస్థానాల ఆస్థాన పండితుడుగా నియమించడం జరిగింది. అప్పటికే ఆయనకు దాదాపు 94 సంవత్సరాల వయసు.

(సశేషం)

అరణ్య
కాండ



'ఆంధ్ర వాల్మీకి'
**వాసుదాసస్వామి**
(వావిలికొలను సుబ్బారావు)
**విరచిత**
# 'మందర-మకరందం'




## సర్గ-9
(గత సంచిక తరువాయి)

"ఏ దేశంలో మనం వుంటామో, ఆ దేశాల ధర్మం ప్రకారమే మనం నడచుకోవాలి. కాబట్టి ముని మార్గంలో వున్న నువ్వు మునుల పనైన అహింసను అవలంబించడం సరైన కార్యం కదా? శస్త్రాన్ని ధరించడమే జరగుతే, దాన్ని ఉపయోగించాలన్న పాపపు బుద్ధి పుట్టుంది. కాబట్టి నువ్వు అడవుల్లో వున్నన్నాళ్లు శస్త్రం ధరించవద్దు.నాకులోచిత ధర్మాన్ననుసరించి శస్త్రాన్ని ధరించాలనుకుంటే, అయోధ్యకు నువ్వు మరలిపోయిన తరువాత, మళ్లీ గృహస్థ ధర్మంలో వున్నప్పుడు, ధర్మ సంరక్షణార్థం శస్త్రాన్ని ధరించవచ్చు. అనుభవించాల్సిన ఐశ్వర్యం, పాలించాల్సిన భూమి, వదలిపెట్టి, మునిలాగా అడవుల్లోకి వచ్చిన నువ్వు, మునిలాగానే తపస్సు చేస్తే, రాముడు యదార్థ వాది-నాతో చెప్పినట్లే చేస్తున్నాడని కైక సంతోషిస్తుంది. నా కొడుకు ఎక్కువ శ్రమపడకుండా సుఖంగా వున్నాడని కౌసల్య సంతోషిస్తుంది. వీరేకాకుండా స్వర్గంలో వున్న నా మామగారు కూడా తనకొడుకు తనను సత్యవాదిని చేస్తున్నాడని సంతోషిస్తారు. కాబట్టి అలాగే చేయి. ధర్మంతో ధనం లభిస్తుంది. ధర్మం వల్ల సుఖం కలుగుతుంది. ధర్మంతో చేసే సత్కర్మలు మంచి ఫలితాలను ఇస్తాయి. ధర్మహీనుడు చేసే సత్కర్మలు ఫలించవు. కాబట్టి, శర్మకరా ప్రపంచం ధర్మమే సారంగా కలది. ధర్మం చెడితే జగమంతా చెడుతుంది. రామచంద్రా! ఈ ఋషీశ్వరుల వెంట హాయిగా నువ్వు ఈ ఆశ్రమానికి, ఆ ఆశ్రమానికీ తిరుగుతుంటే సుఖం లేదు. పరలోకంలో సుఖం కావాలనుకునేవారు కఠిన వ్రతాలను, నియమనిష్ఠలను అనుసరించాలి. మనస్సు జయిస్తే లోకోత్తరమైన ధర్మ ఫలం లభిస్తుంది. కాబట్టి దానికొరకు కృషి చేయి. నీ సౌజన్యం, సాధుత్వం, లోకమంతా గౌరవిస్తాయి. మనస్సు నచ్చిన ప్రకారం నడచుకోకుండా, నిష్కల్మషమైన బుద్ధితో కార్యం సాధించగలవాడివి. ఇలాంటి నీకు మూడులోకాలలో తెలియందేదీ లేదు. ప్రాణేశ్వరా! నీకు నీతులు చెప్పేటంత దాన్ని కాదు. నువ్వు అడవుల్లో తిరిగినంత కాలం హింసా వ్యాపారం లేకుండా వుండకూడదా? ఇదే నేను కోరేది. నువ్వు సజ్జన వందితుడవు. హింసారతుడవైతే సజ్జనులు మెచ్చరేమో? రాముడు క్రూరుడు అంటారేమోనని విచారిస్తున్నాను. స్త్రీలకు స్థిర బుద్ధి లేదు. ఇతమిత్థమని నిశ్చయించలేరు. కాబట్టి నాకు స్వభావ సిద్ధమైన బుద్ధి చపలత వల్ల తోచింది చెప్పా. నీకు ధర్మం చెప్పగల సమర్థులెవరు? కాబట్టి, నువ్వు, నీ తమ్ముడు ఆలోచించి ఏది మేలని తోస్తే అదే చేయండి".



అనువక్త-వాచవి
వనం జ్వాలా నరసింహారావు

## సర్గ-10
### ఆర్తరక్షణ పరమ ధర్మమని సీతకు చెప్పిన శ్రీరాముడు

రాముడు ఆడినమాట తప్పేవాడు కాదు. కాబట్టి రాక్షసవధ

చేయకుండా వుండడు. అలా అని నిష్కారణంగా వాళ్లను చంపడు. రాక్షసులేమో దుష్టులు.... ఊరకే వుండేవారు కాదు. రాముడి ధనస్సు చూసి తమకు కీడు కలుగుతుందని భయపడి, వారే ఏదైనా కీడు చేయడానికి ప్రయత్నం చేస్తారు. రాముడు వూరకున్నా వాళ్లు వుండరు. అందుకే రాక్షస వధ మానని సీతకు ప్రత్యుత్తరం ఇస్తున్నాడు. పతివ్రత అయిన సీతాదేవి కేవలం తన మీద ప్రేమతో, తన క్షేమం కోరి, చెప్పిన మాటలను విని, ఆమె అభిప్రాయం గ్రహించి, సీతాదేవి చెప్పిన అర్థ-కామ సుఖాల మీద కోరికలేక, ధర్మమే పరమార్థం అని, దానిమీదే మనసున్న వాడైన శ్రీరామచంద్రమూర్తి సీతతో ఇలా అన్నాడు:

"దేవీ! నువ్వు నన్ను క్షత్రియులకు "సార్తిప్రజరక్షారంభ మునకు గార్ముక ధారమగు" నని అంగీకరించావు కదా? ఇప్పుడు దండకలో వున్న మహానుభావులు గొప్ప మనస్సు కలవారు. ఆ కారణాన ఇతరులను బాధించరు. అందుకొరకై ఇతరులను ప్రేరేపించరు. అలాంటి అహింసాపరులైన ఋషులు రాక్షసులకు భయపడి వారంతట వారే, నా ప్రయత్నం లేకుండా, కడు దుఃఖంతో నాదగ్గరకు వచ్చి, నేనే దిక్కని శరణుజొచ్చారు. ఇలా నేనే దిక్కని నమ్మిన ఆ ఆశ్రితులను ఎలాగైనా పాడైపొమ్మని తిరస్కరించడం ధర్మమా? నువ్వే చెప్పు. హింస నిషేధం అని నువ్వన్నావు. అది నేను అంగీకరిస్తా. హింస అంటే ఎలాంటిది? నిరపరాధులైన సాధువులను హింసించడాన్ని హింస అంటారు కాని అసాధువులను హింసించడాన్ని హింస అనరు కదా? రాక్షస వధమీద నాకున్న ఉద్దేశం ఏంటి? అదేమన్నా వినోద క్రీడా నాకు? వాళ్లను నేను, కామంతో కాని, క్రోధంతో కాని, లోభంతో కాని, మదమాత్సర్యాలతో కాని, మోహంతో కాని చంపాలనుకోవడం లేదు కదా? సాధువుల మేలుకొరకై చేసే పనిలో దోషముందా? దేవీ ఈ మునులు అడవుల్లో, అక్కడొక కాయ, ఇక్కడొక కూర తెచ్చుకుని దాంతోనే కడుపు నింపుకుని దేహయాత్ర చేస్తారు. ఇక రాక్షసులంటావా... మృగాలనే కాకుండా మనుష్యులను కూడా పీక్కుని తిని భోగాలనుభవిస్తారు. మునులు ధర్మపద్ధతిన నడుస్తే, వారు దయాదాక్షిణ్యాలు లేకుండా క్రూరపద్ధతిన నడుస్తారు. మునులు ఎల్లప్పుడూ వ్రతాలు ఆచరిస్తున్నందువల్ల ఇతర కార్యాలంటే ఆసక్తిలేని వారు... ఇక రాక్షసులు శిశ్నోదరపరాయణులై ఇతరులను బాధించడమే వ్రతంగా వున్నవాళ్లు. ఇలాంటి నిష్కారణ హింసాపరాయణులైన రాక్షసులను వధించి శిష్ట రక్షణ చేయడం అధర్మమా చెప్పు?"

"దండకారణ్యంలో నివసిస్తున్న మునీశ్వరుల సమూహాలు మా ఇద్దరి దగ్గరకు వచ్చి, అనేకవిధాలుగా తాము పడుతున్న దుఃఖాలను చెప్పి, తమను రక్షించాలని ప్రార్థించారు. అప్పుడు



నేను, వారి పాదాలకు నమస్కారం చేసి, మునులు తన్ను చూడడానికి ముందే, వారిని చూడడానికి తాను పోనందుకు సిగ్గుపడుతున్నానని, తాను చెసిన అపరాధానికి దయతో క్షమించమని అన్నాను. వారి కోరికలేంటనీ, వారికి తాను చేయాల్సిన సహాయం ఏంటో చెప్పమని అడిగాను. అప్పుడు, దేవీ, ఏకవాక్యంగా వారంతా ఒక్కటే చెప్పారు. దండకలో వున్న రాక్షసులు తమపై పగ బూని, తాము హోమం చేస్తున్న సమయంలో తమను బాధపెట్టున్నారని, ఆ బాధ పడలేక తమకు రక్షకుడు ఎవరు వస్తారో అని విచారపడ్తుండగా, తమ పుణ్య ఫలం వల్ల నేను దొరికానని అన్నారు. తపస్సు చేయడం సులువు కాదనీ, అది మిక్కిలి కష్టకార్యమనీ, అంత కష్టపడి చేద్దామంటే మధ్య-మధ్యలో విఘ్నాలు కలుగుతున్నాయనీ, తమ తపశ్శక్తి పోగొట్టుకోదల్చుకోలేక వారిని శపించడం లేదనీ, ఎంతమందిని అలా శపించగలమనీ, ఒక వేళ శపించినా తమకింక ఏ శక్తి మిగుల్తుందనీ, జీవించినా వ్యర్థమే కదా అనీ, వాళ్లన్నారు".

వాళ్లింకా ఇలా చెప్పారు: "నిర్మలమైన కీర్తికలవాడా! మా స్థితిగతులను ఆలోచించు. రాక్షసులు చేసే పనులు ఆపుచేయించు. మా తపస్సులు సాగేట్లు చేయి. మామీద దయచూపి మమ్మల్ని రక్షించు. నువ్వు, నీ తమ్ముడే మాకిక్కడ దిక్కు. వేరే రక్షించేవారెవరూ లేరు. మీరు తప్ప మరేరాజులైనా వీరి బారినుండి మమ్మల్ని కాపాడలేరు. పూబోణీ! వాళ్లిలా చెప్పగా వారిని కాపాడాలని ప్రతిజ్ఞ చేశాను. వట్టి మాటలు చెప్పి కన్నీళ్లు తుడిచి పంపలేదు. నాకు సత్యం అన్నింటికంటే ముఖ్యం కాబట్టి ప్రాణాలున్నంతవరకు చెప్పినమాట తప్పను. నువ్వే దిక్కని నన్ను ఆశ్రయించి, ఎప్పుడుకూడా ఇతరులకు హాని కలిగించే వాటి జోలికి పోకుండా, దిక్కులేనివారిగా వున్న మునులను, రాక్షసులు పనిగట్టుకుని వధించారు. నువ్వు నిర్మలమైన మనసున్నదానివి కదా? ఇంతకంటే విరోధమైన పని ఏమన్నా వుందా చెప్పు? (సశేషం)

# అపూర్వమయిన "కోదండ జలతరంగిణీ" నినాదాలు


భారతీయ సనాతన సంస్కృతిలో జలానికి భౌతికమైన ప్రాధాన్యతతో పాటు పరమ ఆధ్యాత్మిక, వైజ్ఞానిక ప్రాశస్త్యం ఉంది. ప్రాచీన వైదిక గ్రంథాలలో నిక్షిప్తమై ఉన్న ఈ జల విజ్ఞానాన్ని సేకరించి, సమాజ హితవుకై సమన్వయపరిచిన అద్భుతమైన పరిశోధనాత్మక గ్రంథం జలవిజ్ఞాన తరంగిణి. ఖమ్మం నివాసి అయిన ప్రసిద్ధ విద్వాంసులు డాక్టర్ కె. కోదండరామాచార్య గారు రచించిన ఈ గ్రంథం దిల్లీ సంస్కృత అకాడమీ ద్వారా 2003 జనవరి మాసంలో పురస్కారం పొందింది.ఈ మధ్య కాలంలో తెలుగు వారు సంస్కృత గ్రంథాలను తెలుగు లిపిలో అధికంగా ప్రచురిస్తున్న నేపథ్యంలో సంస్కృత భాషలో రచింపబడిన ఈ గ్రంథం దేవనాగరి లిపిలో ముద్రితమైంది. ఇది గమనార్హం.

పుస్తకం పేరు తరంగిణి (తరంగాః వీచయః సంతి అత్ర అలలు కలిగినది. నది.) కనుక ఇందులోని విభాగాలకు రచయిత తరంగాలు అని పెట్టారు. ఈ గ్రంథంలో పద్నాలుగు తరంగాలు మరియు సస్యానందమనే అమూల్యమైన కావ్య పరిచయంతో కూడిన ఒక అనుబంధం ఉన్నాయి.

ఈ తరంగాలను సంక్షిప్తంగా పరిచయం చేసుకొని, రచయిత గొప్పతనాన్ని ఆవిష్కరించుకొందాం.

### మొదటి తరంగము

ప్రకృతి స్వరూపం, నీటికి గల పర్యాయపదాలు, వైదిక మంత్రాల ప్రస్తావన మరియు సప్తద్వీపాలు, సప్తసముద్రాల గురించిన విషయాలు ఇందులో వివరించ బడ్డాయి.




సృష్టి ఆవిర్భావానికి పూర్వం కేవలం నీరు మాత్రమే ఏ విధంగా ఉనికిలో ఉండేదో వేదాల ఆధారంగా ఈ గ్రంథం మొదటి అధ్యాయంలో నిరూపించింది. సృష్టి ప్రారంభ దశలో ఉన్నది (సత్తు), లేనిది (అసత్తు), వాయువు, ఆకాశం వంటి పంచభూతాలు ఏవీ లేవని, అన్నింటికంటే ప్రప్రథమంగా జలము మాత్రమే వ్యాపించి ఉందని కృష్ణ యజుర్వేదంలోని మంత్రాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ విశ్వమంతా జలమయమై ఉన్నప్పుడు, సృష్టికర్త అయిన ప్రజాపతి వాయు రూపాన్ని ధరించి ఆ నీటిపై సంచరించాడని, నీటి అడుగున ఉన్న భూమిని చూసి వరాహ రూపంలో దానిని పైకి ఉద్ధరించాడని వేద వచనం చెబుతోంది. ఇదే విషయాన్ని అథర్వవేదం కూడా సమర్థిస్తూ, సృష్టికి పూర్వం కేవలం అపారమైన జలరాశి మాత్రమే ప్రాథమిక ఉనికిగా ఉండేదని ధ్రువీకరిస్తోంది. ఈ వైదిక ఆధారాలు ప్రాచీన భారతీయుల విశ్వోత్పత్తి సిద్ధాంతానికి మరియు భూగర్భ జలాల పుట్టుకకు సంబంధించిన అవగాహనకు మూలస్తంభాలుగా నిలుస్తున్నాయి. కృష్ణ యజుర్వేదం, అథర్వవేదం మొదలైన వాటిలో రచయిత పట్టును ఈ ప్రథమ తరంగం నిరూపిస్తుంది.

### రెండవ తరంగము


ఆకాశం, భూమి, మేఘం (పర్జన్యుడు), వాయువు (మరుత్తు), సూర్యుడు, వరుణుడు మొదలైన జలదాతల గురించిన వర్ణన ఈ రెండవతరంగంలో ఉంది. అలాగే, మహాభాగుడైన వరాహమిహిరుడు తన "బృహత్సంహిత"లోని 62వ అధ్యాయంలో పేర్కొన్న భూగర్భ జలాల అన్వేషణకు సంబంధించిన విషయాలు ఇందులో ఉదహరించబడ్డాయి.

ప్రకృతిలో వర్షాన్ని ప్రసాదించే శక్తులుగా ఆకాశం, భూమి, మేఘుడైన పర్జన్యుడు, వాయువుగా పిలవబడే మరుత్తు, సూర్యుడు మరియు వరుణుడు వంటి జలదాతలను మన పూర్వీకులు ఆరాధించారు. కేవలం ఉపరితల వర్షపాతంపైనే కాకుండా, భూమి లోపల దాగి ఉన్న భూగర్భ జలాలను కనిపెట్టడంలో కూడా వారు అద్భుతమైన విజ్ఞానాన్ని సాధించారు. వరాహమిహిరుడు తన బృహత్సంహితలోని అరవై రెండవ అధ్యాయంలో భూగర్భ జలాల అన్వేషణకు సంబంధించిన అత్యంత సూక్ష్మమైన పరిశీలనలను పొందుపరిచారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం లేని ఆ కాలంలో, కేవలం చుట్టుపక్కల తిరిగే ప్రాణులు, వృక్షాలు మరియు నేలలోని మట్టి స్వభావాన్ని బట్టి నీటి జాడలను నిశ్చయంగా కనుగొనేవారు.

భూగర్భ జలాలు ఉన్న చోట సంచరించే ప్రాణుల రకాలను వరాహమిహిరుడు వర్గీకరించారు. బంగారు రంగు కలిగిన

కనకనిభ మండూకాలు, పాలిపోయిన రంగులో ఉండే పాండురవర్ణ మండూకాలు నీటి లభ్యతను సూచిస్తాయి. చేపల విషయానికి వస్తే, రోహు అనబడే ఎర్రటి చేపలు లేదా మేక వాసన వచ్చే ఒక రకమైన అజగంధి చేపల సంచారం ద్వారా భూగర్భంలో నీరు ప్రవహిస్తోందని గుర్తించవచ్చు. పాముల రకాలలో తెల్లని పాము, నల్లత్రాచు, మచ్చలు లేదా చారలు గల పాములు, నలుపు-తెలుపుల కలయిక గల పాములు మరియు రెండు తలల పాములు నివసించే చోట జలవనరులు ఖాయంగా ఉంటాయని నిర్ధారించారు. అలాగే తెల్లని మరియు గోధుమ రంగులో ఉండే ఉడుములు, గోడలపై తిరిగే బల్లులు (గృహమేధికా), తెల్లని ఎలుకలు, తెల్ల తామర పువ్వు రంగులో ఉండే ఎలుకలు, ముంగిసలు, తాబేళ్లు మరియు తేళ్లు తిరిగే ప్రాంతాలను బట్టి కూడా భూగర్భ జలాల ఉనికిని అంచనా వేసేవారు.

మరొక ముఖ్యమైన పద్ధతి ఏమిటంటే, భూమిని తవ్వినప్పుడు లభించే మట్టి రంగులు మరియు వాటి వాసనలను బట్టి నీటి ఉనికిని గ్రహించడం. పావురం రంగు, కాటుక రంగు, తెలుపు రంగు, కుంకుమ రంగు, దోర ఎరుపు, కప్ప ముఖాన్ని పోలిన రంగు, ఉలవల రంగు, పొగ రంగు, మరకత పచ్చ రంగు, పిండి రంగు మరియు రాగి రంగులో ఉండే మృత్తికలు భూగర్భంలోని వివిధ జల పొరలను సూచిస్తాయి. వీటికి తోడు పసుపు పచ్చని మట్టి, ఇనుము వాసన వచ్చే మట్టి, నల్లటి లేదా నీలి మట్టి, బూడిద రంగు మట్టి మరియు నల్ల కలువ పువ్వు రంగులో ఉండే మట్టి కూడా భూగర్భంలో జల ప్రవాహాలు ఉన్న ప్రాంతాలకు సంకేతాలుగా నిలుస్తాయి. వరాహమిహిరుడు ప్రతిపాదించిన ఈ అంశాలు నాటి సమాజానికి గల అద్భుతమైన ప్రకృతి పరిశీలనా శక్తిని మరియు శాస్త్ర పరిజ్ఞానాన్ని రుజువు చేస్తున్నాయి. కోదండ రామాచార్యుల వారి సునిశిత పరిశీలనాశక్తిని ఈ అధ్యాయం చదివిన తరువాత ప్రశంసించ కుండా ఉండలేము.



### మూడవ తరంగము

సాగరాలు, మానససరోవరం వంటి సరస్సులు, మరియు హిమాలయాలు, పారియాత్రం, వింధ్య పర్వతాల నుండి ఉద్భవించిన గంగ, యమున, నర్మద, కావేరి మొదలైన నదుల వర్ణన ఈ తరంగంలో చేయబడింది.

భారతదేశ నదీ పర్యావరణ వ్యవస్థలో సాగరాలు, మానస సరోవరం వంటి దివ్య సరస్సులు మరియు హిమాలయాలు, పారియాత్రం, వింధ్య పర్వతాల నుండి ఉద్భవించిన గంగ, యమున, నర్మద, కావేరి వంటి జీవనదులు మానవాళికి ఆధ్యాత్మిక చైతన్యాన్ని ప్రసాదిస్తున్నాయి. వీటికి తోడు ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన తిరుమల, భద్రాచలం మరియు చారిత్రక నగరమైన మొహెంజొదారో లోని జలాశయాల నిర్మాణం భారతీయ సంస్కృతికి మకుటాయమానంగా నిలిచింది.

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుమల క్షేత్రంలో వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి సన్నిధిలోని వరాహ పుష్కరిణి (స్వామి పుష్కరిణి) స్వచ్ఛమైన మరియు పవిత్రమైన నీటికి నిలయం. 'శ్రీ వేంకటాచల మాహాత్మ్యం' ప్రకారం, ముకుందానంద అనే పరమ భక్తుడు ఈ పవిత్ర పుష్కరిణిని దర్శించి ధన్యుడయ్యాడు. భద్రాద్రి రాముని సన్నిధి అయిన భద్రాచలం సమీపంలోని పర్ణశాల వద్ద గల కుండాల గ్రామంలో గోదావరి తీరాన ఉన్న "ఉష్ణకుండమ్" (వేడి నీటి బుగ్గ) మరొక ప్రాకృతిక అద్భుతం. చారిత్రక కోణంలో పరిశీలిస్తే, మొహెంజొదారో లో కనుగొనబడిన మహా జలాశయం (The Great Bath) నాటి సివిల్ ఇంజనీరింగ్ నైపుణ్యానికి, నీరు నిలిచేలా చేసిన ప్రాచీన జల నిరోధక సాంకేతికతకు అత్యుత్తమ నిదర్శనంగా నిలిచింది.

ఈ జలవనరులు ఏర్పడిన విధానాన్ని బట్టి వాటిని వేర్వేరు రకాలుగా వర్గీకరించవచ్చు. సముద్రాలు అనేవి ప్రకృతి సిద్ధంగా ఏర్పడే సహజ జలాశయాలు కాగా, సరోవరాలు దైవసంకల్పంతో ఏర్పడిన దివ్య జలాశయాలు. పర్వతాల నుండి ప్రవహించే ప్రవాహాలు నదులు కాగా, క్షేత్ర దేవతల అనుగ్రహం వల్ల పుష్కరిణులు ఆవిర్భవించాయి. బావులు, చెరువులు (వాపీ, కూప, తటాకాలు) మానవులు తమ నిత్యావసరాల కోసం నిర్మించుకున్న మానవ నిర్మిత జలాశయాలు. ఈ జలాశయాలను పవిత్రంగా ఉంచడంలో ప్రకృతి శక్తితో పాటు మానవ ప్రయత్నం తోడైనప్పుడే భూమిపై సమస్త జీవకోటి ఆరోగ్యంగా మనుగడ సాగించగలుగుతుంది

### నాల్గవ తరంగము

వాల్మీకి, వ్యాసుడు, కాళిదాసు, జగన్నాథ పండితరాయలు, విశ్వనాథ సత్యనారాయణ, శ్రీభాష్యం విజయసారథి మొదలైన కవుల రచనలలో నీటి పట్ల వారి భావనలు ఏ విధంగా ఉన్నాయో ఈ తరంగంలోనిరూపించబడింది.

సాహిత్యంలో కాలచక్ర భ్రమణాన్ని అనుసరించి వర్షాకాలం రావడం సహజ ప్రక్రియ అయినా, ఉత్తమ కవులు తమ భావనా

శక్తితో ఆ సాధారణ ప్రకృతి సిద్ధ మార్పులను నూతనత్వంతో అభివర్ణించారు. వాల్మీకి మహర్షి రామాయణంలోని కిష్కింధా కాండలో చేసిన వర్షర్తు వర్ణన ఇందుకు పరాకాష్ట. ఆకాశం సూర్యకిరణాల ద్వారా సముద్రపు నీటిని తాగి, తొమ్మిది నెలల పాటు గర్భంలో మోసి, ఆ తర్వాత అమృతం వంటి పవిత్ర జలాన్ని ప్రసవిస్తోందని వాల్మీకి వర్ణించారు. ఇది సూర్యుడు గ్రహించిన కిరణాల ద్వారానే మేఘాలు కురుస్తాయనే వైదిక సత్యాన్ని చాటుతోంది.

అలాగే గ్రీష్మ తాపానికి అలసిపోయిన భూదేవి తొలి వర్షపు బిందువులు పడగానే వేడి ఆవిరులను (బాష్పము) వదలడాన్ని, దుఃఖంతో తపిస్తూ కన్నీరు మున్నీరవుతున్న సీతాదేవి శోకంతో పోల్చడం కవి హృదయ సంస్కారానికి నిదర్శనం. నానార్థరత్నమాల ప్రకారం 'బాష్ప' అనే పదానికి కన్నీరు మరియు వేడి ఆవిరి అనే రెండు అర్థాలు ఉండగా, భూమి పరంగా అది తొలి వాన ఆవిరిని, సీతమ్మ పరంగా అది దుఃఖ కన్నీటిని సూచిస్తూ కథా గమనానికి ప్రాణం పోసింది

ఇలా రామాయణాది కావ్యాలను రచయిత పరిశీలించిన తీరు అద్భుతం.

**ఐదవ తరంగము**

జన్మస్థానాన్ని బట్టి, ప్రవాహ స్థితిని బట్టి లోకంలో నీరు ఎన్ని రకాలుగా వర్గీకరించబడిందో ఈ తరంగంలో రచయిత చక్కగా చెప్పారు. ఈ ఐదవ తరంగం జలానికి సంబంధించిన రెండు ముఖ్యమైన విషయాలను వివరిస్తోంది: ఒకటి జల వర్ణ హేతువులు (నీటి రంగు మారడానికి గల కారణాలు), రెండు పానీయ తోయ లక్షణాలు (త్రాగడానికి యోగ్యమైన నీటి గుణాలు).

నైయాయికుల (తార్కికుల) ప్రకారం స్వచ్ఛమైన నీటి యొక్క సహజ వర్ణం ప్రకాశం లేని తెలుపు (అభాస్వర శుక్ల వర్ణము). అందుకే గంగా నది నీరు తెల్లగా ప్రకాశిస్తుంది. అయినప్పటికీ నీటికి స్వతహాగా ఒకే రంగు ఉన్నట్లు అనిపించినా, అది ప్రవహించే చోటు, కాంతి ప్రసరణ మరియు ఖనిజాల కలయిక వల్ల రంగులు మారుతుంది. యమునా జలం నీల వర్ణంలోనూ, కావిరాయి వంటి ఖనిజాలు కలిసిన జలం అరుణ వర్ణంలోనూ కనిపిస్తాయి.

త్రాగడానికి ఏది అత్యుత్తమమైన నీరో చరక, సుశ్రుత సంహితలలో చాలా స్పష్టంగా వివరించబడింది. సుశ్రుతుని ప్రకారం ఉత్తమమైన త్రాగునీరు స్పష్టంగా ఫలానా రుచి అని చెప్పడానికి వీలులేని సహజ సిద్ధమైన రుచి (అనిర్దేశ్య రసమ్) కలిగి ఉండాలి. అది అమృతం వలె ప్రాణకోటికి జీవనాధారమై, మనస్సుకు తృప్తిని ఇస్తూ శరీరాన్ని పోషించాలి. అలసటను, దప్పికను తీర్చి, మత్తు, బద్ధకం, మితిమీరిన నిద్రను దూరం చేస్తూ, శరీరంలోని అంతర్గత తాపాన్ని శాంతింపజేసే గుణాలు కలిగిన జలమే అన్ని వేళలా అందరికీ మేలు చేసే పథ్యకరమైన ఏకైక పదార్థం. ఉత్తమ జలానికి రచయిత ఇచ్చిన నిర్వచనం సాటిలేనిది.

**ఆరవ తరంగము**

వేద మంత్రాలలో, అరుణ పాఠంలో మరియు ఉదకశాంతి (జల సంప్రోక్షణ విధ్య) లోని జల విశేషాలు ఈ ఆరవ తరంగంలోవివరించబడ్డాయి.

ఈ ఆరవ తరంగం (షష్ఠః తరంగః - అరుణపాఠమ్) వేదభాగమైన తైత్తిరీయారణ్యకంలోని 'అరుణప్రశ్న' (అరుణపాఠం) ఆధారంగా జలం యొక్క దివ్యత్వాన్ని, చంద్రునికి జలానికి గల అవినాభావ సంబంధాన్ని బ్రహ్మాండపురాణ సాక్ష్యంతో అద్భుతంగా వివరిస్తోంది.

వేదభాగమైన తైత్తిరీయారణ్యకంలోని 'అరుణప్రశ్న' (అరుణపాఠం) జలాన్ని దేవతా స్వరూపంగా భావించి ప్రార్థిస్తుంది. వాయువే వాహనంగా, సూర్యకిరణాలే పాలకులుగా కలిగి, పరోపకారమే లక్షణంగా ప్రవహించే జలదేవతలు మనకు మంచి సంతానాన్ని, మనోభీష్టాలను నెరవేరుస్తారని వేదం ప్రబోధిస్తోంది.

చంద్రునికి, జలానికి గల సంబంధం విడదీయరానిది. సముద్రం నుండి జన్మించి అమృత కళలు కలిగిన చంద్రుడిని "అపాం పుష్పమ్" (నీటి యొక్క పువ్వు) అని పిలుస్తారు. చంద్రుడు జలానికి ఆశ్రయమైతే, జలమే చంద్రునికి నివాస స్థానమని పురాణాలు ఘోషిస్తున్నాయి. బ్రహ్మాండ పురాణం ప్రకారం ఆకాశంలో ప్రకాశించే చంద్ర మండలం ఘనతోయాత్మకమైన రూపమైతే (దట్టమైన జల సమూహం), సూర్య మండలం ఘనతేజోమయమైన రూపం (దట్టమైన తేజోసమూహం). సృష్టి పరిణామ క్రమంలో అగ్ని నుండి జలం, జలం నుండి అగ్ని పరస్పరం ఉద్భవించే ప్రక్రియ నిరంతరం సాగుతూనే ఉంటుంది. ఇలా జల విశేషాలను కాచి వడ పోసారు రచయిత ఈ తరంగంలో.

(మిగతా వచ్చే సంచికలో)

**జలవిజ్ఞాన తరంగిణి**

**డా. కె. కోదండ రామాచార్యులు**

పేజీలు : 236

రచయిత పేర, ఇంటి నెం. 1-10-814,

రాపర్తి నగర్, ఖమ్మం - 507 001, ఫోన్: 9849392474

**- ఆచార్య తాడేపల్లి పతంజలి**

# మీరు మంచి తల్లిదండ్రులేనా?

తల్లి తండ్రులు తమ పిల్లల్ని గాఢంగా ప్రేమించడం సహజం. వాళ్ల ప్రతి కదలికనీ వెయ్యి కళ్లతో గమనించడం అంతే సహజం. పిల్లల ఆటపాటల్ని చూసి సంతోషిస్తుంటారు. తమ పిల్లల మీద ఎన్నో ఆశలు, అంచనాలు పెట్టుకుంటారు. వాళ్లు చక్కగా చదివి మెరుగైన ఫలితాలు సాధించాలని, క్రమశిక్షణతో ఎదగాలని కోరుకుంటారు. వాళ్లనుకున్న దానిలో తేడా వస్తే మాత్రం అసలు తట్టుకోలేరు. అల్లారు ముద్దుగా పెంచు కుంటున్న తమ పిల్లల మీద కేకలు వేస్తారు . లేదా కోపంతో దండిస్తారు ఒక్కోసారి. పెద్దవాళ్లు తమ ఇష్టానికి పెద్ద అంచనాలు పెట్టుకోవడంలో తప్పు ఉందని అనలేం. కానీ ఆ అంచనాలు మరీ అందుకోలేనంత ఎత్తులో ఉండడమే ప్రమాదం.

క్లాసులో ఫస్ట్ రాంక్ తెచ్చుకోవడం ప్రతి ఒక్క పిల్లవాడికీ సాధ్యమౌతుందా? ఒక తరగతికి ఉండేది ఒక్క ఫస్ట్ రాంక్ కదా. మరలాంటప్పుడు తరగతి పిల్లల్లో ఒక్కరికే వస్తుంది కానీ అందరికీ రాదు కదా. ఒకరికే ఫస్ట్ ర్యాంక్ వచ్చినప్పుడు మిగతా పిల్లలకు వచ్చేవి తరువాత ర్యాంకులే కదా . ఆ మాత్రం తెలివితో ఆలోచించకపోవడం తల్లిదండ్రుల తప్పు అవుతుంది కానీ ఫస్టు రాంక్ తెచ్చుకోకపోతే అది పిల్లల తప్పెలా అవుతుంది?.

'పసి పిల్లలు అప్పుడే విరిసిన మొగ్గల్లాంటి వారు , వాళ్లను జాగ్రత్తగా ఎదగనివ్వాలి' అని భారత ప్రథమ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ గారన్నట్టు పిల్లలందరూ అభం శుభం తెలియని వాళ్ళు. వాళ్లింకా నేర్చుకునే దశలోనే ఉన్నారని పెద్దలు గుర్తు పెట్టుకోవాలి. పెద్దోళ్లు చెప్పింది చెయ్యడానికి ప్రయత్నిస్తూ, తప్పులు చేస్తూ, మళ్ళీ ప్రయత్నిస్తూ నేర్చుకుంటారు. పరిణతి సాధించడానికి ప్రయత్నిస్తారు. ఏ బిడ్డా పుట్టుకతోనే పరిపూర్ణుడు కాదు కదా. వాళ్ల నుంచి మరీ ఎక్కువ ఆశించడం పెద్దల పొరపాటే అవుతుంది.

తల్లిదండ్రుల అంచనాలు మరీ ఎక్కువైనప్పుడు వాళ్ల పిల్లలు తప్పులు చేయడానికి కూడ భయపడతారు. 'చెప్పినట్టు చెయ్యకపోతే అమ్మానాన్నలు సంతోషంగా ఉండరేమో ' అనుకుంటారు. అందువల్ల వారి చదువు ఆనందంగా ఉండడానికి బదులు బలవంతపు ఒత్తిడితో సాగుతుంది. మరికొందరు పిల్లలైతే మౌనంగా ఉండిపోవడం, తమకి వస్తున్న కోపాన్ని చూపలేకపోవడం, లోలోపల అలసిపోవడం లాంటివి చేస్తారు. అది పిల్లల ఎదుగుదలకి మరీ మంచిది కాదు.

పిల్లలంతా ఒకేలా ఉండరు. వారి గ్రహణ శక్తిలో కూడ



తేడాలుంటాయి. కొందరు పిల్లలు వేగంగా గ్రహిస్తుంటే, మరి కొందరు నెమ్మదిగా నేర్చుకుంటారు. కొందరికేమో చదువు మీద ఆసక్తి ఉంటే, ఇంకొందరికి కళల మీద ప్రేమ, ఇష్టం ఉంటుంది, ఇంకొందరికి క్రీడల మీద మోజు ఉండొచ్చు. వాళ్ల ఆసక్తులను బట్టి ఆయా రంగాల్లో రాణిస్తారు. తప్ప అందరినీ ఒకేలా చూడడం తప్పు. అందుకే తమ పిల్లల ఈడున్న పొరుగు పిల్లలతో పోలుస్తూ ఎందుకూ పనికి రానివారని కించపరచ కూడదు. పసివారి లేత మనసు గాయపడుతుంది. అలా చేసి పిల్లల్ని బాధపెట్టే బదులు వాళ్లకు ఎందులో ఆసక్తి ఉందో, వాళ్ల ప్రత్యేకత ఏమిటో తెలుసుకుని గుర్తించాలి . అందులో తీర్చిదిద్దే ప్రయత్నం చెయ్యాలి.

పిల్లల్ని ప్రేమగా దగ్గరకు తీసుకుని శాయశక్తులా ప్రయత్నించమని చెప్పాలి తప్ప అందరికంటే గొప్పగా ఉండ మని కాదు. మార్కుల గురించి ఆందోళన చెందవద్దని, బడిలో కొత్త విషయాలు నేర్చుకోమని చెప్పాలి. పిల్లల పట్ల ఓపికతో, సహనంతో ఉండాలి. ఆ క్షణంపై దృష్టి పెడుతూ పిల్లలు చెప్పేది ప్రశాంతంగా, శ్రద్ధగా వినాలి. తొందరపడి అరవడమో, కొట్టడమో చెయ్యకుండా ఆగి ఆలోచించాలి. చిన్నారి మనసులో ఏముందో, ఎందుకలా ప్రవర్తిస్తున్నాడో అర్థం చేసుకుని ఒత్తిడిని తగ్గిస్తూ మద్దతుగా నిలవాలి. అప్పుడే పిల్లలు ఆనందంతో, ఆత్మవిశ్వాసంతో పెరుగుతారు. తమని అమ్మానాన్నలు ప్రేమిస్తున్నారని , అర్థం చేసుకుంటున్నారని భావించినప్పుడు మరింత ఉత్తమంగా ఎదుగుతారు.

**- నారంశెట్టి ఉమామహేశ్వరరావు,**

కేంద్ర సాహిత్య అకాడమీ (బాల)పురస్కార గ్రహీత



# క్షయ సంవత్సరం బార్హస్పత్యమానం



(గత సంచిక తరువాయి)

2. సూర్య సిద్ధాంతం (మధ్యమాధికారం, శ్లోకం 55)లో గురు సంవత్సర గణన గురించి చెబుతూ: త్రేతాదౌ/ కల్యాదౌ'' కలేర్గతే2బ్దే...''అని మొదలుపెట్టి, వచ్చిన ఫలితాన్ని ''విజయా దయః''అంటే ''విజయ ఆదిగా'' లెక్కించాలి అని స్పష్టంగా చెప్పారు.

ఉదాహరణకు: ఒక గడియారంలో సెకన్ల ముళ్ళు కోసం 60 గీతలు ఉన్నాయి అనుకుందాం (ప్రభవ నుండి క్షయ వరకు). గడియారం ఎప్పుడో తయారైంది (సృష్టి). కానీ మనం ''కలియుగం'' అనే కొత్త పని మొదలుపెట్టినప్పుడు, ఆ గడియారం ముల్లు సరిగ్గా 27వ సంఖ్య (విజయ) దగ్గర ఉంది. కాబట్టి, అక్కడి నుండి మనం కాలాన్ని లెక్కించాలి. ''ప్రభవ'' అనేది జాబితాలో మొదటిది అయినప్పటికీ, ''విజయ'' అనేది మన లెక్కకు ఆరంభ స్థానం..

3. ప్రభవ ఎప్పుడు వస్తుంది? కలియుగం మొదలైనప్పుడు ''విజయ'' ఉంటే, మరి ''ప్రభవ'' ఎప్పుడు వచ్చింది? కలియుగం మొదలవడానికి 27 సంవత్సరాల ముందు (అంటే ద్వాపర యుగం చివరలో) ''ప్రభవ'' నామ సంవత్సరం వెళ్ళింది. కానీ సూర్య సిద్ధాంతంత్రేతాదిలేదా కలియుగాన్ని ''జీరో పాయింట్'' గా తీసుకుంది. కాబట్టి, ఆ సమయానికి ఉన్న విజయ నామ సంవత్సరమే సూత్రంలోకి వచ్చింది.

4. ప్రభవ: ఇది సృష్టి క్రమంలో బ్రహ్మగారు కల్పించిన 60 ఏళ్ల చక్రంలో మొదటి పేరు. (జాబితా పరంగా మొదటిది). విజయ: ఇది త్రేతాది. కలియుగ ఆరంభంమొదలైనప్పుడు ఉన్న వాస్తవ సంవత్సరం. (గణిత పరంగా మనకు మొదటిది). మనం సంకల్పంలో ''ప్రభవాది షష్టి సంవత్సరాణాం మధ్యే...'' అని చెప్పుకుంటాం. కానీ సిద్ధాంత గణితం చేసేటప్పుడు మాత్రం, వచ్చిన శేషానికి 'విజయ' ని కలపాలి లేదా విజయ నుండి లెక్కించాలి. అప్పుడే ఇప్పుడున్న సరైన సంవత్సరం వస్తుంది.



సూర్య సిద్ధాంతం విజయ తో మొదలుపెట్టడానికి కారణం అది జాబితాను మార్చడం కోసం కాదు; త్రేతాయుగంలేదాకలియుగం మొదలైనప్పుడు ''విజయ'' నామ సంవత్సరం నడుస్తోంది కాబట్టి, గణితాన్ని అక్కడి నుండి సరిచేశారు.కలియుగం మొదలయి ఇప్పటికి 5127 సంవత్సరాలు. దీని ప్రకారం విజయ నుండి లెక్కపెట్టి 2026 మార్చి తర్వాత మొదలయ్యే ఉగాది నుండి ఏ సంవత్సరం వస్తుంది.

2026 మార్చి తర్వాత వచ్చే ఉగాది నుండి ప్రారంభమయ్యే సంవత్సరం: ''పరాభవ నామ సంవత్సరం''. ''విజయ నుండి లెక్కించే పద్ధతి'' మరియు మన ప్రస్తుత వరుస క్రమం:

1. ప్రస్తుత వరుస క్రమం (దక్షిణ దేశ పద్ధతి): గతం: క్రోధి (2024-2025) ప్రస్తుతం నడుస్తున్నది (2025 మార్చి): విశ్వావసు. ఆ తర్వాతి ఉగాది (2026 మార్చి): పరాభవ

2. సూర్య సిద్ధాంతం 'విజయ' ప్రకారం విశ్లేషణ: మనం చెప్పుకున్నట్లు సూర్య సిద్ధాంతం కలియుగాదిలో ''విజయ'' సంవత్సరాన్ని మొదటిదిగా తీసుకుంది. 60 సంవత్సరాల చక్రంలో:

- విజయ సంఖ్య: 27
- పరాభవ సంఖ్య: 40

కాబట్టి, విజయ నుండి వరుసగా లెక్కించుకుంటూ వెళ్తే, అది 14వ సంవత్సరం (విజయతో కలిపి) అవుతుంది.కలియుగం గడిచి 5127 ఏళ్ళు అయ్యాయి. గణితం ప్రకారం లుప్త సంవత్సరాలను తీసివేస్తే వచ్చే పేరు వేరుగా ఉంటుంది (ఉత్తర

భారతదేశంలో వాడేది). కానీ, మన తెలుగు పంచాంగంలో "లుప్త సంవత్సరాలు" పాటించం కాబట్టి, వరుస క్రమంలో 2026 ఉగాదికి వచ్చేది కచ్చితంగా పరాభవ నామ సంవత్సరమే.

సూర్య సిద్ధాంతంలోని మధ్యమ మానంప్రకారం, 'విజయ' నామ సంవత్సర సూత్రాన్ని అనుసరించి 2026లో వచ్చే బార్హ స్పత్య సంవత్సరాన్ని గణించాలి. మన చాంద్రమాన (దక్షిణ దేశ) పద్ధతిలో 2026 ఉగాదికి 'పరాభవ' నామ సంవత్సరం వస్తుంది. కానీ సూర్య సిద్ధాంత బార్హస్పత్య మానం ప్రకారం అది "సిద్ధార్థి" నామ సంవత్సరం అవుతుంది. దీని వెనుక ఉన్న గణితం ఇది:

1. కలియుగ ప్రమాణం: క్రీ.శ. 2026 నాటికి కలియుగం ఆరంభమై సుమారు 5127 సంవత్సరాలు పూర్తయి, 5128వ సంవత్సర మొదలవుతుంది.

2. లుప్త సంవత్సరాల (క్షయ) లెక్క: సూర్య సిద్ధాంతం ప్రకారం సుమారు 85 సౌర సంవత్సరాలకు ఒక బార్హస్పత్య సంవత్సరం అదనంగా గడుస్తుంది (లుప్తమవుతుంది).

◆ గడచిన 5127సంవత్సరాలలో వచ్చిన లుప్త సంవత్సరాలు సుమారు: 60 సంవత్సరాలు.



3. మొత్తం బార్హస్పత్య సంవత్స రాలు: సౌర సంవత్సరాలు (5127) + లుప్త సంవత్సరాలు (60) = 5187సంవత్సరాలు.

4. విజయ నుండి గణన: కలియుగాదికి 'విజయ' (వరుస సంఖ్య 27) ఉంది కాబట్టి, దాన్ని కలుపుకోవాలి.

5. చక్రంలో స్థానం (60): ఈ మొత్తాన్ని 60 తో భాగిస్తే వచ్చే శేషం సంవత్సరాన్ని సూచిస్తుంది.

సిద్ధార్థి నామ సంవత్సరం లుప్తమై (క్షయమై), రౌద్రి నామ సంవత్సరం రావడం:

1. సిద్ధార్థి ఎందుకు లుప్తమైంది? బార్హస్పత్య మానంలో, గురువు ఒక రాశిని దాటడానికి పట్టే కాలం సుమారు 361 రోజులు. సౌర సంవత్సరం 365 రోజులు. ఈ తేడా వల్ల ప్రతి 85 సంవత్సరాలకు ఒకసారి ఒక సంవత్సరం "అధికం" అవుతుంది. దానినితొలగించాలి (క్షయంచేయాలి).ఈ 2025-2026 కాలంలో గురువు యొక్క 'అతిచారం' మరియు సంక్రమణాల లెక్కల ప్రకారం, "సిద్ధార్థి" నామ సంవత్సరానికి రావలసిన కాల పరిమితిని గురువు తన వేగంతో లేదా సౌర సంవత్సర సంక్రమణతో అధిగమించాడు. కాళయుక్తి సంవత్సరం పూర్తవ్వగానే, గణిత రీత్యా రావలసిన సిద్ధార్థిని వదిలేసి, నేరుగా రౌద్రి నామ సంవత్సరాన్ని పరిగణలోకి తీసుకోవాలి.

2. దక్షిణ, ఉత్తర అంతరం:2026లో ఇలా ఉంటుంది:దక్షిణ దేశం (మనంచాంద్రమానం): ప్రభవాది వరుస క్రమంలో 40వదైన "పరాభవ" నామ సంవత్సరం జరుపుకుంటాం.ఉత్తర దేశం (బార్హస్పత్యం): వరుస క్రమంలో 53వదైన "సిద్ధార్థి" లుప్తం చేసి, 54వదైన "రౌద్రి" నామ సంవత్సరాన్ని జరుపు కుంటారు. (గమనిక: మన 'పరాభవ'కి, వారి 'రౌద్రి'కి మధ్య ఉన్న అంతరం 14 సంవత్సరాలు. ఇది లుప్త సంవత్సరాల వల్ల వచ్చిన తేడానే.)

3. నిర్ణయసింధువు వంటి గ్రంథాల ప్రకారం.."యస్మిన్ రాశౌ గురుః సౌర వర్షే నైవ ప్రపద్యతే । స లుప్తః వత్సరో జ్ఞేయః..." అంటే ఒక సౌర సంవత్సరంలో (మేష సంక్రమణం నుండి మీన సంక్రమణం లోపు) గురువు ఏ రాశిలోనూ ప్రవేశించకుండా, లేదా అతివేగంగా రెండు రాశులను తాకితే ఆ సంవ త్సరం లుప్తమవుతుంది. 2025-26లో గురువు వృషభం నుండి మిథునంలోకి, అక్కడి నుండి కర్కాటకంలోకి వెళ్ళే గతులలో (అతిచార- వక్ర గతులు) జరిగిన మార్పుల వల్ల ఈ సంవత్సరం గణితంలో 'సిద్ధార్థి' లుప్తమైంది. పంచాంగంలో 2026 నాటికి బార్హస్పత్య మానంలో సిద్ధార్థి లుప్తమై, రౌద్రి వస్తుంది. మనకు మాత్రం పరాభవ ఉంటుంది.

సూర్య సిద్ధాంతం మధ్యమాధికారం ఆధారంగా, కలియుగాది నుండి గణితంచేసి, "సిద్ధార్థి" లుప్తమై "రౌద్రి" ఎలా వస్తుందో లెక్కకట్టి చూదాం.దీనికి మనం సూర్య సిద్ధాంతం - మధ్యమాధికారం (శ్లోకం 55) లోని సూత్రాన్ని ప్రమాణంగా తీసుకుందాం.

సూర్య సిద్ధాంతం ప్రకారం ఒక మహాయుగంలో:

1. సౌర సంవత్సరాలు: 43,20,000

2. గురు భగణాలు :3,64,220

3. గురు మధ్యమమాన సంవత్సరాలు : (రాశులు) = 43,70,640

దీనిని బట్టి ఒక సౌర సంవత్సరానికి గురువు యొక్క మధ్యమ గతి నిష్పత్తి :

(అంటే 1 సౌర సంవత్సరం గడిస్తే, గురువు 1.01172222 సంవత్సరాల దూరం ప్రయాణిస్తాడు. ఆ 0.01172222 భాగమే లుప్త సంవత్సరానికి కారణం).

గణితం: లక్ష్యం: 2026 మార్చి (ఉగాది) నాటికి వచ్చే బార్హస్పత్య సంవత్సరాన్ని సాధించడం. (సశేషం)

**- డా. శంకరమంచి రామకృష్ణ శాస్త్రి**
**శంకరమంచి శివ**

# వేదాల్లో విజ్ఞానాంశాలు




పోలిశెట్టి బ్రదర్స్

(గత సంచిక తరువాయి)

15 నిమేషములు = 1 కాష్ఠ; 30 కాష్ఠలు = 1 కళ; 30 కళలు = 1 ముహూర్తం; 30 ముహూర్తాలు = 1 రోజు. అనగా 1 రోజుకు = 15 x 30 x 30 x 30 = 4,05,000 నిమేషాలు. 1 రోజుకు 4,05,000 నిమేషాలు. (పూర్వ హైందవ కాలమాన ప్రకారం.)

ఈసారి ఆంగ్ల కాలమానాన్ని చూద్దాం.

60 సెకనులు = 1 నిమిషం; 60 నిముషాలు = 1 గంట.

24 గంటలు = 1 రోజు.

అనగా 1 రోజుకు = 60 x 60 x 24 = 86,400 సెకన్లు.

1 రోజుకు 86,400 సెకన్లు (ఆంగ్ల కాలమానప్రకారం).

పూర్వహైందవ కాలమానమును, ఆంగ్లేయ కాలమానముతో పోల్చిచూడగా 4,05,000 నిమేషాలు = 86,400 సెకన్లు. అంటే 75 నిమేషముల కాలం, 16 సెకన్లకు సరిపోతుంది. 1 నిమేషము = 16/75 సెకన్లు. అర్ధ నిమేషమునకు 8/75 సెకన్లు.

ఈ లెక్కన మన పూర్వీకులు ఇచ్చిన వివరణ ప్రకారం 8/75 సెకన్ల కాలంలో కాంతి 2,202 యోజనాల దూరం వెడుతుంది. ఒక యోజనం అంటే ఇంచుమించుగా తొమ్మిది మైళ్లు. అనగా 8/75 సెకన్లలో కాంతి పోయే దూరం సుమారుగా 20,000 మైళ్లు. దాని ప్రకారం 1 సెకనుల్లో కాంతి వేగం 1,87,500 మైళ్లు అవుతుంది.

మొత్తం మీద తేలినదేమంటే - అర్ధ నిమేషాన (అనగా 8/75 సెకన్ల కాలంలో) కాంతి 2,202 యెజనాలు పోవుననే లెక్క ననుసరించి చూడగా కాంతివేగం నేటి ఒక సెకనుకూ 1,87,500 మైళ్లు అని తెలియవచ్చింది. ఆధునిక పాశ్చాత్యుల లెక్క ప్రకారం కూడా కాంతి వేగం సెకనుకూ (దాదాపుగా) అంతే కదా!

పై వివరాల్ని బట్టి మన పూర్వీకులకు కాంతి వేగం గురించి స్పష్టమైన అవగాహన ఉన్నదని తెలియవస్తుంది. (కాంతివేగాన్ని గురించి మన పూర్వీకుల పరిజ్ఞానం అనే అంశాన్ని గొబ్బూరి వేంకటానంద రాఘవరావు గారి 'నక్షత్రాలు' అనే గ్రంథం (1954 నాటి ప్రచురణ) నుంచి సేకరించాం.)

ఇతర నక్షత్ర కుటుంబాల వద్దకు వెళ్లాలంటే, మనం కాంతి వేగంతో ప్రయాణం చేయగలగాలి. లేకుంటే అటువంటి అంతరిక్ష యానాలకు తరతరాల జీవితకాలాలు కూడా సరిపోవు. అయితే కాంతి వేగంతో ప్రయాణం చేయడం మనకు అసాధ్యమైన పని. కాంతి వేగంతో మన అంతరిక్ష నౌకలు ప్రయాణిస్తే, అవి మన భూ వాతావరణం దాటేలోపుగానే భగ్గున మండి, మసి అవుతాయి. కాంతి వేగంతో ప్రయాణించగల అంతరిక్ష నౌకల్ని తయారుచేయడం ప్రస్తుతానికి మన వల్ల కాదు. కనీసం సూర్య కుటుంబం అంతా తిరిగొచ్చే ఓపికే మనకు లేదు. ఇక ఇతర నక్షత్ర కుటుంబాల సంగతి దేవుడెరుగు.

కాంతి వేగంతో ప్రయాణిస్తే ఏం జరుగుతుంది? ఎలా ఉంటుంది? అనే విషయాలను మాత్రం కొన్నింటిని ఆధునిక శాస్త్రవేత్తలు తెలుసుకున్నారు. కాంతివేగంతో ప్రయాణించే వారి వయస్సు పెరగదట. కాంతి వేగంతో ప్రయాణించే వారి చేతి గడియారాల ముళ్లు కూడా తిరగవట. వారికి సంబంధించి నంతవరకూ కాలం స్తంభిస్తుందన్నమాట. కాంతివేగ ప్రయాణం వల్ల వయసు పెరగదు అనేమాట, ఆధునిక సైన్సు చెప్తున్న యథార్థం. అయితే పురాణకాలంలోనే మనవాళ్లకు ఈ విషయం తెలుసు. అలనాటి దేవీ భాగవతంలో దీనికి సంబంధించిన ప్రస్తావన కన్పిస్తుంది. (శ్రీకృష్ణుని అన్నగారైన బలరాముని వివాహ సందర్భంలో ఈ ప్రస్తావన వస్తుంది.)

### బలరాముని వివాహ సందర్భం

పూర్వకాలంలో రేవతుడు అనే మహారాజు ఉండేవాడు. ఆయనకు రేవతి అనే అందాల కుమార్తె ఉండేది. ఆమెకు పెళ్లీడు వచ్చింది. ఆమెకు తగిన వరుడి కోసం, భూ మండలంలోని దేశాలన్నీ గాలించాడు రేవతుడు. అయితే తగిన వరుడు ఆయనకు ఎక్కడా కన్పించలేదు. తన కుమార్తెకు తగిన వరుడు ఎక్కడున్నాడో, బ్రహ్మదేవుణ్ణి అడిగి తెలుసుకుందా మనకున్నాడు. తనకు గల పుణ్యశక్తితో కుమార్తెతో పాటు



అంతరిక్షయానం చేసి బ్రహ్మలోకం చేరుకున్నాడు. (భూమిపై ప్రకృతి రూపంలో ఉన్నది బ్రహ్మదేవుని అంశ మాత్రమే! అసలు బ్రహ్మదేవుడు అంతరిక్షాన సత్యలోకంలో ఉన్నాడని పురాణభావంగా గ్రహించాలి మనం.) అక్కడ బ్రహ్మదేవుని దర్శించుకున్న రేవతుడు "విధాతా! మా అమ్మాయికి తగిన వరుణ్ణి నిర్ణయించడం నా వల్ల కాలేదు. నాకు తగిన అల్లుడు ఎక్కడున్నాడో దయచేసి తెలపండి" అని కోరాడు. అతని మాటలకు బ్రహ్మదేవుడు చిరునవ్వు నవ్వి, "రేవతా! నువ్వూ, నీ కుమార్తె భూలోకం వదిలిపెట్టి, దివ్యలోకాల పరిధిలోకి వచ్చేశారు. మీరు చేసిన ఈ దివ్య ప్రయాణం వల్ల మీ ఇద్దరి వయసులూ ఏమాత్రం పెరగలేదు. అవతల భూలోకంలో మాత్రం తరాలు మారిపోయాయి. ఈ సత్యలోకంలోని ఒక్క క్షణం. భూలోకంలోని వంద సంవత్సరాలకు సమానం. ఇప్పుడు భూలోకంలో ఎన్నో మార్పులు జరిగాయి. కొన్నివేల సంవత్సరాలు గడచిపోయి, యుగమే మారిపోయింది. ఇప్పుడు 28వ ద్వాపరయుగం నడుస్తున్నది. నువ్వు పరిపాలించిన అనర్తదేశమూ, కుశస్థవ రైవతగిరి ప్రాంతమూ అన్నీ కాలగర్భంలో కలిసిపోయాయి. ఆనాటి రాజులూ, రాజకుమారులూ ఎవరూ లేరక్కడ. అక్కడ ఇప్పుడున్నది మరో ప్రపంచం. మీరు తిరిగి భూలోకం వెళ్లండి. అక్కడ నీకు అల్లుడు కాదగినవాడు ద్వారకా నగర నివాసి అయిన బలరాముడు. కృష్ణపరమాత్మకు అన్నగారైన బలరాముడు మీ అమ్మాయికి తగిన జోడీ. వారి వివాహం జరిపించి, నువ్వు బదరికా వనానికి వెళ్లి తపస్సు చేసుకో" అన్నాడు. రేవతుడు కుమార్తెతో సహా భూలోకానికి తిరిగి వచ్చి బ్రహ్మదేవుని ఆనతి ప్రకారం వివాహాన్ని జరిపించాడు. (ముందు తరాల యువతి కనుక రేవతి బలరాముని కంటే పొడవుగా ఉందట. బలరాముడు తన హలాయుధ శక్తిచే ఆమెను తనకు తగిన ఎత్తులోకి మలచుకున్నాడట.)

పై పురాణగాథలో మనకు అనేక సైన్సు విషయాలు గోచరిస్తున్నాయి. ఎక్కడో అంతరిక్షంలో ఉన్న బ్రహ్మలోకానికి వెళ్లాంటే, కాంతివేగంతో ప్రయాణం తప్పనిసరి! రేవతుడు తనకున్న యోగబలంతో కుమార్తెతో సహా ఆ విధంగా ప్రయాణించగలిగాడు. ఇది కల్పితమేమీ కాదు. ఎందువల్లనంటే కాంతివేగ ప్రయాణం వల్ల ఏర్పడే యథార్థ పరిణామాలు ఈ గాథలో స్పష్టంగా వివరించబడ్డాయి. రేవతునికి, అతని కుమార్తెకూ వయసులు పెరగకపోవడం, ఈలోగా భూమిపై తరతరాలు మారి యుగమార్పు సంభవించడం... ఇందుకు నిదర్శనాలు. ఇలాంటి దివ్యలోక, దేవలోక ప్రయాణాలు పురాణాల్లో సహజం. నాటి మహనీయుల తపోశక్తి, యోగశక్తి, పుణ్యఫలాల వల్ల అసాధ్యాలన్నీ సుసాధ్యాలయ్యేవి. ఈనాడు మానసికంగా భ్రష్టుడైన మనిషి అటువంటి దివ్యశక్తులను సాధించలేడు. కనీసం వాటిని నమ్మలేడు కూడా!

కుమార్తెతో సహా రేవతుడు కాంతివేగంతో ప్రయాణం చేయడం అసాధ్యమంటూ ఎవరైనా వితండవాదం చేయవచ్చు. ఆ ప్రయాణం సంగతి ఎలా వున్నా, మన పురాణకాలం వారికి 'కాంతివేగ ప్రయాణం గురించీ దాని ఫలితాలను గురించీ' మాత్రం స్పష్టంగా తెలుసునని నిరూపణ అవుతోంది. అది చాలా ఘనమైన విషయం. ఆ విషయాన్ని కాదనేందుకు మాత్రం ఎవరికీ అవకాశం లేదు.

## 10. ఇతర నక్షత్ర కుటుంబాల్లో ప్రకృతి, జీవరాశి గురించి...

సూర్యుణ్ణీ, దానిచుట్టూ తిరుగుతున్న గ్రహాలనూ, ఉపగ్రహాలనూ, గ్రహశకలాలనూ కలిపి "సూర్యకుటుంబం" అంటున్నాం. ఈ సూర్యకుటుంబంలో ప్రకృతీ, జీవరాశి ఒక్క భూగోళం మీదనే ఉందని తెలుసుకున్నాం. విశ్వంలోని ఒకానొక నక్షత్రం సూర్యుడు. సూర్యునికంటే పెద్దా, చిన్నా అయిన నక్షత్రాలు విశ్వంలో కోటానుకోట్లున్నాయి.

(సశేషం)



# ఆర్ష ధర్మంపై అన్యుల విషం

## భరతజాతిని మేల్కొల్పే 'అరవిందుని' కలం

(గత సంచిక తరువాయి)

ముఖ్యంగా హిందూ దేవాలయాలు, మత సంస్థలపై ప్రభుత్వ అధికారం వ్యవస్థీకృతమైంది. దేవాలయాల్ని ఆదాయ వనరులుగా చూడడం, దేవాలయ భూముల్ని, ధనాన్ని ప్రభుత్వ ఖజానాలో చేర్చడం ప్రభుత్వాలు కొనసాగించాయి.

కుల వ్యవస్థ విషయంలో కూడా బ్రిటీషు భావజాలమే నడిచింది. కులాల్ని విడదీయడం ద్వారా కొన్ని కులాల్ని ఓటు బాంకులుగా వాడుకోవడం పలు పార్టీలు చేశాయి. ఆర్థికంగానూ సామాజికంగానూ వెనుకబడ్డ వర్గాలకు న్యాయం చేయాలనే లక్ష్యంతో 1979లో జనతాపార్టీ కేంద్ర ప్రభుత్వంలో ఉన్న సమయంలో మండల్ కమిషన్ అనే కమిషన్‌ను ఏర్పాటు చేసింది. B.P. Mandal అనే పార్లమెంటు సభ్యులు ఈ కమిషన్‌కు అధ్యక్షులు. వారు 1980లో తమ నివేదికను అందచేసారు కానీ ప్రభుత్వాలు దానిపై చర్య తీసుకోలేదు. తర్వాత 1990లో వి.పి.సింగ్ గారు ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో ఆ రిపోర్టును అమలు చేస్తామంటూ వెల్లడిచేసారు. దానికి కారణం అదే సమయంలో బిజెపి నేత అద్వానీ గారు చేపట్టిన దేశవ్యాప్త రథయాత్ర. రథయాత్ర సందర్భంగా హిందువుల్లో తమ స్థితిపై అవగాహన, చైతన్యం వచ్చాయి. ఆ సమయంలో మండల్ రిపోర్టును బయటపెట్టి కులాల మధ్య చిచ్చుపెట్టడం, దేశవ్యాప్తంగా ఆందోళనలు చెలరేగేట్టు చేయడం ఒక రాజకీయ ఎత్తుగడ. హిందువుల్ని కులాలవారీగా పోట్లాడుకునేట్లు చేయడం అందులోని ముఖ్య ఉద్దేశ్యం. హిందూ ఐక్యతకు ఇది కొంతవరకు భంగం కలిగించింది. ఓబిసి రిజర్వేషన్లు, కుల ప్రాతిపదికపై ఓటుబాంకు రాజకీయాలు మరింత గట్టిపడ్డాయి.

తమిళనాడులో బ్రిటీషు పాలకులు హిందూ సమాజంపై చేసిన ప్రయోగాల్ని గూర్చి ఇదివరలో తెలుసుకున్నాం. సమాజంలోని అన్ని రుగ్మతలకు బ్రాహ్మణుల్ని విలన్లుగా చూపించి సామాజిక న్యాయం అనే పేరిట జస్టిస్ పార్టీ స్థాపనను ప్రోత్సహించారు. ఎస్‌సి, ఎస్‌టిలు దీనివల్ల లాభం పొందలేదు. రాజకీయంగా బలంగా ఉన్న ఓబిసి వర్గాలే దీనివల్ల లాభం పొందాయి. ఆ తర్వాత జస్టిస్ పార్టీ రూపాంతరం చెంది డికెగాను డిఎంకెగానూ మారిన తర్వాత కూడా ఇదే విధానం నడుస్తోంది. హిందూ సమాజం చీలిపోవడంతో క్రైస్తవం, ఇస్లాం బలపడ్డాయి.

ఈ అనుభవం మన కళ్ల ఎదుట ఉన్నప్పటికీ ఇటీవల రాజకీయ పార్టీలు కులం వారీగా కులగణన (Census) చేయాలని ప్రతిపాదించడం వారి అజ్ఞానం కావచ్చు, అవకాశవాదం కావచ్చు, లేదా దేశవ్యతిరేక శక్తుల ప్రేరణ కావచ్చు. ఈ సంశయం రావడానికి బలమైన కారణం ఉంది.

ప్రపంచీకరణ నేపథ్యంలో ఏ దేశంలో ఏ సమస్య తలెత్తినా దానికి ప్రాంతీయ కారణాలే కాక విదేశీశక్తుల ప్రమేయం ఉంటుంది. ప్రజాస్వామ్య దేశాలు కావచ్చు, నియంతృత్వదేశాలు కావచ్చు వాటిలో జరిగే అనేక సంఘర్షణల వెనుక ఇతరుల పాత్ర ఉంటుంది. మనదేశంలో కులగణన అనే ఆలోచన మన నాయకుల మేధోశిశువా, ఇతరుల పాత్ర ఎంత అని చూడాలి. 20వ శతాబ్దంలో మార్క్సిస్టు సిద్ధాంతములోవచ్చిన ఒక ముఖ్యపరిణామం సాంస్కృతిక మార్క్సిజం (cultural marxism).



సంప్రదాయ మార్క్సిజం ఆర్థిక దృష్టి కోణంలో కేవలం వర్గ పోరాటాన్నే ఆయుధంగా వాడుకుంది కాని అనేక దేశాల్లో ఆర్థిక అసమానతలున్నా వర్గపోరాటాలు జరగలేదు. మార్క్సిస్టు మేధావులు దీనిపై ఆలోచించారు. గ్రాంచి (Gramsci) అనే ఇటాలియన్ కమ్యూనిస్టు (Cultural hegemony) సాంస్కృతిక పెత్తందారీ అనే భావనను ప్రతిపాదించాడు. ప్రతి సమాజంలోను దాని మూల సంస్కృతిని కాపాడాలనే వర్గం ఒకటి ఉంటుంది. అదే సంస్కృతిలోనే కొంత బడుగువర్గాలు కూడా ఉంటాయి. ఈ బడుగు వర్గాల్ని ఆర్థిక దృష్టి కోణం నుంచి వేరు చేయడం కాక సాంస్కృతికంగా మీరంతా పీడితులు, బాధితులు అని చెప్పడం ఇందులోని కొత్త విషయం. మూల సంస్కృతి జాత్యహంకారం, పురుషాధిక్యత లాంటి భావజాలంతో కలిసి ఉందనీ, ఆ సంస్కృతిని కూలదోసి కొత్త సంస్కృతిని తీసుకురావాలనీ వీరి వాదన.

జర్మనీ నుంచి తరిమి వేయబడ్డ మార్క్సిస్టులు అమెరికా ఉదార విధానాలను ఉపయోగించుకుని క్రమక్రమంగా విశ్వవిద్యాలయాల్లో ఒక శక్తిగా ఎదిగారు. అమెరికాలో వీరికి కావలసిన సాంస్కృతిక వైవిధ్యం ఉంది. నల్లవారు సాంస్కృతికంగా పీడితులు, తెల్లజాతి అమెరికన్లు జాత్యహంకార

వాదులు అనే ఒక చట్రంలోకి సరిపోతారు. దీనికితోడు అమెరికాలో ఇతర మతాల వారి (ముఖ్యంగా, ఇస్లాం) వలసలు ఎక్కువయ్యాయి. నల్లవారితో పాటు పీడితుల జాబితాలో ఇస్లామిక్ సంస్థలు, రాడికల్ భావాలున్న ఇతరులు చేరగలిగారు. అమెరికాను బలహీనపర్చాలనే లక్ష్యం ఇస్లామిక్ వాదులకు ఉంది. భారతీయుల్లో దళిత వర్గాల వారిని మాత్రం పీడితుల జాబితాలో చేర్చారు. సెక్సు స్వాతంత్ర్యవాదులు, స్వలింగ సంపర్కులు కూడా వీరితో కలిశారు అందరి లక్ష్యం అమెరికన్ సంస్కృతిని నశింపజేయడమే. ఇలాగ కమ్యూనిజం సాంస్కృతిక మార్క్సిజం అని రూపాంతరం చెంది విశ్వవిద్యాలయాలను ఆక్రమించింది.

Cultural hegemony అంటూ ప్రారంభమైన భావన Crilical Race Theory (CRT) అనే సిద్ధాంతంగా మారింది. ప్రతి వ్యక్తి ఏదో ఒక సాంస్కృతిక వర్గానికి చెందినవాడే కావున వెంటనే వీడు పీడితుడు, వీడు జాత్యహంకారి అని ముద్రవేయబడతాడు. ఈ భావజాల ప్రభావంతో, ఈనాడు అమెరికా విలవిల్లాడుతోంది. ఈ పరిణామాల్ని Nall Ferguson మొదలగు వారి రచనల్లో, భాషణల్లో వివరంగా తెలుసుకోగలం.

ఇదంతా భారతీయ సమాజానికెలా వర్తిస్తుంది? అమెరికాలో Critical Race Theory ప్రయోగంతో విజయం సాధించిన వామపక్షవాదులు, పై సిద్ధాంతాన్ని Critical Caste Theory అని మార్చి పశ్చిమ దేశాల్లోని భారతీయుల్ని విడదీశారు. ముఖ్యంగా UK, USA లలో Caste Law తేవడానికి కూడా ప్రయత్నించారు. ఇదే సిద్ధాంతాన్ని భారతదేశంలో అమలు చేయడానికై ప్రస్తుత ప్రయత్నాలు, కులగణనలు. భారతదేశంలో కమ్యూనిజం ప్రారంభం నుంచి దేశ విభజనవాదాలున్నాయి. దేశంలో జాతీయ భావన లేదని ఇది 50 చిన్న రాజ్యాల కలయిక అని, అవి మళ్లీ విడిపోవాలనీ కమ్యూనిస్టుల వాదం. దానితో పాటు వర్గపోరాటాన్ని తేవడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. ఇప్పుడు మిగిలింది సాంస్కృతిక పోరాటం. బ్రిటిష్ పాలన సమయంలో సమాజాన్ని విడగొట్టడానికి మారుమూల ప్రాంతాల్లోని తెగలను కూడా గుర్తించి నాలుగు వేలకు పైగా కులాలున్నట్లు నమోదు చేశారు. వాటిలో కొన్ని అగ్రవర్ణాలు, కొన్ని వెనుకబడినవి అని గుర్తించారు. వారి లక్ష్యం అనేక వర్గాల్ని మతమార్పిడి చేయడమే.

కులాల గణన అనే అంశాన్ని నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ అందరూ వ్యతిరేకించారు. దేశంలో ఆడ్వానీ రథయాత్ర సమయంలో ఒక సాంస్కృతిక జాగరణ జరిగే సమయంలో వి.పి. సింగ్ ప్రభుత్వం మండల్ కమిషన్ నివేదికను అమలు చేసింది. ఇది ఎవరి సలహా వల్లనో తెలియదు. దేశంలో జాతీయ



భావన పెరగకూడదనే శక్తులు తెరవెనుక ఉండవచ్చు. ఏ దేశంలోనైనా జాతీయభావన పెరిగితే ఆ దేశాన్ని తమ అదుపు ఆజ్ఞల్లో ఉంచుకోవడం కష్టమని, అందువల్ల జాతీయ భావనను అన్ని విధాలా అడ్డుకోవాలని పాశ్చాత్యదేశాల రాజనీతి. ఈ కారణం వల్లనే భారతదేశంలో జాతీయ భావనను వారు తీవ్రంగా వ్యతిరేకిస్తారు. అయినా రాజీవ్ గాంధీ పార్లమెంటులో మండల్ రిపోర్టును వ్యతిరేకించారు. మండల్ కమిషన్ కాలం నుంచి అనేక ప్రాంతీయ పార్టీలు, కులాల సమూహాలు రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చాయి. జాతీయ భావన బలహీనమైంది.

ఇటీవలి కాలంలో జాతీయ భావన బలపడుతున్న సమయంలో మళ్లీ కులగణన అనే ప్రస్తావన వెనుక ఏ శక్తులున్నాయో తెలియదు. కుల విభజన చేసే ధైర్యం ఉందా అని ఒక నాయకుడు కేంద్రాన్ని ప్రశ్నించాడు. సమాజాన్ని విడగొట్టడంలో ధైర్యమేమిటో తెలియదు. ఒకప్పుడు ఆయా కులాల వారు ఆయా కులవృత్తుల్ని చేసేవారు. ఇవాళ చాలామంది కులవృత్తుల్లో లేరు. హైదరాబాద్‌లో హేర్ కటింగ్ రంగంలో చాలా మంది ముస్లింలే ఉన్నారు. ఇలాగే మిగతా కులాల్లోనూ.

కులం అనేది భారతీయ సమాజంలో హిందువుల్లోనే కాక ఇస్లాంలో, క్రైస్తవంలో కూడా ఉంది. కేవలం హిందూ కులాలను మాత్రం విభజించి హెచ్చుతగ్గుల్ని నిర్ణయించడం ప్రమాదకరం. క్రైస్తవంలో ప్రొటెస్టెంటు, కాథలిక్కులు, లూథరన్‌లు, ఆంగ్లికన్‌లు మొ॥ అనేక విభాగాలు. వీరి చర్చిలు వేరువేరు. ఒకరిచర్చికి మరొకరు వెళ్ళరు. ఇన్ని వీ సీట్లు కావాలి, లేదా ఇంత బడ్జెట్‌లోనూ కేటాయించాలి అని అడగడం లేదు.

(సశేషం)

# కంచిస్వామి దివ్య చరిత్ర 'గిని - అద్వైత గని'

(గత సంచిక తరువాయి)

**నటరాజస్వామి - కుంచితపాదం**

మహాస్వామివారు బాగా వృద్ధులై పోయారు, తొంభైయేడు సంవత్సరాల వయస్సు వచ్చేసింది. అంత పెద్దవారై పోయిన తర్వాత ఎక్కువ మాట్లాడేవారు కాదు. మౌనంలో ఉండేవారు. ఆ మౌనంలో ఉంటూ శరీరము యొక్క ఆరోగ్యం కూడా అంత బాగోలేదు ఆ సంవత్సరం. అకస్మాత్తుగా ఆయన అన్నారూ! చిదంబరంవెళ్ళి కుంచితపాదం తలమీద పెట్టుకోవాలి. 'చిదంబరంలో నటరాజస్వామి కుంచితపాదం తలమీద పెట్టుకోవాలి' అన్నారు. చిదంబరంలో నటరాజస్వామి కుంచితపాదం తలమీద పెట్టుకోవడం అన్నమాటకు అర్థం ఏమిటంటే, చిదంబరంలో ఒక ఆచారం ఉంది. ఓషధులతో కూడుకున్నటువంటి మాల ఒకటి తయారుచేస్తారు. ఆ ఓషధులమాల నటరాజస్వామి పాదానికి చుట్టి తీస్తారు.

ఆ చుట్టి తీసినదాన్ని తలమీద పెట్టుకున్నారనుకోండి! అది సమస్తమైన అనారోగ్యాలని తీస్తుంది. అది దూరమైందనుకోండి అనారోగ్యకారకమవుతుంది కూడా. అనారోగ్యంగా ఉన్నప్పుడు దాన్ని తలమీద పెట్టుకుంటారు. అది దగ్గర ఉండటం ఆరోగ్యానికి హేతువు. దానికి ఫలశ్రుతి అలాగే చెప్పారు పెద్దలు. మహాస్వామి ఎందుకో ఆరోజు రాత్రి ఈమాట అన్నారు. చిదంబరం కుంచితపాదాన్ని నా తలమీద పెట్టుకోవాలి. అంటే దానర్థం ఓషధులతోకూడిన మాల నేను తలమీద పెట్టుకోవాలి. ఎలా?...రాత్రి పీఠానికి సంబంధించినటువంటి పరివారమంతా బయటకుర్చొని చర్చించారు. స్వామీ చిదంబరం అంటున్నారు!... ఎలా వెడతారు!. శరీరానికి ఆరోగ్యమా... బాగోలేదు. ఆయనా... వాహనమెక్కరూ...పల్లకిలో వెళ్ళాలి, లేకపోతే నడిచి వెడతారు. పల్లకీలో కూడా కుదుపు తట్టుకోగలరా ఈవయస్సులో! రకరకాల ఆలోచనలుచేసి ఏమో ఎందుకన్నారో!... ఎలానెరవేరు తుందో!... అని పడుకున్నారు.

ఇంకా పూర్తిగా ఊరు తెల్లవారలేదు. లోపలికి ఎవరో నలుగురు బ్రాహ్మణులు వచ్చారు. పీఠపరివారం లేచి అడిగారు ఎవరు మీరని? మేము చిదంబరంనుంచి వస్తున్నాం దీక్షితులం. చిదంబరంలో అర్చకులం. నిన్నరాత్రి స్వామీ కుంచితపాదానికి ఓషధీమాల చుట్టాం. ఆ కుంచితపాదం తీసుకొచ్చాం చన్ద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామికి ప్రసాదంగా ఇద్దామని అన్నారు. వాళ్ళు తెల్లబోయారు. అరే... ఏమాశ్చర్యం నిన్న రాత్రి స్వామి అన్నారా!... వాళ్ళు బయలుదేరివచ్చారా!... అని గబగబా స్వామి దగ్గరికి తీసుకెళ్ళారు. ఆయన వెంటనే అది తీసుకొని కళ్ళకద్దుకొని తలమీద పెట్టుకున్నారు.



**తూములూరి మోహన్ కుమార్**

ఇప్పటికీ ఏంచెప్తారో తెలుసా!... ప్రాజ్ఞులు కొంచెం దాంట్లో ప్రవేశం ఉన్నవాళ్ళు, స్వామి జీవితంతో బాగా పరిచయం ఉన్నవాళ్ళు, ఒకమాట చెప్తారు. ఏది ఉన్నా...లేకపోయినా...కుంచితపాదం తలమీద పెట్టుకున్నప్పుడు ఆయన్ని ఫోటో తీశారు. ఆ ఫోటోతప్పకుండా పెట్టుకోండి అని చెప్తారు. అది ఇంట్లోఉండాలని చెప్తారు. ఎందుకని అంటే అది ఇంట్లోఉంటే నమస్కారం చేస్తే అది కాపాడుకుంటూ ఉంటుంది. అది ఇంట్లో పెట్టుకోవాలని చెప్తారు. అది చిత్రమేమిటంటే...అది ఆ కుంచితపాదంతో ఆ మాలతో ప్రకాశిస్తూ అద్భుతమైనటువంటి మూర్తిగా పరమ శాంతరసంతో స్వామి మూర్తి చిత్తరువుగా దొరికింది. ఆ ఫోటోకి అంత ప్రశస్తి ఉంది. అది నిజానికి వారు తనకోసంకాదు బహుశః, తనని ఆశ్రయించిన వాళ్ళని కాపాడటానికి అలా ఆ ఫోటో తీయించుకున్నారేమో అని నాకిప్పటికీ అనిపిస్తూ వుంటుంది ఒక్కొక్కసారి. వారి మనసులో ఒక సంకల్పం వచ్చింది, ఎవరు నిజం చేసారుదాన్ని!...కామాక్షి పరదేవతా చేసేస్తుందంతే!...బయలుదేరి రావలిసిందే.

"చిత్తం" "దేవ్యాయత్తం" అటువంటి మహానుభావు డెవరున్నారో ఆయనకీ, 'వందేతం' మీకు నమస్కరిస్తున్నాను. ఎవరాయన? చన్ద్రశేఖరేంద్ర యతీమ్. చన్ద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామి అనబడేటటువంటి ఆ యతిపురుషునకు నమస్కరించుచున్నాను అంటారు. అంతటి గొప్ప స్థాయిని పొంది, భారతదేశంయొక్క ఖ్యాతిని వైదికమైన సంప్రదాయం, వైదికమైనటువంటి అనుష్ఠానబలం మనిషిని ఏ స్థాయికి తీసుకెళ్ళగలదో! పరబ్రహ్మంగా ఎలా నిలబెట్టగలదో! లోకానికంతటికి నిరూపణ చేసినటువంటి యతివరేణ్యులు చన్ద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామి.

**దక్షిణామూర్తిత్వం**

వారి నోటివెంట ఏదైనా మాట వచ్చిందా!...ఆ మాట లోకాలని అలా కాపాడింది. ఎన్నికోట్లమంది శిష్యులకో ఇప్పటికి వారు ఒకప్పుడు పలికినటువంటి మాటలు ఎవున్నాయో, ఆ మాటలు అన్నీకూడా అంతంత గొప్పగా ప్రకాశించాయి. అసలు నేను ఈ విషయం చెప్పేటప్పుడు మీతో ఒక ప్రధానమైనటు


వంటి విషయాన్ని మనవిచేయవలసి ఉంటుంది. నేను మీతో ఇందాక ఒక మాట అన్నానుకదూ!... వారి నోటివెంట తత్వపర మైన మాటలొస్తాయి అని అన్నాను. అసలు ఆయన మాట్లాడ కుండా మాట్లాడినటువంటి సందర్భాలున్నాయి. అది అన్నిటికన్నా అత్యధికమైనటువంటి స్థాయి. మనం తెల్లవారిలేస్తే ఓమాట అంటాం.

**సదాశివ సమారంభామ్ శంకరాచార్య మధ్యమాం ।**
**అస్మదాచార్య పర్యంతాం వందే గురు పరంపరామ్ ॥**

అని దక్షిణామూర్తి స్తోత్రం చేస్తాం. దక్షిణామూర్తి మౌనం. మాట్లాడకుండానే, ఆయన అవతలివారికి జ్ఞానం అందించారు. ఒక్కొక్కసారి మాట్లాడక్కరలేదు. మాట్లాడకుండానే నోటిమాట అక్కర్లేకుండానే అవతలివారికి తన మనోభావాన్ని అందిస్తారు.

నేను నా చేతితో సౌజ్ఞ చేసాను అనుకోండి. ఏమన్నా మాట్లాడానా? కానీ అవతలివాళ్ళకు అర్థమవుతుంది. అంటే నామాట అక్కర్లేదు. నా చేతిత సౌజ్ఞ అర్థమైంది.

ఒక్కొక్కసారి సౌజ్ఞచేత నోటిమాట అక్కర్లేకుండా పని చేస్తుంది. నోటిమాట, సౌజ్ఞ అక్కర్లేకుండా మాట్లాడుకుంటారు పెద్దలు. ఒక్కొక్కసారి సముఖంలో మాట్లాడుకుంటారు. ఒక్కొక్కసారి సముఖంలో అక్కర్లేదు, ఎక్కడో ఉన్నవారితో కూడా ఇక్కడినుంచి మాట్టాడుతారు. ఈ దేశముయొక్క గొప్పతనం అక్కడుంది. నేను ఆస్థాయికి వెళ్ళలేదు కాబట్టి అలాంటి వాళ్ళు ఉండరంటే అంతకన్నా అన్యాయం ఉందా? నేను ఐఏఎస్ చదువుకోలేదు కాబట్టి లోకంలో ఐఏఎస్ చదువుకున్న వాడు ఉండడండి అంటే..., అంతకన్నా అన్యాయం ఇంకోటి ఉంటుందా? నాకేమో అనుష్టాన బలం లేదా? లోకంలో అలాంటివాళ్ళు ఉండరంటే, దానికి అర్థం ఏమైనా ఉంటుందా? వాళ్ళేమైనా గారడి మనుషులా? నీకివన్నీ చూపించటానికి అస్తమానూ. వాళ్ళు మాట అవసరం లేకుండా మాట్టాడుకుంటారు.




(సశేషం)

('గిని..అద్వైతగని' పుస్తకం నుంచి)




కనకమృగము భువిని కలదు లేదనకుండ
తరుణి విడచిపోయె దాశరథియు
తెలివిలేని వాడు దేవుడెట్లాయెరా
విశ్వదాభిరామ వినుర వేమ

కనకమృగము భువిని కలుగ దంచెఱుగఁడు
రామ్నుఁడెఱుక గల్గు రాజు కాడొ
చేటుకాలమునకు చెడుబుద్ధి పుట్టురా

పై పద్యములు వేమన్న పలికెనో, ఆతని పేరుతో వేరొక తిమ్మన్న పలికెనో తెలియదు కాని రెండవ పద్యమునకు మాతృక యనదగిన సంస్కృత శ్లోకమొకటి ఉన్నది..

అసంభవం హేమమృగస్య జన్మ తథా2పి రామో లులుభే మృగాయ
ప్రాయః సమాపన్న విపత్తికాలే ధియో-పి పుంసాం మలినీ భవన్తి

మొత్తమునకన్నియు అవి చారితనిందాగర్హణీయములైన వాక్యములే.. వీలు దొరకినచో విచక్షణారహితముగ సంప్రదాయములను హేళనచేయు పండితమ్మన్యుల వీరవిహారములకు కొదువలేదు కదా..



# మారీచుడు... మాయలేడి

సరే.. ఇంతకును జరిగినదేమి.. మారీచుని మాయ తెలియనివాడా శ్రీరామచంద్రుడు..

అకంపనునితో ఖరదూషణాదుల వధ విని, రాముని యుద్ధమున జయింప వీలుకాదని, అకంపనుడు సూచించిన సీతాసౌందర్యమును విని, ఆ దేవి నపహరింపవలెనని, సంప్రదింపులకై మామ మారీచుని కలసినాడు రావణుడు.. విషయము తెలిసి, రావణునికి హితబోధచేసి, హెచ్చరించి మరలించినాడు మారీచుడు..

తిరిగిపోయిన రావణుడు, సభలో శూర్పణఖ నిందోక్తులకు పరిహారముగా, రెండవ మారు మారీచుని చేరి కనకమృగరూపమును ధరించి సీతాదేవినాకర్షింపమని, ఆమె కోరికతో మాయలేడి వెనుకతరిమిన రాముని దూరముగ కొనిపోయి, రాముని స్వరముతో సీతా లక్ష్మణులను నామములుచ్చరించి ఆక్రందించమని, అప్పుడు తను సీతాదేవి నపహరింపగలనని, తన పన్నాగమును వివరించి అట్లాచరించుమనిన రావణునితో మారీచుడు సుదీర్ఘమగు ఉపన్యాసమునే చేసినాడు..

ఇక్కడి మారీచుని వాక్యములు శ్రద్ధగా మనసు కెక్కించుకొనవలసినవి..

మొదటగా రాముని జననము యజ్ఞసంభవమని రావణుని మదిలో మెదిలే సందేహము నివారణము చేసినాడు.. బలాబలములు విచారించుకొమ్మనినాడు.. ఎంతో హితబోధ చేసిన తర్వాత విశ్వామిత్రుని యాగరక్షణ కార్యము, మార్గమున తాటకవధ, తర్వాత యాగరక్షణమున సుబాహు మరణము, తను ప్రాణములతో బయటపడినది ఉపన్యసించినాడు.. విశ్వామిత్రయాగ రక్షణమున రాముని బాణఘాతముచే సముద్రాంతమునకు విసరికొట్టబడినాడు.. తేరుకొని బ్రతుకుజీవుడా అనుకొని లంకను చేరినాడు..

అకృతాస్త్రేన బాలేన రామే ణాక్లిష్టకర్మణా

(వాల్మీకి రామాయణము: అరణ్య: 38-22)

అప్పటికి రాముడు బాలుడు.. ఇంకను శస్త్రాస్త్ర విద్యాపరిశ్రమమున ఆరితేరిన వాడు కాడు.. 'రావణా! ఆ రాముడిప్పుడు పూర్ణ పురుషోత్తముడు..' తనకథ ఇంకా వినమంటున్నాడు మారీచుడు..

ఏవ మస్మి తదా ముక్తః కథంచి త్తేన సంయుగే
ఇదానీ మపి యద్వృత్తం త చ్ఛృణుష్వ నిరుత్తరమ్

(వాల్మీకి రామాయణము: అరణ్య: 39-1)

విశ్వామిత్రుని యాగరక్షణ ఎప్పుడో జరిగినది.. కానీ ఇది

విను.. ఇది ఎంతోకాలం కాదు.. ఇటీవలే జరిగినది.. జాగ్రత్తగా విను.. అని మారీచుడు తన కథ కొనసాగిస్తున్నాడు..

విశ్వామిత్రుని యాగసంరక్షణమున రామబాణహతుడై ఎట్లో ప్రాణములు దక్కించుకొని లంక చేరిన మారీచుడు రాముని బాణహతిచే చెడిన బలమును క్రమముగ చేకూర్చుకొని చివరకు దండకారణ్యమును చేరినాడు..

అక్కడ జనస్థానము, ఖరదూషణాదులు 14వేల రాక్షససైన్యమున్నది కదా.. అదొక ధైర్యము.. నిశ్చింతగ జీవనము జరిగిపోగలదని నిశ్చయించుకొని తనకు తగిన మరి ఇద్దరు రాక్షసులను తోడు చేసుకొని దండకారణ్యం ప్రవేశించినాడు..

ఎలా..?

**రాక్షసాభ్యా మహం ద్వాభ్యామ్ అనిర్విణ్ణ స్తథాకృతః**
**సహితో మృగరూపాభ్యాం ప్రవిష్టో దణ్డకావనమ్**

(వాల్మీకి రామాయణము: అరణ్య: 39-2)

ఆ ఇద్దరు రాక్షసులతో, తాను జింకరూపము ధరించి దండకావనిలో మృగాలను, తాపసులను భక్షిస్తూ యథేచ్ఛగ సంచారము చేయసాగినాడు..

ఇది జాగ్రత్తగ గమనింపదగినది.. మారీచుడు మాయలేడి అవతారమెత్తుట మొదటిసారికాదు.. అది అతడు తనకై తాను ఏర్పరచికొనిన వంచన వ్యవహారము.. మారీచుడు లేడి రూపమున అరణ్యమున తాపసులను, జనమును, మృగములను వంచనతో సంహరించి సంచరిస్తున్న విషయం రావణునకు బాగా తెలిసిన విషయమే.. అందుకే ఆ లేడి అవతారముతోనే సీతను ఆకర్షింపమన్నాడు..

అంతే కాదు.. మారీచుడు చెప్పిన మహత్తరమైన సత్యమింకొకటి.. కాలము గడచిపోయినది.. మారీచుని మాయలేడి సంచార వ్యవహారము నిరాటంకమైనది..

**తథా రుధిరమత్తోఽహం విచరన్ ధర్మదూషకః**

(వాల్మీకి రామాయణము: అరణ్య: 39-6)

ఆ విధంగా రక్తమాంసాహారమత్తుడై అలా లేడిగా తిరుగుతూ పంచవటీ ప్రాంతంలో సీతాసహితులైన రామలక్ష్మణులను మారీచుడు చూసినాడు..

**ఆసాదయం తదా రామం తాపసం ధర్మచారిణమ్**
**వైదేహీం చ మహాభాగాం లక్ష్మణం చ మహారథమ్**

(వాల్మీకి రామాయణము: అరణ్య: 39-7)

ఎంత కాలం గడిచింది.. విశ్వామిత్ర యాగరక్షణ మప్పటికి పన్నెండేండ్లవాడు.. తర్వాత 12 ఏండ్లకు వనవాసారంభము.. వనవాసంలో 13 ఏండ్లు గడచినవి.. దాదాపు 24-25 సంవత్సరాల తర్వాత మునివేషంలో ఉన్న సీతాసహితులైన రామలక్ష్మణలను చూసి, తాపసులే అనుకున్నాడు మారీచుడు..



అయితే దగ్గరగా చూచి, పోలిక గుర్తించి

**పూర్వ వైర మనుస్మరన్ రామం పరిభూయ మహాబలమ్**

తనను ఇదివరకు గాయపరచిన విషయము గుర్తుకువచ్చి, మహాబలశాలి అయిన రాముని పరాభవించవలెనని

**తాపసం నియతాహారం తాపసోఽయ మితిజ్ఞాత్వా**

(వాల్మీకి రామాయణము: అరణ్య:39-9)

మునివృత్తిలో నియతాహారంతో బలం క్షీణించి ఉంటుంది, తననేమి చేయలేడు అనుకొని,

**అభ్యధావం హి సంక్రుద్ధః**

ఎదుర్కొని దెబ్బతీయాలి అని రామునికెదురుగా మహాక్రోధంతో వేగంగా దూసుకొని వెళ్ళినాడు..

ఎలా..?

**తీక్ష్ణశృంగో మృగాకృతిః** (వాల్మీకిరామాయణం:అరణ్య: 39-9)

వాడిగల కొమ్ములతో జింకరూపం ధరించి, తనతోడుగా ఉన్న ఇద్దరు రాక్షసులతో దూసుకొని వెళ్ళినాడు..

ఈ వ్యవహార మంతా గమనించిన రామచంద్రమూర్తి

**విక్రుష్య బలవచ్చాపం సువర్ణానిల నిస్వనాః**

(వాల్మీకి రామాయణము: అరణ్య: 39-10)

నారి సంధించి మూడు బాణములను తీవ్రవేగంతో ప్రయోగించినాడు.. రాముడెప్పుడైతే వింటివైపు చేయిచాపినాడో, ఆక్షణమే,

**రామస్య శరో దృష్టభయః పురా**

ఇంతకు ముందు రాముని చేతి దెబ్బరుచిచూసిన వాడు కాబట్టి, మారీచుడు,

**సముద్భ్రాన్త స్తతో ముక్తః**

అక్కడినుంచి శరవేగంతో పారిపోయినాడు.. తప్పించుకున్నాడు.. కానీ మారీచుని సహచరులైన ఆ ఇద్దరు రాక్షసులు మాత్రం

**తా వుభౌ రాక్షసౌ హతౌ**

రామబాణహతులై చచ్చినారు..

మారీచుడు ఇంకా రావణునితో చెప్తున్నాడు..

రావణా.. ఆ విధంగా లేడిరూపంతో రాముని ఎదుర్కొని

**శరేణ ముక్తో రామస్య కథంచిత్ ప్రాప్య జీవితమ్**
**ఇహ ప్రవ్రాజితో యుక్తః తాపసో2హం సమాహితః**

(వాల్మీకిరామాయణం: అరణ్య: 39-13)

రామబాణం వలని ఎట్లో చావుదెబ్బ కనురెప్పపాటులో తప్పించుకొని, పారిపోయి ఇంతదూరం వచ్చి ఇక్కడ మునివృత్తితో జీవనం గడపుతున్నాను. నన్ను మళ్లీ అదే విధంగా మాయలేడి రూపంతో రాముని ముందుకు వెళ్ళమంటున్నావు.. మారీచుడు ఆక్రోశించినాడు..

బాగా గమనించి గుర్తుంచుకోవలసిన విషయం ఏమిటంటే, మారీచునికి మాయలేడి రూపంలో తాపస జనములను బాధించుట అలవాటైన విద్య.. ఆ మాయలేడిరూపంలో వంచింపబడి హతులైన వారెందరో ఉన్నారు..


మారీచుని మాయలేడి వ్యవహారం రామునికి తెలియక కాదు.. శరభంగాశ్రమసందర్భంలో దండకారణ్యం ప్రవేశిస్తూ అక్కడి మునులందరికీ రాక్షసబాధల నుండి విముక్తి కలిగిస్తానని ప్రతిజ్ఞ చేసినవాడు శ్రీరాముడు.. ఆ ప్రతిజ్ఞా నిర్వహణం కోసం అవసరమైతే సీతను, లక్ష్మణుని కూడా త్యాగం చేయటానికి సిద్ధమేనని సత్య ధర్మ పరిపాలనాబద్ధుడైన తన కర్తవ్యాన్ని సుస్పష్టంగా ప్రకటించినవాడు శ్రీరాముడు.. బంగారువన్నెచిన్నెలతో, చిత్రవిచిత్రమైన గమనములతో వచ్చినది, అంతకుముందు తనచేతి బాణం దెబ్బనుండి తప్పించుకొని పారిపోయిన మారీచుడే అని కూడా శ్రీరామచంద్రమూర్తికి తెలుసు.. ఆ మాట మారీచుడే స్పష్టము చేసినాడు.. రాములవారికే కాదు.. సీతమ్మవారికి కూడ 'మాయలేడి' సమాచారం తెలియటంలో ఆశ్చర్యం లేదు..



రావణుని ప్రేరేపణ, బెదరింపులతో మాయలేడిగా మారీచుడు సీతారామలక్ష్మణుల ఆశ్రమ ప్రాంతంలో సంచరిస్తుంటే చూసి అనుమానంతో లక్ష్మణుడు అన్నగారికి హెచ్చరికగా

**శంకమానస్తు తం దృష్ట్వా లక్ష్మణో రామమబ్రవీత్**
**తమేవైన మహం మన్యే మారీచం రాక్షసం మృగమ్**
**మృగో హ్యేవంవిధో రత్నవిచిత్రో నాస్తి రాఘవ**
**జగత్యాం జగతీనాథ మాయైషా హి న సంశయః**

(వాల్మీకిరామాయణము: అరణ్య: 43- 4,7)



చిత్రవిచిత్రవర్ణములతో గంధర్వనగరంలాగా మెరిసిపోతున్న దేహకాంతులతో తిరుగుతున్న ఈ జింకను చూస్తే, ఇదొక రాక్షసమాయే అనిపిస్తోంది.. ఇది వాడే.. మాయలేడిగ ఎంతోమందిని మట్టుబెట్టి పొట్టన పెట్టుకున్న ఆ మారీచుడే.. సందేహం లేదు..

ఈ మాటలు వింటున్న సీతమ్మ, లక్ష్మణుని మాటల మధ్యలోనే రాముడిని ఆ లేడిని తీసుకురమ్మని కోరింది..

**ఏవం బ్రువాణం కాకుత్స్థం ప్రతివార్య శుచిస్మితా**
**ఉవాచ సీతా సంహృష్టా చర్మణా హృతచేతనా**
**ఆర్యపుత్రాభిరామో?సౌ మృగో హరతి మే మనః**
**ఆనయైనం మహాబాహో క్రీడార్థం నో భవిష్యతి**

(వాల్మీకిరామాయణము: అరణ్య: 43-8, 9)

ఎందుకు..పై శ్లోకాలలో,

**క్రీడార్థం నో భవిష్యతి**

మనిద్దరికీ వినోదంగా ఉంటుంది.. అన్నది విశేషంగా సంభావించవలసిన వాక్యం.. జరగవలసిన రాక్షససంహారం.. ధర్మస్థాపన.. జరగాలికదా.. అది అమ్మవారి సంకల్పం..

ఇంతకూ తేలిన సత్యమేమిటంటే... మారీచుడు మాయలేడి అన్న విషయం సీతారామలక్ష్మణులకు తెలియనిది కాదు.. అయినా రామచంద్రులవారు మారీచుని అక్కడికక్కడే మట్టుబెట్టక.. వెంబడించి రావణుని పన్నాగం ఫలింపజేయడం ఎందుకంటే... రావణునికవకాశ మీయవలెను కదా.. అప్పుడే రావణాది దుష్టరాక్షస సంహారమునకవకాశము.. ఇది గ్రహింపవలసిన సత్యము.. స్వస్తి.

**- సాంప్రతి సురేంద్రనాథ్**

# నవగ్రహాల అనుగ్రహానికై – శ్లోకమాలిక



కలియుగంలో జీవుల జీవిత గమనాన్ని నియంత్రించేవి నవగ్రహాల సంచారం. తమ ప్రభావాలతో సంచరిస్తూ, కర్మబంధాలతో జీవులను నడిపిస్తాయి. ఈ సత్యాన్ని ప్రాచీన భారతీయ జ్యోతిష్యం చక్కగా వివరించింది. జననమరణ చక్రంలో జీవులు అనుభవించే శుభాశుభ ఫలితాలను గ్రహగతులే అనుగ్రహిస్తాయి. ఇది తరతరాల మానవాళి అనంతవిశ్వాసం. ఈ యుగంలో గ్రహగతులన్నింటికీ అధిపతిగా నిలిచిన ఆశ్రితమందారుడు శ్రీ వేంకటేశ్వర స్వామి. తిరుమల శిఖరాలపై విరాజిల్లే కలియుగ ప్రత్యక్ష దైవం ఒక్కడే, నవగ్రహాల కఠిన ప్రభావాలను సైతం సుగమం చేస్తాడు.

ప్రతిదినం ప్రాతఃకాలంలో, మంగళధ్వనులతో స్వామిని మేల్కొల్పుతారు. ఆ సేవలో వేదవిదులు పఠించే సుప్రభాతం కేవలం శబ్దాల సమాహారం కాదు. ఆ శ్లోకాలన్నీ మంత్రాక్షరాలు. అవి భక్తుల ఎదలో జ్ఞాన దీపాన్ని వెలిగిస్తాయి. దేవతలు, ఋషులు, నవగ్రహాధిపతులు సైతం సుప్రభాతసేవలో భాగస్వాములై, శ్రీనివాసుని సన్నిధిలో నిలిచి తరిస్తున్నారు.

కనుక శ్రీవేంకటేశ్వరస్వామి భక్తులు నిత్యం స్వామివారి సుప్రభాతాన్ని తప్పక పఠించాలి. విశేషించి అందులోని స్తోత్రంలోని ఈ తొమ్మిది శ్లోకాలు నిత్యం పారాయణం చేసే వారికి అజ్ఞానం తొలగుతుంది. కర్మసంచితమైన పాపబంధాలు కరిగిపోతాయి. నవగ్రహాలు అనుకూలమై, ఆయురారోగ్య అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయి.

ఇలా శ్రీ వేంకటేశ్వరుని ద్వారా నవగ్రహాల అనుగ్రహాన్ని పొందాలనుకొనే భక్తులకు కొంగుబంగారం– శ్రీనివాస అను "గ్రహ" నవరత్నాలు. ఈ పుస్తకంలో చక్కగా నవగ్రహ అనుగ్రహ సిద్ధికై, శ్రీవారిని ఆశ్రయించే సంప్రదాయం వివరించబడింది. ఈ చిరు పుస్తకాన్ని రచించిన ప్రసిద్ధ పండితులు బ్రహ్మశ్రీ ఆకెళ్ళ విభీషణ శర్మ. దీనిని అందంగా ముద్రించి ఉచితంగా పంచుతున్న శ్రీవత్స వనమాలి సేవా ఫౌండేషన్, హైదరాబాద్ వారు అభినందనీయులు. ఈ సేవా సంస్థ సనాతన ధర్మమార్గంలో అనేక విధాలుగా సమాజానికి సేవలందిస్తున్నది. ఈ సంస్థ ముద్రాపించిన అక్షరసుమం ఈ పుస్తక ప్రసాదం. ఈ పుస్తకంపై మీ అమూల్యమైన సూచనలు, సలహాలకై సంప్రదించవలసిన మెయిల్ ఐడి: svsf6666@gmail.com మరియు చరవాణి సంఖ్య: 94924–67869.

# అభినవ శంకర విజయం

(గత సంచిక తరువాయి)

శ్రీశ్రీశ్రీ సచ్చిదానంద శివాభినవ నృసింహ భారతీస్వామివారు మొదటి విజయయాత్రలో గోకర్ణక్షేత్రాన్ని సందర్శించారు. 'విశ్వమంతటా వ్యాపించి ఉన్న పరమాత్మ గోకర్ణములో కొలువుతీరి ఉండటం ఆశ్చర్యకరం' అని ప్రారంభించి, "అభంగుర తరంగిత కవితా ప్రసంగా"లతో 'సర్వ మంగళా మహాబలేశ్వర స్తవం' చేశారు. గోకర్ణంలోని మహాబలేశ్వర స్వామిని ప్రస్తుతించే మహత్తరమైన ఈ సంస్కృత స్తోత్రాన్ని శ్రీ లలితాదిత్య అద్భుతరీతిలో అనువదించి అందించారు ఈ కావ్యంలో. మచ్చుకి ఒండు రెండు పద్యాలు చూద్దాం. గోకర్ణం పడమటి సముద్రతీరం. అక్కడ స్వామివారి ఆలయం పశ్చిమ ముఖంగా ఉంటుంది. తూర్పున ఉదయించే సూర్యుడు మహాబలేశ్వరుడిపట్ల భయభక్తులతో స్వామికి వెనుకవైపుగా ఉదయిస్తున్నాడని స్వామివారు చమత్కరించారు.

"భీషోదేతి సూర్యః" అన్న వేదవాక్యానికి వ్యాఖ్యానమా అన్నట్లుగా సాగిన వర్ణన ఇది.

**"పూషయేనియు పశ్చిమోన్ముఖుని యెవని**
**పృష్ఠమున దాగి ఉదయించు భీతుడగుచు**
**నట్టి నీదు మాహాత్మ్యమునభినుతింప**
**మాదుబోంట్ల కలవియే కుమారజనక!"**

అని చేసిన అనువాదం మూలంలోని భావాన్ని చక్కగా ప్రతిఫలింప చేస్తోంది.

**"నక్షత్రమండలిన్ నడిమింట నిలబెట్టి**
**దేశ కాలంబుల త్రిప్పువాడ,**
**సప్తసముద్రముల్ సరిహద్దులన్ త్రెంచి**
**యిలపై బడక నిగ్రహించువాడ,**
**నిఖిలసత్త్వ ప్రాణ నిర్మూలకుండౌ ప**
**రేతరాజును సంహరించువాడ,**
**అష్టమూర్తుల దాల్చి అక్షిత్రయమునుంచి**
**సృష్టిసర్వంబు పోషించువాడ,**
**ప్రాణపంచకాకృతి మహాబలుని సకల**
**చేతనాంగములఁ జరింపఁ జేయువాడ**
**జీవకర్మవ్యవస్థ రక్షించువాడ**
**అవిత నిర్జరేశ! నమో మహా బలేశ!"**

ఇత్యాదిగా మహాబలేశ్వరుని సంస్తుతించి, అక్కడి నుంచి కొల్హాపురికి చేరుకున్నారు స్వామివారు.






మల్లాప్రగడ
శ్రీమన్నారాయణ మూర్తి

కొల్హాపురిలో స్వామివారు చేసిన ప్రార్థనగా

**"లచ్చియె యెల్ల కల్ములకు రాణి, కవుంగిలి గ్రుచ్చు వెన్ను డా**
**లచ్చిని, లచ్చిచేఁ బుడమి క్రాలును బచ్చగ, హెచ్చు నిచ్చు నా**
**లచ్చికి మ్రొక్కులివ్వి, మరి ప్రాపొక టున్నదె లచ్చికంటె, నా**
**లచ్చికి బిడ్డనేను, మది లచ్చినె చేర్చితి, లచ్చి! గావవే!"**

అని ప్రారంభించి, లక్ష్మీ వైభవాన్ని ప్రస్తుతించారు కవి.

సంతానలక్ష్మిగా, ధనలక్ష్మిగా, ధాన్యలక్ష్మిగా, విజయలక్ష్మిగా, ధైర్యలక్ష్మిగా, రాజ్యలక్ష్మిగా...ఇలా వివిధ నామ రూపాలు ధరించి, భక్తులకు సకలాభీష్టాలనూ అనుగ్రహించే కలుముల తల్లిని ప్రార్థించిన తీరు పరమ రమణీయంగా సాగింది.

'బ్రహ్మదేవుడి తల్లిగా, శ్రీహరికి ప్రాణేశ్వరిగా, సముద్రరాజ తనయ'గా లక్ష్మీదేవి ఈ పద్యంలో దర్శన మిస్తోంది. చిత్తగించండి:

**"తనయుల్, సంపద, ధాన్యముల్, విజయముల్, ధైర్యంబు, రాజ్యంబు, యే**
**వనజాతేక్షణ వీక్షణార్థమున సంప్రాప్తించు, నా దేవతన్**
**వనజాతాసన మాత నబ్జనయన ప్రాణేశ్వరిన్ శ్రీపయో**
**వనధిస్వామి యనుంగుకూతు నిదె నిన్ బ్రార్థింతునో భార్గవీ!"**

మరో చమత్కారం:

**"భర్త రామాకృతిం గానబరచినట్టి**
**మహితమైన గోలాంగూలమైత్రి నరసి**

(మిగతా 63వ పేజీలో)

దర్శనమ్
ఆధ్యాత్మిక వార్తామాసపత్రిక

శ్రీ పరాభవ సం॥ దక్షిణాయణం
గ్రీష్మ / వర్ష ఋతువు
ఆషాఢ బ.తదియ - శ్రావణ బ.తదియ

# ఆగస్ట్ AUGUST 2026

ఉ: ఉదయం, మ: మధ్యాహ్నం, సా: సాయంత్రం, రా: రాత్రి, తె: తెల్లవారుఝామున, వ: వర్జ్యము, శే.వ.: శేషవర్జ్యము, ల: నుండి

| | | | | | |
|---|---|---|---|---|---|
| SUN ఆది<br>రాహు కాలం<br>సా. 4.30 మొ 6.00<br>యమగండ కాలం<br>మ. 12.00 మొ 1.30<br>వారదుర్ముహూర్తం<br>సా. 4.24 మొ 5.12 | **30**<br>విదియ ఉ.8.47<br>ఉత్తరాభాద్రరా.తె.4.14<br>వ.మ.1.47ల3.23 | **2**<br>చవితి రా.8.56<br>పూర్వాభాద్ర రా.8.30<br>వర్జ్యంలేదు | **9**<br>ఏకాదశి ఉ.8.29<br>మృగశిర మ.1.23<br>వ.రా.9.12ల10.41 | **16**<br>చవితి సా.6.29<br>ఉత్తర ఉ.6.03<br>వ.మ.2.35ల4.13 | **23**<br>ఏకాదశి రా.3.06<br>మూల సా.5.58<br>వ.సా.4.06ల5.58<br>తి.రా.తె.4.36ల |
| MON సోమ<br>రాహు కాలం<br>ఉ. 7.30 మొ 9.00<br>యమగండ కాలం<br>ఉ. 10.30 మొ 12.00<br>వారదుర్ముహూర్తం<br>మ. 12.24 మొ 1.12<br>మ. 2.48 మొ 3.36 | **31**<br>తదియ ఉ.8.07<br>రేవతి రా.3.54<br>వ.సా.4.04ల5.39 | **3**<br>పంచమి రా.8.08<br>ఉత్తరాభాద్ర రా.8.30<br>వ.ఉ.6.06ల7.42 | **10**<br>ద్వాదశి ఉ.6.00<br>త.త్రయోదశిరా.3.33<br>ఆరుద్ర ఉ.11.43<br>వ.రా.10.55ల12.05 | **17**<br>పంచమి సా.6.25<br>హస్త ఉ.6.26<br>వ.మ.2.39ల4.19 | **24**<br>ద్వాదశి రా.తె.5.03<br>పూర్వాషాఢ రా.8.32<br>శే.వ.ఉ.6.22<br>తి.రా.తె. 5.14ల |
| TUE మంగ<br>రాహు కాలం<br>మ. 3.00 మొ 4.30<br>యమగండ కాలం<br>ఉ. 9.00 మొ 10.30<br>వారదుర్ముహూర్తం<br>ఉ. 8.24 మొ 9.12<br>రా. 10.48 మొ 11.36 | | **4**<br>షష్ఠి సా.6.55<br>రేవతి రా.8.02<br>వ.ఉ.8.16ల9.50 | **11**<br>చతుర్దశి రా.1.14<br>పునర్వసు ఉ.10.06<br>వ.సా.5.33ల7.03 | **18**<br>షష్ఠి సా.6.56<br>చిత్త ఉ.7.20<br>వ.మ.1.11ల2.53 | **25**<br>త్రయోదశి పూర్తి<br>ఉత్తరాషాఢరా.10.53<br>శే.వ.ఉ.6.59ల<br>తి.రా.11.13ల12.49 |
| WED బుధ<br>రాహు కాలం<br>మ. 12.00 మొ 1.30<br>యమగండ కాలం<br>ఉ. 7.30 మొ 9.00<br>వారదుర్ముహూర్తం<br>ఉ. 11.36 మొ 12.24 | | **5**<br>సప్తమి సా.5.21<br>అశ్విని రా.7.12<br>వ.మ.3.16ల4.49 | **12** ●<br>అమావాస్యరా.11.11<br>పుష్యమి ఉ.8.42<br>వ.రా.8.48ల10.19 | **19**<br>సప్తమి రా.7.50<br>స్వాతి ఉ.8.44<br>వ.మ.2.41ల4.25 | **26**<br>త్రయోదశి ఉ.6.39<br>శ్రవణం రా.12.53<br>వ.రా.తె.5.14ల |
| THU గురు<br>రాహు కాలం<br>మ. 1.30 మొ 3.00<br>యమగండ కాలం<br>ఉ. 6.00 మొ 7.30<br>వారదుర్ముహూర్తం<br>ఉ. 10.00 మొ 10.48<br>మ. 2.48 మొ 3.36 | | **6**<br>అష్టమి మ.3.26<br>భరణి సా.6.03<br>వ.రా.తె.4.20ల5.51 | శ్రావణం **13**<br>శు.పాడ్యమి రా.9.58<br>ఆశ్లేష ఉ.7.31<br>వ.రా.7.05ల8.37 | **20**<br>అష్టమి రా.9.17<br>విశాఖ ఉ.10.38<br>వ.మ.3.05ల4.50 | **27**<br>చతుర్దశి ఉ.7.55<br>ధనిష్ట రా.2.28<br>శే.వ.ఉ.6.56 |
| FRI శుక్ర<br>రాహు కాలం<br>ఉ. 10.30 మొ 12.00<br>యమగండ కాలం<br>మ. 3.00 మొ 4.30<br>వారదుర్ముహూర్తం<br>ఉ. 8.24 మొ 9.12<br>మ. 12.24 మొ 1.12 | | **7**<br>నవమి మ.1.16<br>కృత్తిక సా.4.38<br>వ.రా.తె.5.21ల | **14**<br>విదియ రా.8.02<br>మఘ ఉ.6.38<br>వ.మ.2.23ల3.57 | **21**<br>నవమి రా.10.59<br>అనూరాధమ.12.48<br>వ.సా.6.54ల8.40 | **28** ○<br>పూర్ణిమ ఉ.8.44<br>శతభిషం రా.3.36<br>వ.ఉ.10.00ల11.41 |
| SAT శని<br>రాహు కాలం<br>ఉ. 9.00 మొ 10.30<br>యమగండ కాలం<br>మ. 1.30 మొ 3.00<br>వారదుర్ముహూర్తం<br>ఉ. 6.00 మొ 7.36 | ఆషాఢం **1**<br>బ.తదియ రా.9.11<br>శతభిషం రా.8.01<br>వ.రా.2.38ల4.16 | **8**<br>దశమి ఉ.10.56<br>రోహిణి మ.3.03<br>శే.వ.ఉ.6.51<br>తి.రా.8.11ల9.40 | **15**<br>తదియ రా.7.02<br>పుబ్బ ఉ.6.07<br>వ.మ.1.18ల2.54 | **22**<br>దశమి రా.1.01<br>జ్యేష్ఠ మ.3.20<br>వర్జ్యంలేదు | శ్రావణం **29**<br>బ.పాడ్యమి ఉ.9.00<br>పూర్వాభాద్రరా.తె.4.09<br>వ.ఉ.10.14ల11.52 |

## పండుగలు

2 సంకష్టహరచతుర్థి
సికింద్రాబాద్‌బోనాలు
4 ఆశ్లేషకార్తి
9 సర్వేషాం ఏకాదశి
హైదరాబాద్‌బోనాలు
11 మాసశివరాత్రి
12 చుక్కలఅమావాస్య
15 స్వాతంత్ర్యదినోత్సవం
16 నాగులచవితి
17 సింహసంక్రమణం
గరుడ,నాగ పంచమి
18 మఖకార్తి
21 శ్రీవరలక్ష్మీవ్రతం
23 సర్వేషాంఏకాదశి
26 ఋగ్వేద ఉపాకర్మ
మిలాద్‌ఉన్‌నబి
28 యజుర్వేద ఉపాకర్మ
రాఖీపూర్ణిమ
శ్రీహయగ్రీవజయంతి
30 పుబ్బకార్తి
31 సంకష్టహరచతుర్థి

| తేది | సూ.ఉ. | సూ.అ. |
|---|---|---|
| 1 | 5.56 | 6.50 |
| 5 | 5.57 | 6.48 |
| 10 | 5.58 | 6.45 |
| 15 | 5.59 | 6.42 |
| 20 | 6.00 | 6.39 |
| 25 | 6.01 | 6.36 |
| 30 | 6.02 | 6.32 |

## మీ కోసం...

1. ..........
2. ..........
3. ..........
4. ..........
5. ..........
6. ..........
7. ..........
8. ..........
9. ..........
10. ..........
11. ..........
12. ..........
13. ..........
14. ..........
15. ..........
16. ..........
17. ..........
18. ..........
19. ..........
20. ..........
21. ..........
22. ..........
23. ..........
24. ..........
25. ..........
26. ..........
27. ..........
28. ..........
29. ..........
30. ..........
31. ..........

(గత సంచిక తరువాయి)

మహేశ్వరీ - మహాకాళీ - మహాగ్రాసా - మహాశనా
అపర్ణా - చండికా - చండముండాసుర నిషూదినీ 145
క్షరాక్షరాత్మికా - సర్వలోకేశీ - విశ్వధారిణీ
త్రివర్గదాత్రీ - సుభగా - త్ర్యంబకా - త్రిగుణాత్మికా 146
స్వర్గాపవర్గదా - శుద్ధా - జపాపుష్ప నిభాకృతిః
ఓజోవతీ - ద్యుతిధరా - యజ్ఞరూపా - ప్రియవ్రతా 147
దురారాధ్యా - దురాధర్షా - పాటలీ కుసుమ ప్రియా
మహతీ - మేరునిలయా - మందార కుసుమ ప్రియా 148
వీరారాధ్యా - విరాడ్రూపా - విరజా - విశ్వతోముఖీ
ప్రత్యగ్రూపా - పరాకాశా - ప్రాణదా - ప్రాణరూపిణీ 149
మార్తాండభైరవారాధ్యా - మంత్రిణీ న్యస్త రాజ్యధూః
త్రిపురేశీ - జయత్సేనా - నిస్త్రైగుణ్యా - పరాపరా 150
సత్యజ్ఞానానందరూపా - సామరస్య పరాయణా
కపర్దినీ - కళామాలా - కామధుక్కామ రూపిణీ 151
కళానిధిః - కావ్యకళా - రసజ్ఞా - రసశేవధిః
పుష్టా - పురాతనా - పూజ్యా - పుష్కరా - పుష్కరేక్షణా 152

అంతర్ముఖ సమారాధ్యా - బహిర్ముఖ సుదుర్లభా 162
త్రయీ - త్రివర్గనిలయా - త్రిస్థా - త్రిపురమాలినీ
నిరామయా - నిరాలంబా - స్వాత్మారామా -సుధాసృతిః 163
సంసార పంక నిర్మగ్న సముద్ధరణ పండితా
యజ్ఞప్రియా - యజ్ఞకర్త్రీ - యజమాన స్వరూపిణీ 164
ధర్మాధారా - ధనాధ్యక్షా - ధనధాన్య వివర్ధినీ
విప్రప్రియా - విప్రరూపా - విశ్వభ్రమణ కారిణీ 165
విశ్వగ్రాసా - విద్రుమాభా - వైష్ణవీ - విష్ణురూపిణీ
అయోనిర్ - యోనినిలయా - కూటస్థా -కులరూపిణీ 166
వీరగోష్ఠీ ప్రియా - వీరా - నైష్కర్మ్యా - నాద రూపిణీ
విజ్ఞాన కలనా - కల్యా - విదగ్ధా - బైందవాసనా 167
తత్త్వాధికా - తత్త్వమయీ - తత్త్వమర్థ స్వరూపిణీ
సామగానప్రియా - సౌమ్యా - సదాశివ కుటుంబినీ 168
సవ్యాపసవ్యమార్గస్థా - సర్వాపద్వినివారిణి
స్వస్థా - స్వభావ మధురా - ధీరా - ధీరసమర్చితా 169
చైతన్యార్ఘ్య సమారాధ్యా - చైతన్య కుసుమ ప్రియా
సదోదితా - సదాతుష్టా - తరుణాదిత్య పాటలా 170

# లలితా సహస్రనామ స్తోత్రం

పరంజ్యోతిః - పరంధామ - పరమాణుః - పరాత్పరా
పాశహస్తా - పాశహంత్రీ - పరమంత్ర విభేదినీ 153
మూర్తామూర్తా - నిత్యతృప్తా -మునిమానస హంసికా
సత్యవ్రతా - సత్యరూపా - సర్వాంతర్యామినీ సతీ 154
బ్రహ్మాణీ - బ్రహ్మజననీ - బహురూపా - బుధార్చితా
ప్రసవిత్రీ - ప్రచండాజ్ఞా - ప్రతిష్ఠా - ప్రకటాకృతిః 155
ప్రాణేశ్వరీ - ప్రాణదాత్రీ - పంచాశత్పీఠ రూపిణీ
విశృంఖలా - వివిక్తస్థా - వీరమాతా - వియత్ప్రసూః 156
ముకుందా - ముక్తినిలయా - మూలవిగ్రహ రూపిణీ
భావజ్ఞా - భావరోగఘ్నీ - భవచక్ర ప్రవర్తినీ 157
ఛందస్సారా - శాస్త్రసారా - మంత్రసారా - తలోదరీ
ఉదారకీర్తి - రుద్దామ వైభవా - వర్ణ రూపిణీ 158
జన్మ మృత్యు జరా తప్త జన విశ్రాంతి దాయినీ
సర్వోపనిషదుద్ఘుష్టా - శాంత్యతీత కళాత్మికా 159
గంభీరా - గగనాంతస్థా - గర్వితా - గానలోలుపా
కల్పనారహితా - కాష్ఠా -కాంతా -కాంతార్ధ విగ్రహా 160
కార్యకారణ నిర్ముక్తా - కామకేళి తరంగితా
కనత్కనక తాటంకా - లీలావిగ్రహ ధారిణీ 161
అజాక్షయ వినిర్ముక్తా - ముగ్ధా క్షిప్ర ప్రసాదినీ



దక్షిణా - దక్షిణారాధ్యా - దరస్మేర ముఖాంబుజా
కౌలినీ - కేవలా - అనర్ఘ్య కైవల్య పదదాయినీ 171
స్తోత్రప్రియా - స్తుతిమతీ - శ్రుతిసంస్తుత వైభవా
మనస్వినీ - మానవతీ - మహేశీ - మంగళాకృతిః 172
విశ్వమాతా - జగద్ధాత్రీ - విశాలాక్షీ - విరాగిణీ
ప్రగల్భా - పరమోదారా - పరామోదా - మనోమయీ 173
వ్యోమకేశీ - విమానస్థా - వజ్రిణీ - వామకేశ్వరీ
పంచయజ్ఞప్రియా - పంచప్రేత మంచాధిశాయినీ 174
పంచమీ - పంచభూతేశీ - పంచసంఖ్యోపచారిణీ
శాశ్వతీ - శాశ్వతైశ్వర్యా - శర్మదా - శంభు మోహినీ 175
ధరాధరసుతా - ధన్యా - ధర్మిణీ - ధర్మవర్ధినీ
లోకాతీతా - గుణాతీతా - సర్వాతీతా - శమాత్మికా 176
బంధూక కుసుమ ప్రఖ్యా - బాలా - లీలా వినోదినీ
సుమంగళీ - సుఖకరీ - సువేషాఢ్యా - సువాసినీ 177
సువాసిన్యర్చన ప్రీతా - శోభనా - శుద్ధ మానసా
బిందు తర్పణ సంతుష్టా - పూర్వజా - త్రిపురాంబికా 178
దశముద్రా సమారాధ్యా - త్రిపురాశ్రీ వశంకరీ
జ్ఞానముద్రా - జ్ఞానగమ్యా - జ్ఞాన జ్ఞేయ స్వరూపిణీ 179



యోనిముద్రా - త్రిఖండేశీ - త్రిగుణాంబా - త్రికోణగా
అనఘాద్భుత చారిత్రా - వాంఛితార్థ ప్రదాయినీ 180
అభ్యాసాతిశయజ్ఞాతా - షడధ్వాతీతరూపిణీ
అవ్యాజకరుణామూర్తి - రజ్ఞానధ్వాంత దీపికా 181
ఆబాలగోపవిదితా - సర్వానుల్లంఘ్యశాసనా
శ్రీచక్రరాజ నిలయా - శ్రీమత్త్రిపురసుందరీ 182
శ్రీశివా - శివశక్త్యైక్య రూపిణీ - లలితాంబికా
ఏవం శ్రీ లలితా దేవ్యాః నామ్నాం సాహస్రకం జగుః 183 ■



ఆచార్య కుప్పా విజయశ్రీ

అద్భుతమైన స్తోత్ర సంపద, ఇప్పుడు మీకు అందుబాటులో ఈ వెబ్‌సైట్ లో !!

stotranidhi.com
తెలుగు | ಕನ್ನಡ | தமிழ் | देवनागरी | english

★ దేవ, ఋషి ప్రోక్త స్తోత్రములు
★ మహా మహిమాన్వితమైన స్తోత్రములు
★ అరుదుగా లభించే విశేష స్తుతులు
★ పూజా విధానములు, వ్రతములు
★ అష్టోత్తరములు, సహస్రనామములు
★ స్వరసహిత వేద సూక్తములు
★ సంధ్యావందనం, సుందరకాండ
★ శ్రీమద్భగవద్గీత, దుర్గా సప్తశతీ
★ కీర్తనలు, మంగళ హారతులు
★ ... ఇంకా ఎన్నెన్నో !!

www.stotranidhi.com



Scan this QR code to visit website


పూజా కార్యక్రమాలలో, పండుగ రోజులలో, ఆలయాలలో మరియు మీ దైవకార్యాలలో పఠించండి, తరించండి !!

Email: stotranidhi@gmail.com /stotranidhi Download on the App Store GET IT ON Google Play

**అజ్ఞానాదేవ సంసారో జ్ఞానాదేవ విముచ్యతే**
**జ్ఞానస్వరూపమేవాదౌ జ్ఞానం జ్ఞేయైక సాధనమ్**

మానవులకు అజ్ఞానము వల్లనే మంచి ఆలోచనలు కలుగుట లేదు. జ్ఞానము ద్వారానే సమస్యలను అధిగమించ వచ్చును. అందుచేత జ్ఞానము ద్వారా జ్ఞేయము (తెలుసు కోవలసినది) పొందవలెను. అన్న యోగతత్త్వోపనిషత్ వాక్యమును రచయిత టాగ్ లైన్‌గా గ్రహించి, బహుకాల పరిశ్రమతో ఈ గ్రంథం వెలువరించారు.

కర్మ-జ్యోతిష-ధర్మ ప్రకరణాలని ప్రకరణత్రయంగా సాగిన ఈ గ్రంథం బహుశాస్త్ర సమన్వయంతో సరళమైన భాషలో సాగింది. ఉపనిషత్తులు మహాభారతం, భగవద్గీత, నీతి బోధక శతకాల ఆధారంగా దైనందిన జీవితంలో ఉపయోగపడే అనేక విషయాలు వివరించారు. ఈ విషయాల్లో ఏ కొన్ని ఆచరించ గలిగినా అభ్యుదయ, శ్రేయస్సులను పొందగలరనటం నిస్సందేహం.




గ్రంథాలనుంచి ఎన్నో ఉదాహరణలు చూపారు. జ్యోతిష శాస్త్రము లోని అనేక షయాలు కర్మ సిద్ధాంతం పై ఆధారపడినవే అని చెప్పటం విలక్షణ అంశం.

శృంగార శాస్త్రము గురించి విపులంగానే పరిశీలించి చర్చించారు. సంగీతము నాట్యము వలెనె శృంగారము కూడా ఒక శాస్త్రము. ఈకళలో నిపుణతకు కళాత్మక సృజనాత్మక భావనలు, నేర్పరితనం అవసరము. ఇది ఒక ఒక ఋణానుబంధము, ఒక ప్రారబ్ద కర్మ. ఈ శాస్త్రము కేవలం స్త్రీపురుషుల కలయిక గురించి మాత్రమే కాదు. భార్యాభర్త లిరువురు నేను వేరు నువ్వు వేరు అను అద్వైత భావము నుండి మనము ఒకటి అను ద్వైత భావానికి చేరటమే

# సామాజిక, కౌటుంబిక, ఆధ్యాత్మిక సమస్యలకు పరిష్కార గ్రంథం

కాల ప్రభావం చేత ఆచార సాంప్రదాయాలు, వేషభాషలు మారిపోయాయి. ప్రపంచీకరణ వచ్చిపడి ఈ ప్రక్రియ మరింత ప్రగాఢంగా, వేగవంతంగా జరిగి పోతున్నది. ఈ సంప్రదాయ వేషభాషాది విషయాలు నేర్చుకునే మొదటి మెట్టు కుటుంబమే! ఈ కుటుంబ వ్యవస్థే (ముఖ్యంగా సమిష్టి కుటుంబాలు) విచ్చిన్నం అవుతూ ఉండటం ఆధునిక కాలపు విషాదం. వివరించి సవరించవలసిన పెద్దలకే విషయపరిజ్ఞానం మృగ్యమవుతుంటే ఇక పిల్లకేం చెపుతారు? ఈ దృక్కోణంలో కూడా రచయిత అనేక సూచనలు చేశారు. ఈనాడు మన సమాజంలో ఉనికిని కోల్పోతున్న అనేక సామాజిక, కౌటుంబిక, ఆధ్యాత్మిక సమస్యలకు పరిష్కారం సూచిస్తుందీ గ్రంథం.

జ్యోతిష శాస్త్రంలో ఫలానా గ్రహదశ వల్ల ఈ నష్టం, ఈవిధమైన కష్టం కలుగుతుందని చెప్పి భయపెట్టటం నేటి కమర్షియల్ జ్యోతిష్కులకు పరిపాటి. వాసిష్ఠగారు వాటికి పరిహారాలు, నివారణోపాయాలు,చెప్పి దుష్ఫలితాలు పూర్తిగా కాకపోయినా, వాటి తీవ్రత తగ్గించుకొని సుఖజీవనాన్ని పొందవచ్చునని తెలిపిన తీరు ప్రశంసనీయం.

యథాకర్మ తథా ఫలమ్, కర్మ జీవనస్య ఆధారః అనీ, వ్రాతవెంట గాని,వరమీడు దైవంబు, సేత కొలది గాని వ్రాత కాదు అంటూ కర్మ సిద్ధాంతం గురించి సంద ర్భానుసారం పలురకాలుగా వివరించారు. భగవద్గీత, భాగవతం వంటి శృంగారము యొక్క ముఖ్య తత్త్వము, సృష్టి లక్షణము.

శృంగార పరమైన చర్యలో పురుషుని పాత్ర ఎక్కువ, అందుచే ముందుగా స్త్రీ మనస్సును, శరీరతత్త్వమును, నిర్మాణమును అర్థం చేసుకోవాలి. ఈ చర్యలో అసంతృప్తికి కామశాస్త్ర పరిజ్ఞానము, లేకుండుట, బుద్ధి మనస్సుల సమన్వయ లోపము (బుధ చంద్రుల కారకత్వము) అని ముగించారు. ఇది నేటి యువకులు తప్పనిసరిగా ఆలోచించి ఆచరించదగినది.

భారతీయత జీర్ణించుకున్న ఈ సత్యాన్వేషి లోని ఆసక్తి, పరిశోధనా దృష్టి, అనుభవం, రచనా సామర్థ్యం గణనీయమైనవి. ఒక తపస్విలా సంప్రదాయాన్నీ సంస్కృతిని శ్వాసిస్తూ చేసిన రచన. మహాభారతము, చాణక్యనీతి, మనుస్మృతి, వేమన భర్తృహరి వంటి మహనీయులు జీవితాన్ని తీర్చి దిద్దుకొనుటకు ఉపయోగ పడులాగున చెప్పిన, కాలపరిమితి లేని సమకాలీనత కనిపించే ఆణిముత్యాలను ఏరి కోరి అందించి మహోపకారం చేశారు.

అయితే ఈ గ్రంథాలలో కొన్ని ధర్మసుక్ష్మాలు,నీతి వాక్యాలు ,సుభాషితాలు మున్నగునవి నేటి కాలమాన పరిస్థితులకు అంగీకారం కాకపోవచ్చు.(మనుస్మృతిని నిరసిస్తున్నట్టు) పెరిగిన అక్షరాస్యత, స్త్రీ సాధికారత, సోషల్ మీడియా సాంకేతికత, వంటివి అందరకు అందుబాటులోకొచ్చిన వి కనుక, పై వాటిలో

కొన్ని సాధించాం. ప్రత్యేకముగా నీతి నియమాలు, ధర్మ బోధలు చేసే అగత్యము తగ్గినది. అయినను ఆనాటి కట్టుబాట్లు, అనుసరించిన నీతినియమాలు, వాటి నేపథ్యం తెలుసుకో దగినవని చేర్చటం జరిగినట్లున్నది.

దైనందిన జీవితంలో పాటించ దగు ఆచారాలు, రోగ ములకు చిట్కాలు, శ్వాస, స్పర్శ, వివాహ పద్ధతి, నిత్య పూజా విధానం, ముహూర్త నిర్ణయం, ఆగామి సంచిత ప్రారబ్ద కర్మలు, చలన చిత్రములు, పితృకర్మలు, మహాలయ పక్షముల విశిష్టత, దానములు, ధర్మాచరణ, ఇలా ఎన్నెన్నో విషయాలు స్పృసిస్తూ సాగిన బృహద్గ్రంథం.

శాస్త్రములు అనంతములు, కాలం స్వల్పము, విఘ్నాలు ఎక్కువ, అందువల్ల శాస్త్రముల సారమును గ్రహించవలెనని చాణక్య ఉవాచ. అట్టి సారము సులభముగా గ్రహించుటకు ఇలాంటి గ్రంథాలు ఎంతగానో ఉపకరిస్తాయి. సంప్రదాయానికి ఆధ్యాత్మిక తత్త్వానికి సంబంధించిన సంశయాలు ఈ గ్రంథ పఠనం వల్ల తీరుతాయి అని శ్రీ సిద్ధేశ్వరానంద భారతీ స్వామి వారన్నమాట అక్షర సత్యం.

"ధర్మాచరణ వల్లనే అర్థ,కామ, మోక్షములు లభించును. నేను రెండు చేతులెత్తి అదే విషయమును పదేపదే చెప్పుచున్నాను. కాని నా మాటను ఎవ్వరూ వినుటలేదు."- అని వ్యాసమహర్షి భారతములో వెలిబుచ్చిన ఆవేదన ఫలశ్రుతిగా చెప్పుకున్నారు!

వ్యాసుని నాటి నుండి ఈ ఆవేదన నేటికీ కొనసాగుతూనే ఉండటం విజ్ఞులందరూ ఆలోచించవలసిన విషయం.

**సర్వనాశే సముత్పన్నే అర్థం త్యజతి పండితః**
**అర్థేన కురుతే కార్యం సర్వ నాశో న జాయతే**

ఇది బహుభాషా కోవిదుడు, పండితుడు పి.వి. నరసింహారావుగారు ఆర్థిక సంస్కరణలను సమర్థిస్తూ చెప్పిన శ్లోకం. పూర్తిగా నాశనమవుతున్న పరిస్థితులలో సగ భాగము పోగొట్టుకున్నా మిగిలిన సగభాగము కాపాడుకొనుట విజ్ఞత అని వారి మాట, ఇంతవరకు తెలిసీ తెలియక చేసిన ఎన్నో అకర్మలను సరిచేసుకో వచ్చునని అన్వయిస్తూ రచయిత ముక్తాయింపు చెప్పటం అర్థవంతంగా ఉంది.

వాసిష్ఠ గారి గ్రంథం ఓ సారి చదివి పక్కనపెట్టేది కాదు. పదేపదే చదివి మననం చేసుకోవలసిన జీవిత కరదీపిక! ఆంధ్ర పాఠక లోకానికి మహోపకారం చేస్తుందనటంలో అతిశయోక్తి లేదు.

**- శివనాథ శిరోమణి**

**జ్ఞానము - జ్ఞేయము**
**రచన : వాసిష్ఠ**
ప్రతులకు : డా. ఏనుగు శివరామప్రసాద్
హైదరాబాద్, ఫోన్ : 63000 36103
ఆరవేటి వేంకటసుబ్బయ్య
హైదరాబాద్, ఫోన్ : 63095 57391

---

**58వ పేజీ తరువాయి... అభినవ శంకర విజయం...**

**యదియ గోపృష్ఠమందుండె నను చు నీవు**
**నందె వసియించినావటే యిందు భగిని!"**

అన్నారు కవి.

గో పుచ్ఛం లక్ష్మీ నివాసమని మన సంప్రదాయం వివరిస్తోంది. 'గో లాంగూలము' అంటే ఆవు తోక. అది గోపుచ్ఛం. అయితే, 'గోలాంగూలము' అంటే వానరుడు.

"శ్రీ మహావిష్ణువు రామావతారం ధరించినప్పుడు వానరులతో లభించిన మైత్రీబంధాన్ని గమనించి 'గోపుచ్ఛం' తన నివాసంగా లక్ష్మీదేవి ఎన్నుకున్న" దనటం చక్కని ఉత్ప్రేక్ష.

ఈ సందర్భంగా లక్ష్మీదేవికి స్వామివారి విన్నపంగా శ్రీ లలితాదిత్య రచించిన పద్యాలు ప్రస్తుత సమాజ స్థితిగతులపట్ల కవికి గల ఆవేదననూ, అవగాహననూ చాటుతున్నాయి.

**"అన్నెము పున్నెముం దెలియనట్టి అమాయకులన్, మదాంధ సం**
**పన్నులచేత చిక్కి పరిభావమునందెడి దీనులన్, క్షుధాక్షుణ్ణకృశాంగులం**
**గరుణఁ జూచుచు యోగము క్షేమ మిచ్చుచున్**
**మన్నన సేయవే భువనమాత! త్వదీయ కనిష్ఠ పుత్రులన్"**

అని దీనజనులను కరుణించవలసిందిగా లక్ష్మీదేవిని ప్రార్థించారు కవి.

'ఆకాశ గంగ భూమికి దిగివచ్చిన ఈ దేశం'లో ప్రజలు అన్నార్తులై ఆక్రందిస్తే, అన్నపూర్ణగా వచ్చి ఆదుకుంటున్న లక్ష్మీదేవిని కీర్తించారు కవి.

అంతే కాదు, 'అనంతమైన ఈ దేశ సంపద' అంటే ఏమిటో తెలియచెప్పి, అలాంటి మన సంస్కృతిసంపదను సంరక్షించ వలసిందిగా సంపదల తల్లికి విన్నవించటం విలక్షణంగా, విశిష్టంగా, పరమార్థ ప్రబోధకంగా ఉన్నది.

**"వేదాంతంబులు, వైదిక క్రతువులున్, విద్యా వివేకంబు, ల**
**త్యౌదార్యంబు, పతివ్రతాగుణము, దేవాచార్యులన్ భక్తియున్,**
**వేదశ్రద్ధయు, క్షాంతి, భూతదయ, దోర్వీర్యంబు మున్నైన మా**
**యీ దేశంపు టనంత సంపదల రక్షింపంగదే! యిందిరా!"**

అని లక్ష్మీదేవికి విన్నవించారు స్వామివారి ప్రతినిధిగా శ్రీ లలితాదిత్య కవి. (సశేషం)

# మీ రాశి




**మేషం** (అశ్వని 4 పాదాలు, భరణి 4 పాదాలు, కృత్తిక 1వ పాదం)

నూతన కార్యాలకు చక్కని రూపకల్పన చేస్తారు. ఆకస్మిక ధనలాభముంటుంది. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా ఉంటుంది. బంధు, మిత్రులతో కలిసి విందులు, వినోదాల్లో పాల్గొంటారు. శుభవార్తలు వింటారు. మనోల్లాసాన్ని పొంది, ఆనందంగా కాలక్షేపం చేస్తారు. గొప్పవారి పరిచయం ఏర్పడుతుంది. స్త్రీల మూలకంగా లాభం వుంటుంది. మంచి ఆలోచనలను కలిగివుంటారు. బంధు, మిత్రులు గౌరవిస్తారు. కుటుంబసౌఖ్యం సంపూర్ణంగా పొందుతారు. సత్కార్యాల్లో పాల్గొంటారు.




**వృషభం** (కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి 4 పాదాలు, మృగశిర 1,2 పాదాలు)

బంధు, మిత్రులతో విరోధమేర్పడ కుండా జాగ్రత్త పడుట మంచిది. ఆర్థిక ఇబ్బందుల నెదుర్కొంటారు. స్వల్ప అనారోగ్యబాధలుంటాయి. వృత్తి, ఉద్యోగరంగంలో అభివృద్ధి ఉంటుంది. మానసికాందోళనతో కాలం గడుస్తుంది. ప్రయత్నలోపం లేకున్నా పనులు పూర్తిచేసుకోలేక పోతారు. ప్రయత్నకార్యాలందు దిగ్విజయాన్ని పొందుతారు. ఆకస్మిక ధనలాభముంటుంది. కుటుంబం అంతా సంతోషంగా కాలక్షేపం చేస్తారు. ఒక ముఖ్యమైన పని పూర్తికావడంతో మిక్కిలి ఆనందిస్తారు. కీర్తి, ప్రతిష్ఠలు పొందుతారు.




**మిథునం**(మృగశిర 3,4 పాదాలు, ఆరుద్ర 4 పాదాలు, పునర్వసు 1,2,3 పాదాలు)

తోటివారితో విరోధ మేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది. వ్యాపార మూలకంగా ధననష్టం కలిగే అవకాశాలున్నాయి. వృధా ప్రయాణాలెక్కువ చేస్తారు. కుటుంబ విషయాలందు అనాసక్తితో వుంటారు. స్త్రీలు విశ్రాంతి తీసుకోవడం అవసరం. తలచిన కార్యాలకు ఆటంకాలెదురవు తాయి. స్థిరాస్తులకు సంబంధించిన సమస్యల్లో జాగ్రత్తగా నుండుట మంచిది. మోస పోయే అవకాశాలుంటాయి. ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా మారుతుంది. నూతన కార్యాలు ప్రారంభించ రాదు. ప్రయాణా లెక్కువ చేస్తారు.




**కర్కాటకం** (పునర్వసు 4వ పాదం, పుష్యమి 4 పాదాలు, ఆశ్లేష 4 పాదాలు)

మానసికాందోళనతో కాలం గడుస్తుంది. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ వహించక తప్పదు. ప్రయత్నకార్యాలు ఆలస్యంగా సఫలమవుతాయి. చెడుపనులకు దూరంగా నుండుట మంచిది. వృత్తి ఉద్యోగరంగాల్లో అభివృద్ధి ఉంటుంది. స్థిరాస్తులకు సంబంధించిన విషయాల్లో జాగ్రత్త అవసరం. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా నుంటాయి. ఆకస్మిక ధనలాభంతో ఋణ బాధలు తొలగిపోతాయి. సమాజంలో మంచి పేరు సంపాదిస్తారు. ఇతరులు మిమ్మల్ని ఆదర్శంగా తీసుకొనుటకు కృషి చేస్తారు.



**సింహం** (మఖ 4 పాదాలు, పుబ్బ 4 పాదాలు, ఉత్తర 1వ పాదం)


ప్రయత్నం మేరకు స్వల్పలాభముంటుంది. వృథా ప్రయాణాలెక్కువ చేస్తారు. వ్యాపార రంగంలో లాభాయింటాయి. ఋణ ప్రయత్నాలు చేయవలసి వస్తుంది. నూతన కార్యాలకు శ్రీకారం చుడతారు. బంధు, మిత్రుల సహకారం ఆలస్యంగా లభిస్తుంది. తరచూ ప్రయాణాలు చేయాల్సి వస్తుంది. అకాల భోజనం వల్ల ఆరోగ్యం చెడిపోతుంది. చిన్న విషయాల్లో మానసికాం దోళన చెందుతారు. వృత్తిరీత్యా జాగ్రత్తగా నుండుట మంచిది. సహనం అన్నివిధాలా శ్రేయస్కరం. ఆవేశం వల్ల కొన్ని పనులు చెడిపోతాయి. ప్రయత్నం మేరకు స్వల్పలాభముంటుంది.



**కన్య** (ఉత్తర 2,3,4 పాదాలు, హస్త 4 పాదాలు, చిత్త 1,2 పాదాలు)


ప్రయాణాల్లో వ్యయ ప్రయాసలు అధికమవుతాయి. ఆకస్మిక ధననష్టమేర్పడ కుండా జాగ్రత్త వహించుట మంచిది. అనారోగ్య బాధలు తొలగుటకు డబ్బు ఎక్కువ ఖర్చుచేస్తారు. తీర్థయాత్రకు ప్రయత్నిస్తారు. దైవదర్శనం ఉంటుంది. స్త్రీలు మనోల్లాసాన్ని పొందుతారు. ఆకస్మిక ధనలాభముముంటుంది. కుటుంబంలో ఆనందోత్సాహాలు లభిస్తాయి. బంధు, మిత్రులతో కలుస్తారు. సమాజంలో గౌరవం లభిస్తుంది. సంపూర్ణ ఆరోగ్యవంతులుగా

నుంటారు. ప్రతివిషయంలో అభివృద్ధి ఉంటుంది. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు. ప్రయాణాల్లో వ్యయ ప్రయాసలు అధికమవుతాయి.




**తుల** (చిత్త 3,4 పాదాలు, స్వాతి 4 పాదాలు, విశాఖ 1,2,3 పాదాలు)

ఆకస్మిక ధనలాభముంది. రాజకీయ రంగంలోనివారికి, క్రీడాకారులకు అద్భుతమైన అవకాశాలు లభించును. అన్నింటా విజయాన్నే సాధిస్తారు. బంధు, మిత్రులు కలుస్తారు. శుభవార్తలు వింటారు. వృత్తి, ఉద్యోగ రంగాల్లోనివారికి అభివృద్ధి ఉంటుంది. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. ఆకస్మిక ధననష్టం కలిగే అవకాశం ఉంటుంది. వృధా ప్రయాణాలెక్కువ చేస్తారు. బంధు, మిత్రులతో కలహించుకోకుండా జాగ్రత్తగా నుండుట మంచిది. వృత్తి, ఉద్యోగరంగాల్లో సహనం వహించక తప్పదు. మనస్తాపానికి గురి అవుతారు.



**వృశ్చికం** (విశాఖ 4వ పాదం, అనూరాధ 4 పాదాలు, జ్యేష్ఠ 4 పాదాలు)

బంధు, మిత్రులతో జాగ్రత్తగా నుండుట మంచిది. చేసేపనులలో ఇబ్బందులుండును. క్రొత్త పనులను ప్రారంభించుట మంచిదికాదు. గృహంలో జరిగే మార్పులవల్ల ఆందోళన చెందుదురు. ప్రయాణాల్లో జాగ్రత్త అవసరం. మీ మంచి ప్రవర్తనను ఇతరులు ఆదర్శంగా తీసుకుంటారు. ప్రయత్న కార్యాలన్నింటిలో విజయాన్ని సాధిస్తారు. దైవదర్శనం చేసుకుంటారు. స్థిరాస్తులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించుకుంటారు. కళలందు ఆసక్తి పెరుగుతుంది. నూతన, వస్తు, వస్త్ర ఆభరణాలను పొందుతారు. నూతనకార్యాలు ఆలస్యంగా ప్రారంభిస్తారు.



**ధనుస్సు** (మూల 4 పాదాలు, పూర్వాషాఢ 4 పాదాలు, ఉత్తరాషాఢ 1వ పాదం)

ఆకస్మిక ధనలాభముంటుంది. నూతన వస్తు, ఆభరణాలను పొందుతారు. కీర్తి, ప్రతిష్ఠలు పెరుగుతాయి. కుటుంబ సభ్యులతో సంతోషంగా కాలక్షేపం చేస్తారు. ఇతరులకు ఉపకారం చేయుటకు వెనుకాడరు. ఋణబాధలు తొలగిపోతాయి. శత్రుబాధలుండవు. అనారోగ్య బాధలతో సతమతమవు తారు. స్థానచలన సూచనలుంటాయి. నూతన వ్యక్తులు కలుస్తారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా నుండక మానసికాందోళన చెందుతారు. గృహంలో మార్పులు కోరుకుంటారు. ఆర్థిక ఇబ్బందులు దూరమవుతాయి. సంపూర్ణ ఆరోగ్యవంతులుగా నుంటారు.




**మకరం** (ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం 4 పాదాలు, ధనిష్ఠ 1,2 పాదాలు)

రాజకీయ వ్యవహారాల్లో దిగ్విజయాన్ని పొందుతారు. ప్రయత్న కార్యాలన్నీ సంపూర్ణంగా ఫలిస్తాయి. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరతాయి. సంపూర్ణ ఆరోగ్యవంతులుగా నుంటారు. ఇతరులకు ఉపకరించు పనులు చేపడతారు. గౌరవమర్యాదలు లభిస్తాయి. శుభవార్తలు వింటారు. ఆకస్మిక ధనలాభయోగముంటుంది. కుటుం బంలో సంతృప్తికరంగా ఉంటారు. పేరు, ప్రతిష్ఠలు లభిస్తాయి. సంఘంలో గౌరవమర్యాదలుంటాయి. అంతటా అనుకూల వాతావరణ మేర్పడుతుంది. స్త్రీలు సౌభాగ్యాన్ని పొందుతారు. బంధు, మిత్రులు కలుస్తారు.



**కుంభం** (ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం 4 పాదాలు, పూర్వాభాద్ర 3 పాదాలు)

కోపాన్ని అదుపులో నుంచుకొనుట మంచిది. మానసికాందోళనను తొలగించుటకు దైవధ్యానం అవసరం. శారీరక అనారోగ్యంతో బాధపడతారు. కుటుంబ విషయాలు సంతృప్తికరంగా నుండవు. వృధా ప్రయాణాలెక్కువవుతాయి. ధనవ్యయం తప్పదు. అనారోగ్య బాధలను అధిగమిస్తారు. నూతన కార్యాలకు ఆటంకాలున్నా సత్ఫలితాలు పొందుతారు. ప్రయాణాల్లో జాగ్రత్త అవసరం. వృత్తి, వ్యాపార రంగాల్లో ధననష్టమేర్పడకుండా జాగ్రత్త వహించాలి. ఆత్మీయుల సహాయ, సహకారాలకై వేచివుంటారు. దైవదర్శనం లభిస్తుంది. కుటుంబకలహాలు దూరమవుతాయి. ప్రయత్నకార్యాలకు ఆటంకాలెదురవుతాయి.



**మీనం** (పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర 4 పాదాలు, రేవతి 4 పాదాలు)

బంధు, మిత్ర విరోధమేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది. మానసికాందోళన అధికమగును. అనారోగ్య బాధలను అధిగమిస్తారు. అనవసర నిందలతో అపకీర్తి వస్తుంది. స్థిరమైన నిర్ణయాలు తీసుకోలేరు. నూతన కార్యాలకు ప్రణాళికలు వేస్తారు. ప్రయత్నకార్యాలన్నీ వెంటనే ఫలిస్తాయి. ఆకస్మిక ధనలాభమేర్పడుతుంది. సంపూర్ణ ఆరోగ్యంగా వుంటారు. నూతన వస్తు, ఆభరణాలను పొందుతారు. కుటుంబ సౌఖ్యం లభిస్తుంది. ఋణబాధలు తొలగిపోతాయి. ధైర్యసాహ సాలతో ముందుకు వెళ్తారు. ఆకస్మిక ధననష్టం పట్ల జాగ్రత్త అవసరం.

**- గౌరీభట్ల రామకృష్ణ శర్మ**

## పదసంపద-258

| 1 | 2 | 3 | | ✡ | 4 | 5 | 6 | 7 |
|---|---|---|---|---|---|---|---|---|
| 8 | 9 | | ✡ | 10 | ✡ | 11 | | |
| 12 | | ✡ | 13 | | | ✡ | 14 | |
| | ✡ | 15 | ✡ | | ✡ | 16 | ✡ | |
| ✡ | 17 | | | | 18 | | | ✡ |
| 19 | | | ✡ | 20 | | | ✡ | 21 |
| 22 | | ✡ | 23 | | | ✡ | 24 | |
| 25 | | 26 | ✡ | | ✡ | 27 | | |
| 28 | | | | ✡ | 29 | | | |

# ఆధారాలు

### అడ్డం

1. అభంగాలు రచించి తరించిన పాండురంగని భక్తుడు (4)
4. ప్రసిద్ధ నదులతో సంగమించే చిన్న(న)ది (4)
8. మంచునుండి పుట్టినది (3)
11. అన్న భార్య పాపం అటిటయింది (3)
12. నాన్న గారాబంగా పిలిచేసరికి ఇలా (2)
13. కరుణ రసానికి స్థాయీభావము (3)
14. తలవెంట్రుక (2)
17. ఉత్పలమాల-గణించేదిలా (7)
19. అతనిచేతిలోని వాద్యానికి, అతనికీ ఇదేపేరు (3)
20. ధ్వని (3)
22. ఇటునుంచి వంగిన, అటునుంచి తనదే ఐన (2)
23. అణువు, బిందువు, సూక్ష్మ మైన (3)
24. బొడ్డు (2)
25. సమత్వ మరోలా (3)
27. ఉరక, తీరిక లాగా తెలియక కాకపోతే అటునుంచి (3)
28. గౌతమీపుత్రుడితడు (4)
29. సంపదలనిచ్చేది (4)

### నిలువు

1. మంచుకొండ (4)
2. మనతో ముగిసే కోరిక (3)
3. చంద్ర, అధిప (3)
5. పదములు గలది, చేతుల వేళ్ళ సంఖ్య (2)
6. పైనుంచి కొత్తదైన, కిందినంచి కవిత్వ (3)
7. రోజూ చేసేపని (వ్రాసుకొని పెట్టుకుంటారు కొందరు) (4)
10. శివుని అలంకారం, ఒక రాగం,(సం)చలన చిత్రం (7)
15. విధానము (3)
16. పాలు (3)
17. మాతలకుమాత, సకల సంపత్సమేత (5)
18. ఈ జన్మము (3)
19. తలకిందులైన రాజునాజ్ఞ (4)
21. నేత్రములు చివర గలిగిన గొప్ప నటి (4)
24. కలహభోజనుని పిలుద్దామా! (3)
26. ఆకలితో అలమటించడం అనే ధ్వన్యనుకరణ జంట పదంలో సగం (2)
27. 26నిలువులో మిగతాసగం కాకపోతే తలకిందులుగా (2)

ప
ద
సం
ప
న్ను
లు

పేరు ____________________

విలాసం ____________________

____________________

పిన్ ____________ ఫోన్ ____________

పద సంపద సమాధానాలను ఈ నెల 15 తేదీలోగా మా చిరునామాకు పంపాలి.

**దర్శనమ్** ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక

ఇం.నెం. 29-105/4/1, న్యూ విద్యానగర్, నేరేడ్‌మెట్, సికింద్రాబాద్-56

మీ అభిప్రాయాలను baludarshanam@gmail.comకు పంపగలరు.

### పదసంపద-257 సమాధానాలు

| 1 ప | ర | 2 మే | ష్ఠి | ✡ | 3 సా | 4 మ | వే | 5 దం |
|---|---|---|---|---|---|---|---|---|
| రా | ✡ | డి | ✡ | 6 శ్రీ | ర | స్తు | ✡ | డ |
| 7 భ | వ్యా | ✡ | 8 తా | మ | స | ✡ | 9 ట | పా |
| 10 వ | సు | 11 ధా | ✡ | ద్రా | ✡ | 12 ఆ | ✡ | ణి |
| ✡ | 13 ని | రు | ప | మా | న | ము | ✡ | ✡ |
| 14 రా | ✡ | ణి | ✡ | య | ✡ | 15 దం | 16 ము | 17 కు |
| 18 వి | 19 ప్ర | ✡ | 20 వ్ర | ణ | ము | ✡ | 21 ణ | జా |
| ✡ | 22 సా | 23 మ | జ | ము | ✡ | 24 ఆ | వ | ల |
| 25 ఉ | దం | త | ము | ✡ | 26 మ | హా | ల | యం |

### జూలై నెల విజేతలు

**భండారు శ్రీనివాసరావు**
ఎల్లారెడ్డిగూడ, హైదరాబాద్

**గుడి చంద్రశేఖర్**
పెద్దశంకరంపేట్, మెదక్ జిల్లా

**రంగి సత్యనారాయణ**
చైతన్యపురి, హైదరాబాద్

**గుళ్లపల్లి ఉదయ కుమార్**
విజయవాడ

**రాయపెద్ది అప్పాశేషశాస్త్రి**
శ్రీనివాస నగర్, ఆదోని

**కీసర ఇషన్వీశర్మ**
మిల్టన్, కెనడా

**పద సంపాదకులు : ఎం. దత్తాత్రేయశర్మ**

Edited Printed, Published and Owned by Marumamula Rukmini, Printed at Capital Graphics, 118 Chenoy Trade Centre, Parklane, Secunderabad-500003, Published at 601, Chenoy Trade Centre, Parklane, Secunderabad-500003, Editor: Marumamula Rukmini.




నేపాల్ రాజ్యంలో శృంగేరీ జగద్గురువుల ధర్మవిజయయాత్రపై దర్శనమ్ ప్రచురించిన విశిష్ట సంచికను ఆవిష్కరించి అనుగ్రహించిన జగద్గురుశంకరాచార్య శ్రీశ్రీశ్రీ విధుశేఖరభారతీసన్నిధానం వారు







శ్రీగురుమదనానందసరస్వతీ పీఠాధిపతులు,శ్రీసదానంద మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ మాధవానందసరస్వతీస్వామి వారికి **దర్శనమ్** కార్యాలయం శ్రీభారతీతీర్థ గ్రంథాలయంలో పాదుకాపూజ నిర్వహించిన దృశ్యాలు





**దర్శనమ్** కార్యాలయం శ్రీభారతీతీర్థ గ్రంథాలయంలో నెలనెలా అష్టావధానం పరంపరలో అవధాన బాలసరస్వతి కుమారి జయలక్ష్మి సంస్కృత అష్టావధానం దృశ్యాలు

RNI Regd No. APTEL/2005/16209
Date of Publication : 25th of Every Month
Date of Posting : 28th & 29th of Every Month

DARSHANAM
AUGUST - 2026

Postal Regd.No. HQ/SD/508/2025-2027
WPP NO:PMG/TS/HQR/SC-01/WPP/2025-2027
Licensed to Post Without Prepayment
Posting at B.P.C - IV Patrika Channel,Nampally,Hyderabad-01




PM Hoist Double Cage, Hyderabad




PM Hoist with 12mts Horizontal rebar carrier, Vijayawada



Curved Hoist Bangladesh

# CMAC

Mechanisation & Automation in Construction

ISO 9001:2015 CERTIFIED COMPANY
AND
CE CERTIFIED COMPANY

## Equipments & Solutions for Infrastructure fraternity. Residential, Commercial Infrastructure, Power, Steel, Cement & Industrial Infra

Innovation with safety & Sustainability
Export them as Made in India




Multi Functional Hoist, Nagpur



MFH - CMAC Rambo with Rebar Carrier, Delhi



Chimney SRP, Mumbai




Pre Cast Panel Movement SRP, Hyd.



Anji Khad Cable Stayed Bridge Project,
Dist.: Reasi, Jammu




PMH at Pump House, Kaleshwaram




Bridge Special SRP at Durgam Cheruvu,
Cable Stayed Bridge, Hyd.

**ConMechAuto Consultants India Pvt Ltd.,**
**Head Office :** # 1-3-183/40/19, 2nd Floor, SBI Colony,
Gandhi Nagar, Hyderabad - 500 080, India.
Tel. No.: + 91- 40 - 2754 1464

**Factories :**
Phase 2, Phase 5, IDA Cherlapally,
Hyderabad - 500 051

## For Further Details:

**CONTACT : 9393 111 464**

**Email : sales@cmac.co.in**
**www.cmac.co.in**

*If Undedelivered please return to:*
**DARSHANAM Devotional Magazine,Srirama Siddhanthi Bhavanam, H.No.29-105/4/1
Rythu Bazar Road, New Vidyanagar Colony, Neredmet, Secunderabad, 500056
Mobile 7013093123, 9441015469** *e mail: darshanameditordesk@gmail.com*